ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

జెకెలో మసీదులను జల్లెడపడుతున్న పోలీసులు 5

మాజీ సిఎం రోశయ్య సతీమణి కన్నుమూత 6

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-1-2026 మంగళవారం సంపుటి: 31 సంచిక: 343 పేజీలు: 10+4 వెల: 6.50




# జిల్లాలు మళ్లీ మారుస్తాం

## గతంలో తప్పులతో జరిగిన పునర్విభజన

## రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో త్వరలో కమిషన్

## ప్రభుత్వ ఉద్యోగులే సర్కార్ సారథులు

## కెసిఆర్ విశ్రాంతిలో ఉన్న శుక్రాచార్యుడు

### గెజిటెడ్ అధికారుల కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి12:** 'జిల్లాలు, మండలాల రేషనలైజేషన్ విషయంలో పలు విజ్ఞప్తులు, డిమాండ్స్ వచ్చాయి. గతంలో జిల్లాలు, మండలాలను ఇష్టం వచ్చినట్లుగా విభజించారు జిల్లాలు, మండలాల పునర్ వ్యవస్థీకరణకు త్వరలోనే రిటైర్డ్ హైకోర్టు లేదా సుప్రీంకోర్టు జడ్జి నేతృత్వంలో వివిధ రంగాల నిపుణులు, ఉన్నతాధికారులతో ఒక కమిషన్‌ను నియమిస్తాం' అని తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అని రాష్ట్రంలో రాజకీయ దుమారం లేపారు.కమిషన్ ఆరు నెలల పాటు రాష్ట్రమంతా క్షేత్ర స్థాయిలో పర్యటించి జిల్లాలు, మండలాల రేషనలైజేషన్ విషయంలో ప్రజల సూచనలు, సలహాలు తీసుకుంటుంది. బడ్జెట్ సమావేశంలో అన్ని రాజకీయ పార్టీలతో కూలంకషంగా చర్చించి విధి విధానాలు ఖరారు చేస్తాం, కమిషన్ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకుంటా' అని వెల్లడించారు. సోమవారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ 2026 డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులందరికీ, రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంఘాల నాయకులు ప్రభుత్వంతో కుమ్మక్కయ్యారని అనుకుంటున్నారని చెబుతున్నారు. మనమంతా ఒకే కుటుంబం.. కుటుంబంలో కుమ్మక్కులు ఏం ఉంటాయి అని పేర్కొన్నారు..మీరు, మేము వేరువేరు కాదు.. ఉమ్మడి కుటుంబంలో కలిసి ఉంటే చూడలేని వారు, కడుపులో విషం పెట్టుకునే వారు ఎప్పుడూ ఉంటారు అని వ్యాఖ్యానించారు. దేవతలు కూడా యజ్ఞం చేస్తుంటే రాక్షసులు భగ్నం చేయడానికి ప్రయత్నించారు. శుక్రాచార్యుడు ఫామ్ హౌస్ లో ఉండి అసెంబ్లీకి మారీచుడు లాంటి వాళ్లను పంపిస్తున్నారు అని ప్రతిపక్ష నేత కెసిఆర్ తీరుపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పెద్ద దిక్కుగా ఉండాల్సిన వ్యక్తి ఇప్పుడు ఫామ్‌హౌస్‌లో హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నారని విమర్శించారు. గతంలో మల్కాజిగిరి జెడ్పీ సమావేశంలో తాను చూసిన విచిత్ర పరిస్థితులను గుర్తు చేస్తూ, సరిహద్దుల విషయంలో ఉన్న అపోహలను

>>2

ప్రభుత్వ ఉద్యోగులకు 3.64% డిఎ పెంపు 2



అహ్మదాబాద్‌లో సోమవారం పతంగ్‌లను ఎగురవేస్తున్న జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, ప్రధాని మోడీ

## భారత్-జర్మనీ మధ్య

# వ్యూహాత్మక భాగస్వామ్యం

### రక్షణ, భద్రతారంగాల్లో పరస్పర సహకారం

### ఎఐ, సెమికండక్టర్, స్పేస్‌లో తోడ్పాటు

### జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్‌తో ప్రధాని మోడీ చర్చలు

**గాంధీనగర్, జనవరి 12:** భారత్ జర్మనీలమధ్య రక్షణ, భద్రత రంగాల్లో పరస్పర సహకారం మరింత పెంపొందించుకునేదిశగా ద్వైపాక్షిక భేటీ జరిగిందని ప్రధానిమోడీ పేర్కొన్నారు. జర్మనీ ఛాన్సలర్‌ఫ్రెడరిక్ మెర్జ్‌తో నిర్వహించిన ద్వైపాక్షిక భేటీ అనంతరం సోమవారం ఇరువురు నేతలు మీడియాతో మాట్లాడారు. రక్షణరంగ వాణిజ్యం మరింత సులభతరం అయిందని ఆయన అన్నారు. పునరుత్పత్తి విద్యుత్‌రంగంలోకూడా భారత్ జర్మనీలు ఒకే విధమైన ప్రాధాన్యతలతోముందుకుపోతున్నాయన్నారు. రెండుదేశాలు ఇడియా జర్మనీ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటుచేసి భవిష్యత్తు సహకారం మరింత పెంపొందించుకుంటామన్నారు. జర్మనీఛాన్సలర్ మెర్జ్‌మాట్లాడుతూ భారత్ జర్మనీ దేశాల దౌత్యబంధం నేటికి 75 ఏళ్లు పూర్తవుతుందని వాణిజ్యం పెట్టుబడులపరంగా మరింత బంధం పెరుగుతుందని, వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త సంకల్పాన్ని ఇస్తుందన్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యానికి 25 ఏళ్లు అవుతున్నదని, దౌత్యసంబంధాలు 75 ఏళ్లుగా కొనసాగుతున్నాయన్నారు. రెండుదేశాలమధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 50 బిలియన్ డాలర్లకు పెరిగిందనిచెప్పారు.యూరోపియన్‌దేశాల కూటమితోజరిగే

>>2



# విఫలం

## ఫలించని పిఎస్ఎల్వి-సి 62 ప్రయోగం

### నాలుగో దశలో సాంకేతిక లోపం

**సూళ్లూరుపేట, జనవరి 12 ప్రభాతవార్త:** ఇస్రో విజయాల పరంపరకు బ్రేక్ పడింది. నూతన సంవత్సర ప్రారంభంలో నిర్వహించిన ప్రథమ ప్రయోగం విఫలమై ఇస్రోలో నిరాశ నింపింది. సోమవారం ఉదయం 10 గంటల 18 నిమిషాలకు శ్రీహరికోటలోని ఫస్ట్ లాంచ్ ప్యాడ్ నుంచి కౌంట్‌డౌన్ పూర్తి కాగానే పిఎస్ఎల్వి-సి62 రాకెట్ నిప్పులు చెరుగుతూ నింగికి ఎగిసింది. 18 నిమిషాల ప్రయోగ గమనం జరగాల్సి ఉండగా, 8 నిమిషాల 41 సెకన్లు మాత్రమే పయనించిన రాకెట్ గ్రౌండ్ స్టేషన్‌తో లింక్ తెగిపోయింది. మొదటి దశ, రెండో దశ, మూడవ దశలు పూర్తయిన తర్వాత నాలుగవ దశలో రాకెట్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపేందుకు మొరాయించింది. అప్పటి నుంచి ప్రయోగం లైవ్ ఇస్తున్న ఇస్రో వర్గాలు లైవ్ లింకును నిలిపేశారు. దీంతో ఏమి జరుగుతుందో తెలియక ప్రతి ఒక్కరు ఉత్కంఠకు గురయ్యారు. నాలుగో దశలో రాకెట్ గమనం గతి తప్పి ఇగ్నిషియం నిలిచిపోవడమే కాకుండా కక్ష్యలోకి వెళ్లకుండా

>>2

300 వీధి కుక్కలు 'హత్య'
హనుమకొండ జిల్లా ఆరెపల్లిలో కుక్కల సామూహిక హననం
ఇద్దరు గ్రామకార్యదర్శులు, ఇద్దరు సర్పంచ్‌లపై కేసు నమోదు 7

# పిటిషన్ ఉపసంహరణ

## పోలవరం - నల్లమల సాగర్‌పై రిట్ నిరుపయోగమన్న సుప్రీం కోర్టు

### పిటిషన్ డిస్పోజ్ చేసినట్లు ప్రకటించిన ధర్మాసనం

### తెలంగాణ తరఫున వాదించిన సీనియర్ లాయర్ అభిషేక్ సింఘ్వీ

### ఆ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సూట్ వేస్తున్నామన్న మంత్రి ఉత్తమ్



సోమవారం సుప్రీం కోర్టు వద్ద మంత్రి ఉత్తమ్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి12:** సుప్రీంకోర్టులో పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టుపై దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం సోమవారం ఉపసంహరించుకుంది. దీంతో పిటిషన్ డిస్పోజ్ ఆఫ్ చేసినట్లుగా ప్రధాన న్యాయమూర్తి ప్రకటించారు. అంతకుముందు నల్లమల సాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో విచారణ ప్రారంభం కాగా, తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. తెలంగాణ దాఖలు చేసిన రిట్ పిటిషన్ వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని న్యాయస్థానం సూచించింది. సూట్ దాఖలు చేస్తే గోదావరి నది పరీవాహక రాష్ట్రాల అభిప్రాయాలు పరిగణనలోకి వస్తాయని ధర్మాసనం పేర్కొంది. ఇంకా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల వాదనలు కూడా వినాల్సి ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈపిటిషన్‌ను కొనసాగించలేమని, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు (మీడియేషన్ లేదా సివిల్ సూట్) ద్వారా పరిష్కారం కోరవచ్చని సూచించింది.ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం నిర్మాణం చేయాలనుకుంటున్న ప్రాజెక్టుపై తమ అభ్యంతరాలతో రిట్ పిటిషన్ వేసినట్లు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఢిల్లీలో మీడియాతో తెలిపారు. ఆర్టికల్ 131 రూపంలో రావాలని సీజేఐ సూచించారన్న మంత్రి ఉత్తమ్, సివిల్ సూట్ రూపంలో మళ్లీ రావాలని న్యాయస్థానం చెప్పిందన్నారు. సీజేఐ సూచన మేరకు పిటిషన్ ఉపసంహరించుకున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున తమ వాదనలు బలంగా వినిపించినట్లు తెలిపారు. గత సోమవారం కూడా విచారణ జరిగిందని, తెలంగాణ ప్రభుత్వం తరఫున తమ వాదనలు వినిపించినట్లు చెప్పారు. గత సోమవారం ఇచ్చిన వాదనలకు అదనంగా ఇవాళ మరి కొన్ని వాదనలు వినిపించామని అన్నారు.కేటాయింపుల కంటే ఎక్కువ నీళ్లు వాడొద్దనేది ఇందులో ముఖ్యమైన అంశమని ఆయన పేర్కొన్నారు.
ఏపీ ప్రభుత్వ ఉల్లంఘనలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చాం, స్టాప్ వర్క్ ఆర్డర్ ను అమలు చేయట్లేదని కూడా కోర్టుకు చెప్పామన్నారు. నీళ్ల విషయంలో ఏపీ ప్రభుత్వం అనేక ఉల్లంఘనలు చేసిందని, వాటన్నింటినీ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చామని ఉత్తమ్ తెలిపారు. ఏపీకి కేటాయించిన 484.5 టీఎంసీల కంటే ఎక్కువగా ఉపయోగించుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఏపీ ప్రభుత్వం గోదావరి, కృష్ణా బోర్డులు, అపెక్స్ కౌన్సిల్

>>2

# ఇరాన్‌పై సైనిక చర్యకు యుఎస్ రెడీ!

## ట్రంప్ తాజా వ్యూహరచన..

### ఇరాన్ రెడ్‌లైన్ దాటుతోంది, జోక్యం చేసుకుంటామని హెచ్చరికలు

### యుద్ధం కోరుకోవడం లేదు, చర్చలకు సిద్ధం: ఇరాన్ విదేశాంగ మంత్రి

5

# 'సుప్రీం' సాక్షిగా సిఎం ద్రోహ బుద్ధి బట్టబయలు

### -మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి12:** సిఎం రేవంత్ రెడ్డి ద్రోహ బుద్ధి సుప్రీంకోర్టు సాక్షిగా బట్టబయలైందని బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావుఆరోపించారు. పోలవరంనల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్ కేసులో తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు అర్హత లేదని సోమవారం సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. ఈ విషయంపై హరీష్ రావు ఒక వీడియోను విడుదల చేశారు.నాడు బీఆర్ఎస్ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో రైతులతో రిట్ వేయించి మరీ ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టుకు స్టే సాధిస్తే, ఇక్కడి చేతగాని కాంగ్రెస్ సర్కారు మాత్రం ఉద్దేశపూర్వకంగానే విచారణ అర్హత లేని పిటిషన్ వేసి తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఈ మాత్రం దానికి ఉత్తమ్ కుమార్ సూటు బూటు వేసుకొని ఢిల్లీ దాకా పోవాల్సిన అవసరం ఉందా? అంటూ ప్రశ్నించారు.
సివిల్ సూట్ ఫైల్ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం చెప్పడం అంటే, పోలవరం- నల్లమల సాగర్ ప్రాజెక్టు కట్టుకోవడానికి ఏపీకి గడువు ఇవ్వడమేనని స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక వాదనలు కూడా వినడం అనేది ఏండ్లు గడిచినా ముగియని కథేనని అన్నారు.
బలహీనమైన రిట్ పిటీషన్ వేసి సంక్రాంతి పండుగ సందర్భంగా రేవంత్ చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించుకున్నాడని విమర్శించారు. గురుదక్షిణ కోసం తెలంగాణకు ద్రోహం చేస్తుంటే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. తప్పకుండా పోరాటం చేస్తామని హరీష్ రావు వెల్లడించారు. కాగా కృష్ణా,గోదావరిజలాల్లో తెలంగాణ హక్కును రేవంత్ ప్రభుత్వం పరిరక్షించలేకపోయిందని

>>2

# చలాన్ పడగానే డబ్బు కట్

### జరిమానాల వసూలుకు నంబర్ ప్లేట్లతో బ్యాంకు ఖాతాలు లింక్

### రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర ప్రణాళిక

### అరైవ్, అలైవ్ కార్యక్రమంలో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి



అరైవ్, అలైవ్ కార్యక్రమంలో సిఎం రేవంత్, మంత్రి పొన్నం, డిజిపి

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర ప్రణాళిక అవసరమని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసు శాఖ పక్కా నివేదిక రూపొందించి అమలు చేయాలని, ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం జరిగిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు దేశటవ్యాప్తంగా అనేక కుటుంబాలను చిన్నాభిన్నం చేయడంతో పాటు జిడిపిలో మూడు శాతం నష్టాన్ని చేకూరుస్తుందని తెలిపారు. రాష్ట్రం వరకు వస్తే వీటిని కచ్చితంగా నివారించాల్సిందేనని, ఈ విషయంలో పోలీసు, రవాణా శాఖలు భాగస్వామ్యం అయితే సరిపోదని, ప్రజలు తమ

>>2

# విఫలం

>> పల్టీలు కొట్టింది. మూడో దశల గమనం విజయంపై మిషన్ కంట్రోల్ సెంటర్‌లో శాస్త్రవేత్తలు, ఇస్రో మాజీ ఛైర్మన్లు, డైరెక్టర్లు అప్పటి వరకు చప్పట్లు, హర్షధ్వానాలు చేశారు. నాలుగో దశలో రాకెట్ గమనాన్ని చూసి ఒక్కసారిగా నిశ్చేష్టులయ్యారు. ఛైర్మన్ వి.నారాయణన్, డైరెక్టర్ ఇఎస్ పద్మకుమార్‌లు, శాస్త్రవేత్తల బృందం ఏమి జరిగిందో అర్ధంకాక ఒకింత ఆందోళనకు గురయ్యారు. మిషన్ కంట్రోల్ సెంటర్లో నిశ్శబ్ధ వాతావరణం అలముకుంది. ప్రయోగంలో 380 సెకన్ల గమనం నుంచి ప్రారంభమైన సమస్య 390 సెకన్ల మరింత ఎక్కువైంది. 505 సెకన్లకు చేరుకునే సరికి గ్రౌండ్ స్టేషన్‌తో లింకులు తెగిపోయి టెలిమెట్రి డేటా పూర్తిగా ఆగిపోయింది. దీంతో మీడియా సెంటర్‌లో ఉన్న మీడియా ప్రతినిధులు ఈ పరిస్థితిపై ఆరా తీయడం ప్రారంభించారు.

**విఫల ప్రయోగంపై విశ్లేషిస్తున్నాం**

పిఎస్ఎల్‌వి-సి62 రాకెట్ విఫల ప్రయోగంపై పూర్తిస్థాయిలో విశ్లేషిస్తున్నామని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. పిఎస్ఎల్‌వి-సి62 ప్రయోగం విఫలమైన అనంతరం ఆయన మీడియా సెంటర్‌కు వచ్చి మాట్లాడారు. పిఎస్ఎల్‌వి రాకెట్ ప్రయోగం మొదటి దశలో ఘన ఇంధనం, రెండో దశలో ద్రవ ఇంధనం, మూడో దశలో ఘన ఇంధనం, నాలుగో దశలో ద్రవ ఇంధనం నింపి రాకెట్ ప్రయోగాన్ని పూర్తి చేసే విధంగా రూపొందించామన్నారు. ప్రస్తుతం మూడో దశలు సాఫీగానే జరిగినప్పటికీ నాలుగో దశలో అవరోధాలు ఏర్పడటంతో గ్రౌండ్ స్టేషన్‌తో రాకెట్ సంబంధాలు తెగిపోయాయన్నారు. దీంతో భూభాగంలోని వివిధ కంట్రోల్ సెంటర్ల నుంచి సమాచారం తెప్పించుకుని ప్రయోగం విఫలమైన కారణాలపై విశ్లేషిస్తున్నామని చెప్పారు. ఇందుకు సంబంధించి వైఫల్య విశ్లేషణ కమిటీని ఏర్పాటు చేసినట్లు నారాయణన్ తెలిపారు. ఇది పిఎస్ఎల్‌వి-సి61 విఫలం తర్వాత జరిగిన 8 నెలల తర్వాత జరిగిన ప్రయోగం.

# చలాన్ పడగానే డబ్బు కట్

>> వంతు సహాయం అందించాలని ఆయన కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ చేబట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమం ఎంతో మంచిదని ఆయన కొనియా డారు. దేశంలో ప్రతీ నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుందని సిఎం తెలిపారు. విద్యార్థి దశ నుంచే రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్‌పై అవగాహన కలిగించాలని, తద్వారా విద్యార్థులు భవిష్యత్తులో తప్పిదాలకు దూరంగా వుండే వీలుంటుందని సిఎం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛ ంద సంస్థల ప్రతినిధులతో కలిసి పోలీసులు నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమం మెరుగైన ఫలితాలను ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చట్టాలను అమలు చేయాలని సిఎం కోరారు. రోడ్డు ప్రమాదాల అంశాన్ని తమ సర్కారు తీవ్రమైన సమస్యగా భావిస్తోం దని సిఎం తెలిపారు. యుద్దంలో సైనికుల మరణాల కంటే రోడ్డు ప్రమాదాలలో చనిపోతున్న వారి సంఖ్య ఎక్కువగా వుంటోందని ఆయన తెలిపారు.ట్రాఫిక్ చలాన్ల విషయంలో ఇకముందు ఎలాంటి రాయితీలు, తగ్గింపులు వుండబోవని సిఎం తేల్చిచెప్పారు. చలాన్ల విషయంలో కఠినంగా ఉండాలని, ట్రాఫిక్ చలాన్ల వసూలుకు వాహ నాల నంబర్ ప్లేట్లను వాహనదారుల బ్యాంకు ఖాతాలకు అనుసంధానం చేయాలని, వాహనంపై చలాన్ పడిన వెంటనే బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యేలా చూడాలి, ఎప్పటి చలాన్ల వసూలు అప్పుడే వసూలయ్యే వీలుం టుందని సిఎం తెలిపారు. ట్రాఫిక్ వ్యవస్థ ఆరో వేలుగా తయారయ్యిందని, ఈ విధానం మారాలని ఆయన తెలిపారు. ట్రాఫిక్ చలాన్ల వసూలుకు సాంకేతికను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. సిగ్నలింగ్, ట్రాఫిక్ వ్యవస్థపై అవగాహన కలిగించి, ట్రాఫిక్ పోలీసు విభాగాన్ని ప్రక్షాళన చే యాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ నియంత్రణను మొదటి ప్రాధాన్యత అంశంగా పరిగణించాలని, ఇందుకు వెంటనే కసరత్తులు చేయాలని ఆ యన ఆదేశించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనాల యజమానులపై కేసులు నమోదు చేయాలని సిఎం ఆదేశించారు. అనేక అంశాలలో రాష్ట్ర పోలీసు శాఖ దేశానికి రోల్‌మాడల్‌గా వుందని సిఎం కొనియాడారు. మారిన పరిస్థితుల్లో పిజికల్ క్రైంతో పాటు సైబర్ నేరాలు పెరిగాయని, అయితే సైబర్ నేరాల నివారణలో తెలంగాణ టాప్‌లో వుందని. డ్రగ్స్ కట్టడిలో హైదరాబాద్ దేశంలోనే మొదటి స్థానంలో వుందని సిఎం తెలిపారు. రాష్ట్రం లో సైబర్ నేరాల నివారణకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందు కు ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేయగా ఈ రెండు విభాగాలు నేరగాళ్లను వెంటాడి మరీ ప ట్టుకుంటున్నాయని ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా సైబర్ నేరాలు పెరిగితే రాష్ట్రంలో తగ్గడం సై బర్ సెక్యూరిటీ బ్యూరో ఘనతగా సిఎం అభినందించారు. డ్రగ్స్ కట్టడిలో హైదరాబాద్ మొదటి స్థానంలో నిలవడంలో ఈగల్ పోలీసుల కృషి వుం దని సిఎం తెలిపారు. డ్రగ్స్ కట్టడికి ఈగల్ పోలీసులు దేశ వ్యాప్తంగా స్మగ్లర్ల నెట్ వర్క్‌పై చేస్తున్న దాడులు ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ పోలీసు శాఖకు మంచి పేరు తెచ్చి పెట్టిందని ఆయన తెలిపారు. అయితే సైబర్ క్రైం, డ్రగ్స్ కేసుల కంటే రోడ్డు ప్రమాదాలు తీవ్రమైన అంశంగా మారిందని రేవంత్ రెడ్డి తెలిపారు.

**చెరువుల పునరుద్దరణకు హైడ్రా ఏర్పాటు**

జంట నగరాలు, శివార్లలో చెరువులు, కుంటల పునరుద్దరణకు హైడ్రాను ఏర్పాటు చేశామని, ఈ విభాగం ఏర్పాటయ్యాక అనేక చెరువులకు జలకళ వచ్చిందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆక్రమణలో వున్న అనేక చెరువులను హైడ్రా కాపాడి వాటిలో నీరు వుండేలా చేసిందని, దీనివల్ల ఆయా ప్రాంతాలలో భూగర్భ జలాలు పెరిగాయని ఆయన తెలిపారు. హైడ్రాకు అనేకచోట్ల ప్రజలు స్వచ్ఛందంగా బ్రహ్మరథం పడుతున్నారని ఆయన తెలి పారు. హైడ్రా వల్ల అనేక చెరువులు, కుంటలకు మళ్లీ ప్రాణం వచ్చిందని సిఎం తెలిపారు. అంతకు ముందు అరైవ్ అలైవ్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సిఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఇదే సమయంలో థీం సాంగ్‌ను కూడా ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి ఆనంగ్, డిజిపి శివధర్ రెడ్డి, సిటీ కొత్వాల్ సజ్జన్నార్, సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు కూడా పాల్గొన్నారు. వీరితో పాటు స్టేడియంలో భారీ సంఖ్యలో విద్యార్థులు హాజరై కార్యక్రమా న్ని హోరెత్తించారు.

# సిఎం ద్రోహ బుద్ధి బట్టబయలు

>> మరోసారి స్పష్టమైందని ఆమె అన్నారు. నీటి పంపకాల విషయంలో పొరుగు రాష్ట్రాలతో వివాదాలు వద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన న్యాయపోరాటంలో ప్రతిబింబించిందని ఆమె విమర్శించారు. ఆయన వ్యాఖ్యలు, ప్రభుత్వ వైఖరి తెలంగాణ రాష్ట్రానికి దురదృష్టకరమని ఆమె అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సహకారంతో అక్రమంగా నిర్మిస్తున్న పోలవరం నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుపై విచారణకు అర్హత లేని పిటిషన్ వేసి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రం హక్కులను నిర్వీర్యం చేసిందని ఆమె ఆరోపించారు. సిఎం రేవంత్ రెడ్డికి, ప్రభుత్వంలోని ఇతర ముఖ్య నాయకులకు నీటి వనరులపై అవగాహన లేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా తెలంగాణ జాగృతి న్యాయపోరాటం చేస్తుందని, తెలంగాణ హక్కుల పరిరక్షణ ధ్యేయంగా ఉద్యమిస్తుందని ఆమె స్పష్టం చేశారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు 3.64% డిఏ పెంపు

**హైదరాబాద్, ప్రభాతవార్త, జనవరి 12:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి పండుగ కానుకను ప్రకటించింది. ప్రభుత్వ ఉద్యోగులకి 3.64 శాతం డియర్‌నెస్ అలవెన్స్(డిఏ)ను పెంచుతున్నట్టు ప్రకటించింది. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పెన్షనర్లకు డిఏ పెంపును అమలు చేయనున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల డిఏ పెంపుకి సంబంధించి జీవో ఎంఎస్ నంబర్ 2ను, పెన్షనర్ల డిఏ పెంపుకి సంబంధించి జీవో ఎంఎస్ నంబర్ 3ను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సోమవారం జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగుల డిఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. 2024 జులై 1 నుంచి పెరిగిన డిఏ వర్తించనుండగా, జనవరి నెల వేతనంతో పెరిగిన డిఏను ఫిబ్రవరి 1న చెల్లించనున్నారు. 2023 జులై 1 నుంచి 2025 డిసెంబర్ 31 వరకు ఉన్న డిఏ బకాయిలను ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనున్నట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు. ప్రసుతం ఉద్యోగులకు 30.03 శాతం డిఏ అమలు చేస్తున్నందున.. జనవరి నుంచి 33.67 శాతానికి డిఏను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిఏ పెంపు జిల్లా పరిషత్, మున్సిపాటీ ఉద్యోగులకు, యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు కూడా వర్తించనుంది. ఈ జనవరి జీతంతో కలిపి డీఏ చెల్లించనుంది. జులై 2023 నుంచి డిసెంబర్ 2025 వరకు ఉన్న బకాయిలను జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేయనుంది. రిటైర్ అయ్యే ఉద్యోగులకు 30 విడతల్లో బకాయిలు చెల్లించనుంది. పార్ట్ టైం అసిస్టెంట్లు, వీఆర్ఏలకు నెలకురూ.100 అదనంగా చెల్లించనున్నట్టు ఉత్తర్వులో పేర్కొంది. డిఏ పెంపు మూలంగా పభుత్వంపై నెలకు సుమారు రూ. 227 కోట్ల అదనపు భారం పడనుంది.

**ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల హర్షం..**

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు డిఏ పెంచుతూ ఉత్తర్వులు ఇవ్వడంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు హర్షం ప్రకటించాయి. డిఏ పెంపు పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క టిఎన్‌జీవో కేంద్ర సంఘం కృతజ్ఞతలు తెలిపింది. డిఏ(3.64 శాతం) ను విడుదల చేసిన సిఎం రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి యావత్ మంత్రిమండలి సభ్యులకు, ప్రభుత్వప్రధాన కార్యదర్శికి ఉన్నతాధికారులకు తెలంగాణ ఎన్‌జీవోల కేంద్ర సంఘం పక్షాన హర్షాన్ని ప్రకటిస్తూ ప్రభుత్వానికి సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేన్ ముజీబ్ ధన్యవాదాలు తెలియజేశారు.

## వారం - వర్జ్యం

13-01-2026, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం,ఉత్తరాషాఢ కార్తె
దశమి మ.3.18, విశాఖ రా.12.06
వర్జ్యం : తె.4.35-6.23
దు.ఉ.8.55-9.40, 2) రా.10.24-11.08
శుభసమయం : ఉ.10.00-10.45,
సా.6.30-7.15
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన వ్యవహారాలు ఆలస్యంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**వృషభం:** విధుల నిర్వహణలో గానీ, వ్యాపారములలో గానీ, మంచి మార్పులు చోటుచేసుకుంటాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

**మిథునం:** నూతన పెట్టుబడుల విషయంలో నిదానం అవసరం. ప్రత్యర్థుల విషయంలో జాగ్రత్తతో మెలగండి.

**కర్కాటకం:** సన్నిహితుల ప్రోత్సాహం ఆశించిన స్థాయిలో లభించదు. సంఘసేవా కార్యక్రమాలకు మీవంతు సాయం అందిస్తారు.

**సింహం:** వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు సమర్థవంతంగా ఎదుర్కొంటారు. వాహనసౌఖ్యం.

**కన్య :** అహంభావ ధోరణిని విడనాడి సహోద్యోగులతో స్నేహభావంతో మెలగడం మంచిది.కాంట్రాక్టులు లాభిస్తాయి.

**తుల :** వివాహాది శుభకార్యాలలో పాల్గొంటారు. సమయానికి నిద్రాహారాలు ఉండవు. విలువైన ఆభరణాలు కొనుగోలు.

**వృశ్చికం:** కొన్ని నిబంధనలను అతిక్రమించవలసి వస్తుంది. దీర్ఘకాలిక సమస్యలకు గాను పరిష్కార మార్గాలు లభిస్తాయి.

**ధనుస్సు:** ఉద్యోగులకు కార్యాలయంలో అనుకూలమైన వాతావరణాన్ని సూచిస్తోంది. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**మకరం:** నిష్కారణమైన చికాకులు తప్పక పోవచ్చు, నూతన ప్రయత్నాలలో పురోగతి ఉంటుంది. ఉద్యోగాలలో మంచి మార్పులు ఉంటాయి.

**కుంభం:** కొత్త విషయాలు తెలుసుకుంటారు. పెద్దవారికి సంబంధించిన విషయాలను పునః పరిశీలించుకుంటారు.

**మీనం :** సెంటిమెంట్లకు ప్రాధాన్యత నిస్తారు. భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదుర్చుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



సబర్మతీ ఆశ్రమంలో రాట్నం తిలకిస్తున్న ప్రధాని మోడీ, జర్మనీ ఛాన్సలర్ మెర్జ్



అహ్మదాబాద్‌లో ద్వైపాక్షిక చర్చలు జరుపుతున్న ఇరుదేశాల అధికారుల బృందాలు

# భారత్-జర్మనీ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

>> వాణిజ్యంలో 25శాతం జర్మనీ వాటాయే ఉందని అన్నారు. ప్రధానిమోడీ మాట్లాడుతూ భారత్‌లో రెండువేలకుపైగా జర్మనీ కంపెనీలు ఉన్నాయని భారత్‌లో అపార అవకాశాలు పుష్క లంగా ఉన్నాయనడానికి ఈ కంపెనీలు దీర్ఘకాలంగా కొనసాగడమేనన్నారు. అంతకుముందు ఇండియా జర్మనీ సిఇఒల ఫోరమ్ బిజినెస్ ప్రతినిధులతో చర్చలుజరిపినట్లు ఇరువురునేతలు వెల్లడించారు. ఐజిసిఎ ఏర్పాటుతో విజ్ఞానం, టెక్నాలజీ, సృజనాత్మకత రంగాల్లో మరింతగా పరస్పరసహకారం పెరుగుతుందని అన్నారు. రక్షణరంగపరిశ్రమలకు సంబంధించి జర్మనీ భారత్‌లు కలిసిమెలిసి పనిచేస్తాయని ఇరువురునేతలు వెల్లడించారు. ఇంటర్నెట్, డేటా సుపరిపాలన, ఎఐ, సెమికండక్టర్స్, ఇండస్ట్రీ 4.0, రానున్న కొత్త టెక్నాలజీలపై రెండుదేశాలు కలిసి పనిచేస్తాయని అన్నారు. అలాగే ఇస్రో, జర్మన్‌స్పేస్ ఏజెన్సీలు రెండూ కూడా కలిసి పనిచేస్తాయని, అంతరిక్ష రంగ విజ్ఞానంపై రెండుదేశాలు కలిసి పనిచేస్తాయని మోడీ, మెర్జ్‌లు వెల్లడించారు. బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థలపై ప్రస్తుతం రెండుదేశాలు కలిసి పనిచేస్తున్నాయని గుర్తుచేసారు.

**పతంగుల వేడుక ప్రారంభించిన మోడీ**

అంతకుముందు గుజరాత్ అహ్మదాబాద్ సబర్మతీ నదీ తీరంలో అంతర్జాతీయ పతంగుల పండుగను ప్రధాని మోడీ ప్రారంభించారు. ఛాన్సలర్ మెర్జ్‌తో కలిసి పతంగులు ఎగురవేసారు. 50దేశాలకు చెందిన ఔత్సాహికులు పాల్గొన్నారని గుజరాత్ సర్కారు వెల్లడించింది. హనుమాన్ పతంగి ఎంతో ఆకర్షణగా నిలిచింది. గత ఏడాది ఈ పండుగలకు 3.83 లక్షలమంది సందర్శకులు రాగా ఈ ఏడాది ఐదులక్షలకుపైగా వచ్చినట్లు సర్కారు వెల్లడించింది. ధోలవీర, ఐక్యతా విగ్రహాలు కూడా సందర్శిస్తుండటంతో పర్యాటకానికిరాబడులు పెరుగుతున్నట్లు నిర్వాహకులు హర్షం ప్రకటించారు.

# పిటిషన్ ఉపసంహరణ

>> అనుమతులు లేకుండా ముందుకెళ్తోందని ధర్మాసనానికి చెప్పామన్నారు. అనుమతులు లేకుండా పోలవరం నుంచి బనకచర్ల లేదా నల్లమల సాగర్‌కు లింక్ చేసేందుకు ఏపీ ప్రభుత్వం చేపడుతున్న విస్తరణ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తక్షణమే ఈ పనులు ఆపేలా ఆదేశించాలని న్యాయస్థానాన్ని కోరింది. పోలవరం ప్రాజెక్టు విస్తరణ పనులు చేపట్టడం చట్టబద్ధం కాదని, తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రీ ఫీజిబులిటీ రిపోర్టులను కేంద్ర ప్రభుత్వం పరిశీలించటం సమంజసం కాదని తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఈ అంశాల్లో కేంద్ర జల సంఘం, కేంద్ర జలశక్తిశాఖ, గోదావరి నదీ యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ)లకు స్పష్టమైన ఆదేశాలివ్వాలని తెలంగాణ సుప్రీంకోర్టును కోరింది. కేంద్ర జలసంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా ఏపీ సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు తయారీకి సిద్ధపడుతోందని, వెంటనే ఈ చర్యలను ఆపాలని కోరింది. ఏపీ తలపెడుతున్న ఈ విస్తరణ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వకుండా, కేంద్రం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందించకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలని రిట్ పిటిషన్‌లో ప్రస్తావించిన సంగతి తెలిసిందే.

**పోలవరం-నల్లమలసాగర్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో వెంటనే సూట్: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ తెలంగాణా ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టులో మరో సూట్ దాఖలు చేయబోతున్నామని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం చేసిన మార్గదర్శాలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం తరపున సూట్ వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.రిట్ పిటిషన్ కంటే సూట్ ద్వారానే గోదావరి జలాలపై అంతర్ రాష్ట్రలతో సమగ్ర విచారణకు ఆస్కారం ఉంటుందన్న సుప్రీంకోర్టు సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం సూట్ వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తెలంగాణా ప్రభుత్వం సుప్రీంకోర్టు లో దాఖలు పరిచిన రిట్ పిటిషన్ పై సోమవారం జరిగిన వాదనలకు ఆయన స్వయంగా హాజరయ్యారు. అనంతరం సుప్రీంకోర్టు వెలుపల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంతర్ రాష్ట్ర జల నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నందున తెలంగాణాకు చెందాల్సి న న్యాయమైన నీటి వాటాను కాపాడుకోవడంలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. తెలంగాణాకు చెందాల్సి న ప్రతీ నీటి బొట్టును పరిరక్షి ంచుకోవడమే రాష్ట్ర ప్రభుత్వం ముందున్న కర్తవ్యమని,తెలంగాణా హక్కులను కాపాడుకోవడంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. గోదావరి జలాశయాలలో అంతర్ రాష్ట్రాల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవడంతో పాటు తెలంగాణా రాష్ట్ర హక్కులకు భంగం వాటిల్ల కుండా సమగ్రమైన సమాచారంతో తెలంగాణా రాష్ట్రం తరపున వాదిస్తున్న సీనియర్ సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ సంఘ్వి కోర్టు సూచనలకు సూట్ దాఖలు వేయబోతున్నట్లు ఆయన చెప్పారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన సూచనలకు అనుగుణంగానే రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నామని వెంటనే సూట్ దాఖలు చేయనున్నట్లు ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టు ముమ్మాటికి నిబంధనలను ఉల్లంఘించడమేనని ఆయన తెలిపారు. అదే నిర్మాణం జరిగితే తెలంగాణా రాష్ట్రంలోని దిగువ ప్రాంతాలలో నీటి వనరులను కోల్పోయే పరిస్థితి ఉత్పన్నం కావొచ్చని ఆయన చెప్పారు. వీటన్నింటినీ గమనంలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణా రైతాంగానికి,భవిష్యత్ తరాలకు ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకుండా ఉండేందుకే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు పరచనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.



సోమవారం హైదరాబాద్‌లో గెజిటెడ్ అధికారుల సంఘం కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

# జిల్లాలు మళ్లీ మారుస్తాం

>> తొలగిస్తామన్నారు. రాచకొండకు ఉన్న దొరల కొండ అనే పేరు మార్చి ప్రజల పేరు పెట్టానని, పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగుల బెనిఫిట్స్‌కు సంబంధించి రూ.11వేల కోట్ల బకాయిలు, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి న బకాయిలు రూ.40వేల కోట్లు, సింగరేణి విద్యుత్ సంస్థకు బకాయిలు మొత్తంగా 1.11లక్షల కోట్ల బకాయిలు ఉన్నాయని, బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు అదనం, అన్నింటిని లెక్కలు కడితే గత ప్రభుత్వం రూ.8.11 లక్షల కోట్ల అప్పుల భారాన్ని మా ప్రభుత్వంపై మోపి వెళ్లిందన్నారు.అందుకే అధికారం చేపట్టిన వెంటనే ఆర్థిక పరిస్థితిపై అసెంబ్లీలో శ్వేతపత్రం ప్రవేశపెట్టి చర్చకు పెట్టామన్నారు. వీటన్నింటినీ క్రమేపి చెల్లించడానికి నెలకు రూ.30వేల కోట్లు అవసరం ఉండగా, ఇప్పుడు రాష్ట్రానికి ఆదాయం రూ.18 వేల కోట్ల నుంచి రూ.18,500 వస్తుందని, కానీ ప్రతీ నెలా రూ.22 వేల కోట్లు అప్పులకు చెల్లించాల్సి న పరిస్థితి ఏర్పడిందన్నారు. సగటు మధ్యతరగతి వ్యక్తి గౌరవంగా కుటుంబాన్ని ఎలా ముందుకు తీసుకెళ్తున్నారో.. ప్రభుత్వానిది కూడా అదే పరిస్థితి అని చెప్పారు. మనందరం కలిసికట్టుగా ముందుకు వెళ్లడం వల్లే సమాజంలో తెలంగాణ గౌరవం నిలబడిందన్నారు. ప్రభుత్వాన్ని నడిపేది కేవలం ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రమే కాదు పదిన్నర లక్షల మంది ఉద్యోగులు కూడా ఇందులో భాగస్వాములే అని చెప్పారు. మీరే మా సారథులు, మా వారధులు..మీ సోదరుడిగా మీకు అండగా ఉంటా.. గతంలో మీ జీతాలు ఎప్పుడొచ్చేవి.. ఇప్పుడు ఎప్పుడు వస్తున్నాయో ఒకసారి ఆలోచించండి అని చెప్పారు. సంక్రాంతి కానుకగా మీ డీఏపై సంతకం చేసి వచ్చా,దీంతో ప్రభుత్వానికి రూ.225 కోట్ల భారం పడుతుంది అని చెప్పారు. మీ ఆరోగ్య భద్రత విషయంలో పూర్తిస్థాయిలో భరోసా ఇచ్చే చర్యలు తీసుకుంటాం అని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగికి రూ.1.02కోట్ల ప్రమాద బీమా పథకాన్ని త్వరలో అమలు చేస్తాం, ప్రణాళికలు రూపొందిస్తున్నాం అని చెప్పారు. సదవీ విరమణ వయసును 58 నుంచి 61కు పెంచిన పరిణామాల వల్ల ప్రస్తుతం ప్రతి నెలా దాదాపు వెయ్యి మంది పదవీ విరమణ చేస్తున్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం అని పేర్కొన్నారు. ఇదొక బాధ్యత.. అందరం కలిసికట్టుగా బాధ్యతను నిర్వహిస్తేనే పరిపాలన పరుగులు పెడుతుంది. మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత నాది అని చెప్పారు. ఉద్యోగ సంఘాల చిరకాల వాంఛ అయిన గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యాలయ భవన నిర్మాణానికి సహకరిస్తామని చెప్పారు.భవన నిర్మాణం కోసం అసోసియేషన్ ఎంత నిధులు సమకూర్చుకుంటే ప్రభుత్వం కూడా అంత మొత్తాన్ని గ్రాంట్‌గా ఇస్తుందని వెల్లడించారు.ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై చర్చించడానికి త్వరలోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇది ప్రజల ప్రభుత్వమని, పజలు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్దామని, మంచి పరిపాలన అందిద్దామని చెప్పారు. తాను ఇప్పటివరకు ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని, సెలవు తీసుకోవాలని అనుకున్నప్పటికీ ఏదో ఒక పని వచ్చిపడుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఇప్పుడు నేను 18 గంటలు పని చేస్తున్నాను. ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరని, 10.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగులే రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని అన్నారు. ఉద్యోగుల్లో కూడా తనను ఇష్టపడని వారు ఉండొచ్చని, తాను వచ్చిన తరువాత ఉద్యోగుల వేతనాలు ఎలా అందుతున్నాయో గమనించాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.12 వేల కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయని ఆయన అన్నారు. పన్ను వసూళ్లలో అవకతవకలు అరికడితే రావాల్సి న నిధులు వస్తాయని అన్నారు.

## పోలవరం నీటిని తెలంగాణ వాడుకోవచ్చు: ఏపి మంత్రి నిమ్మల

**విజయవాడ,జనవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరాలను సుప్రీంకోర్టు డిస్పోజ్ చేయడంపై ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పందించారు. రాష్ట్ర విభజన జరిగిన తరువాత గోదావరి ఎగువన కాళేశ్వరానికి ఏ మాదిరిగా అనుమతి ఇచ్చారో అదే విధంగా దిగువన పోలవరం నల్లమలసాగర్ కు అనుమతి ఇవ్వాలనే అభిప్రాయాన్ని మంత్రి నిమ్మల వ్యక్తం చేశారు.వృధాగా సముద్రంలో కలుస్తున్న 3,000 టీఎంసీల నీటిలో 200 టీఎంసీలు మాత్రమే వాడుకుంటామని మంత్రి నిమ్మల వివరించారు. ఈ ప్రాజెక్టు మూలంగా తెలంగాణాకు ఏ విధమైన నష్టం లేదని ముందు నుంచి తాము చెబుతూనే ఉన్నామని నిమ్మల తేల్చి చెప్పారు. తెలుగు రాష్ట్రాలు సోదరభావంతో కలిసి అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష అని నిమ్మల గుర్తు చేశారు. గత 5 ఏళ్ల కాలంలో గోదావరి వరద నీరు 1,53,000 టీఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలిసిందని గుర్తు చేశారు. ఈ సంవత్సరం సైతం నీరు వృధాగా సముద్రంలోకి పోయిందని వివరించారు.

పోలవరం దగ్గర వరద నీరును ఉపయోగించుకుంటే, ఆంధ్రప్రదేశ్ ఉపయోగించుకోవాలి, లేదంటే సముద్రంలో ఉప్పు నీటిలో కలిసిపోతుందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలియజేశారు. గోదావరిలో పుష్కలంగా నీరు ఉందనే ఆనాడు రాష్ట్ర విభజన తర్వాత కాళేశ్వరాన్ని తెలంగాణ నిర్మాణం చేస్తున్నా, తాము అడ్డుకోలేదని మంత్రి నిమ్మల తెలియజేశారు. పోలవరంనల్లమలసాగర్ పూర్తైతే మనరాష్ట్ర ప్రయోజనాలు తీరిన తరువాత నీరు మిగిలితే తెలంగాణకు సైతం ఉపయోగం ఉంటుందని ప్రాజెక్టును మంత్రి నిమ్మల వెల్లడించారు.

## సిబిఐ విచారణలో విజయ్ ఉక్కిరిబిక్కిరి

### కరూర్ తొక్కిసలాట ఘటనపై తొలిరోజు ఐదున్నరగంటలు ప్రశ్నించిన సిబిఐ

### ఢిల్లీలోనే ఉండాలని ఆదేశం

**న్యూఢిల్లీ, జనవరి 12:** ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ చీఫ్ విజయ్ సోమవారం సీబీఐ విచారణకు హాజరయ్యారు. ఉదయం చెన్నై నుంచి ప్రత్యేక విమానంలో ఆయన ఢిల్లీకి చేరుకున్నారు. సీబీఐ కార్యాలయంలో అధికారుల ముందు హాజరయిన విజయ్‌ను సుమారు ఐదున్నర గంటలపాటు విచారణచేసారు. గతేడాది కరూర్ లో టీవీకే ప్రచార సభ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సుప్రీంకోర్టు స్పందించి సీబీఐ విచారణకు ఆదేశించింది. దీంతో దర్యాప్తు చేపట్టిన సీబీఐ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. పలువురు ప్రత్యక్ష సాక్షులను విచారించిన అధికారులు విచారణకు రమ్మంటూ విజయ్ కు సమన్లు పంపించారు. ఈ నేపథ్యంలోనే సోమవారం విజయ్ ఢిల్లీలోని సీబీఐ ఆఫీసుకు వెళ్లారు. తొక్కిసలాట ఘటనను తమిళనాడు అధికార పార్టీ డీఎంకే కుట్రగా విజయ్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి అసలు నిజాలు బయటకు రావాలని, సమగ్ర స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై టీవీకే తరఫున ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానం సీబీఐ విచారణకు ఆదేశించగా విచారణకు సహకరిస్తానని విజయ్ ప్రకటించారు. కాగా, తమ నాయకుడు విజయ్ కు భద్రత కల్పించాలని టీవీకే పార్టీ ఢిల్లీ పోలీసులకు విజ్ఞప్తి చేసింది. విజయ్‌ను సుమారు ఐదు గంటలకుపైదా విచారణచేసినట్లు తెలుస్తోంది. విచారణసమయంలో ర్యాలీకి ముందస్తు పోలీసులు అనుమతి ఉందా? ఎంతమంది వస్తారని అంచనావేసారు? పోలీసులకు ముందుగానే అభిమానుల సంఖ్య ఉధృతంగా ఉంటుందని చెప్పారా అన్న ప్రశ్నలు కురిపించినట్లు తెలిసింది. ర్యాలీ ప్రాంతంలోకి మీరు వస్తున్నపుడు అభిమానులు వేలాదిగా తరలివస్తారని మీకు తెలుసుకదా అటువంటప్పుడు మీరు పోలీసులకు సమాచారం ఇచ్చారా, ఇవ్వకపోతే ఎందుకు ఇవ్వలేదు అన్న ప్రశ్నలు కురిపించారు. మొదటిరోజు దర్యాప్తుపూర్తి చేసిన సిబిఐ బృందం విజయ్‌ను ఢిల్లీలోనే ఉండాలని కోరింది. మరుసటిరోజు కూడా దర్యాప్తుంటుందన్న సమాచారంతో విజయ్ అభిమానుల్లో ఆందోళన పెరిగింది. సిబిఐ అధికారుల తీరునుచూస్తుంటే విజయ్ను ఢిల్లీలోనే అరెస్టుచేస్తారా అన్న కలవరం పార్టీశ్రేణుల్లో పెరిగిపోయింది. అయితే తాను దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తాననిఅయితే స్వతంత్ర దర్యాప్తుజరగాలని ముందునుంచీ విజయ్ చెపుతుండటంతో అటు బిజెపికానీ మరే ఇతర పార్టీ అయినా తొందరపడే వ్యూహాలు అమలుచేయడంలేదు. విజయ్ అరెస్టు అయితే టివికె పార్టీకి విపరీతమైన క్రేజు ఏర్పడుతుందని, అలాంటిపొరపాట్లుచేయకూడదని ఇటు డిఎంకె ప్రభుత్వం, అటు కేంద్రంలోని ఎన్డీయే సర్కారులు యోచిస్తున్నాయి.



## సమ్మక్క-సారలమ్మ బ్రోచర్, పోస్టర్‌ను ఆవిష్కరించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి12:** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన సమ్మక్క-సారలమ్మ మేడారం మహా జాతర బ్రోచర్,పోస్టర్‌ను సిఎం రేవంత్‌రెడ్డి సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క,కొండా సురేఖ,అడ్లూరి లక్ష్మణ్,ఎంపీలు,ఇతర ప్రజాప్రతినిధులు,ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 17 నుంచి 24 వరకు ఎస్ఎస్‌సి ప్రీఫైనల్ పరీక్షలు

### ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు

### విద్యార్థులందరూ హాజరయ్యేలా చూడాలని డిఇఒలకు ఆదేశం

### షెడ్యూల్ విడుదల చేసిన పాఠశాల విద్య డైరెక్టర్

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు 10వ తరగతి వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంలో అంతకంటే ముందుగా ఫిబ్రవరిలో ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఫిబ్రవర 17 నుంచి 24 వరకు ఎస్ఎస్‌సి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పరీక్షల షెడ్యూల్‌ను పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ విడుదల చేశారు. షెడ్యూల్‌ను డీవోలకు పంచించారు. పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. 8 రోజుల పాటు పరీక్షలు కొనసాగనున్నాయి. ఎస్ఎస్‌సి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులందరూ కూడా ప్రీ ఫైనల్ పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని డీఈవోలను పాఠశాల విద్య డైరెక్టర్ ఆదేశించారు.

విద్యార్థులు ప్రీ ఫైనల్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచేలా ప్రత్యేక తరగతులను, శిక్షణను ఇవ్వాలని సూచించారు. ప్రీ ఫైనల్ పరీ క్షల అనంతరం మార్చిలో జరిగే వార్షిక పరీ క్షల్లోనూ అదే ప్రతిభ చూపేలా విద్యార్థులను తీర్చి దిద్దాలని నవీన్ నికోలస్ సూచించారు. రాష్ట్రంలో మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు ఎస్ఎస్‌సి వార్షిక పరీక్షలు జరగనున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇప్పటికే ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ విడుదల చేశారు. ఇప్పటి వరకు పరీక్షలకు సుమారు 5.01 లక్షల మంది విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించినట్లు తెలిసింది.

**ప్రీ ఫైనల్ పరీక్షల షెడ్యూల్..**

ఫిబ్రవరి 17(మంగళవారం) ఫస్ట్ లాంగ్వేజ్, ఫిబ్రవరి 18(బుధవారం) సెకండ్ లాంగ్వేజ్, ఫిబ్రవరి 19 (గురువారం) థర్డ్ లాంగ్వేజ్, ఫిబ్రవరి 20 (శుక్రవారం) గణితం, ఫిబ్రవరి 21(శనివారం) ఫిజికల్ సైన్స్, ఫిబ్రవరి 23(సోమవారం) బయలాజికల్ సైన్స్, ఫిబ్రవరి 24(మంగళవారం) సోషల్ స్టడీస్, ఫిబ్రవరి 21, 23న జరిగే ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు కొనసాగనుండగా.. మిగిలిన పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతాయి.



## సాగు ఖర్చులు తగ్గాలి.. రైతు ఆదాయం పెరగాలి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### అవసరమైతేనే యూరియా వాడండి..

### భూసారం కాపాడండి.. రైతులకు కీలక సూచనలు

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త, జనవరి 12 :** రైతుల సాగు ఖర్చులు తగ్గుతూ, ఆదాయం పెరిగేలా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో సోమవారం బేయర్స్ కంపెనీ వ్యవసాయ డ్రోన్‌లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ!!డ్రోన్‌లతో పురుగుమందులు మోతాదుకు మించి పడకుండా నియంత్రించడం సాధ్యమవుతుందని, యూరియా వినియోగం తగ్గి భూసారం మెరుగుపడుతుందని తెలిపారు. "కెమికల్ ఎరువుల అధిక వాడకం రైతులకు, భూములకు రెండింటికీ నష్టం. సహజ, సమతుల్య పద్ధతుల్లోనే సాగు చేయాలి" అని అన్నారు. నకిలీ విత్తనాలపై మంత్రి ఫైర్‌కొన్ని బోగస్ కంపెనీలు హెచ్‌డీ విత్తనాల పేరుతో నకిలీ విత్తనాలు విక్రయించడం వల్ల రైతులు భారీ నష్టాలు చవిచూస్తున్నారని మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఇటువంటి విత్తన మాఫియాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. యూరియా అధిక వినియోగం ప్రమాదకరకొంతమంది రైతులు ఎకరానికి 10-12 క్వింటాళ్ల యూరియా వాడుతున్నారని నా దృష్టికి వచ్చింది. ఇదే కొనసాగితే భూమి గడ్డి కూడా పండే శక్తి కోల్పోతుంది. రైతును నాశనం చేసే రాజకీయాలు మనకు అవసరం లేదు" అని మంత్రి ఖండించారు. ఎరువుల ధరలను క్రమబద్ధీకరించాలని కేంద్రానికి లేఖ రాసినట్లు తెలిపారు.

## సంక్రాంతి రద్దీ నేపథ్యంలో అదనపు ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్ (తార్నాక), జనవరి 12, ప్రభాతవార్త :** సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండటంతో దక్షిణ మధ్య రైల్వే పలు మార్గాల్లో అదనపు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఏ. శ్రీధర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నడపనున్న ప్రత్యేక రైళ్ల వివరాలు:రైలు నెం. 07480 చర్లపల్లి - కాకినాడ టౌన్‌జనవరి 19న ఉదయం 10.00 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 9.30 గంటలకు చేరుకుంటుంది.రైలు నెం. 07481 కాకినాడ టౌన్ - చర్లపల్లిజనవరి 19న రాత్రి 11.15 గంటలకు బయలుదేరి తదుపరి రోజు ఉదయం 11.45 గంటలకు చేరుకుంటుంది.రైలు నెం. 07482 చర్లపల్లి - తిరుపతిజనవరి 18న ఉదయం 4.00 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 7.00 గంటలకు చేరుకుంటుంది.రైలు నెం. 07483 తిరుపతి - చర్లపల్లిజనవరి 18న రాత్రి 9.50 గంటలకు బయలుదేరి తదుపరి రోజు ఉదయం 11.45 గంటలకు చేరుకుంటుంది.ఆగే ముఖ్యమైన స్టేషన్లు:ఈ ప్రత్యేక రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, సమల్కోట్, జంగావ్, కాజీపేట, వరంగల్, ఖమ్మం, నెల్లూరు, గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి తదితర ప్రధాన స్టేషన్లలో ఆగుతాయి.ఈ రైళ్లలో ఫస్ట్ ఏసీ కమ్ సెకండ్ ఏసీ, ఏసీ-2, ఏసీ-3, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ప్రయాణికులు ఈ అదనపు రైళ్లను వినియోగించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది.

## కర్ల రాజేష్ కస్టడీ మృతిని తప్పుదోవ పట్టిస్తున్న అధికారులు

### మంద కృష్ణ మాదిగ ఆరోపణ

**హైదరాబాద్ (సికింద్రాబాద్), జనవరి 12, ప్రభాతవార్త:** కోదాడ పట్టణానికి చెందిన కర్ల రాజేష్ కస్టడీ మృతికి సంబంధించి గాంధీ హాస్పిటల్‌లో జరిగిన చికిత్స వివరాలు, పోస్టుమార్టం వివరాలు, కేసు షీట్‌తోపాటు ఇతర రికార్డుల గురించి గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓ ఇతర వైద్య అధికారులతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మందకృష్ణ మాదిగ సోమవారం అడిగి తెలుసుకున్నారు. అనంతరం గాంధీ హాస్పిటల్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. నవంబరు 16న వేకువజామున 2.30 గంటలకు గాంధీ హాస్పిటల్‌కు జైలు ఎస్కార్ట్‌తో వచ్చిన కర్ల రాజేష్‌కు అనుకున్నంత మెరుగైన వైద్యం అందించలేక పోయారన్నారు.

పోలీసులే కర్ల రాజేష్ హెల్త్ హిస్టరీకి సంబంధించి తప్పుడు వివరాలు గాంధీ హాస్పిటల్ వైద్యులకు తెలియజేశారన్నారు. కర్ల రాజేష్‌కు స్మోకింగ్, డ్రింకింగ్ అలవాటు ఉందని, మధుమేహం ఉందని లేని రోగాలు ఉన్నట్లు కేస్ షీట్‌లో రాయించారని తెలిపారు. వాస్తవానికి కర్ల రాజేష్‌ను కోదాడలో జడ్జి ముందు ప్రవేశపెట్టే సమయంలో జడ్జి అతని ఆరోగ్యం గురించి అడిగిన ప్రశ్నలకు తనకు గతంలో ఏ అనారోగ్య సమస్యలు లేవని ఎలాంటి మందులు వాడలేదని చెప్పినట్లు రికార్డు స్పష్టంగా ఉందని, కానీ ఈ కేసును తప్పు దోవ పట్టించే క్రమంలో లేని రోగాలు ఉన్నట్లు పో లీసులు సృష్టించి డాక్టర్లకు తప్పుడు సమాచారం అం దించారని, అదే తప్పుడు సమాచారాన్ని కేసు షీట్ లో పొందుపరిచేలా చేశా రన్నారు. అలాగే గాంధీ ఆస్పత్రి వైద్యులు రాజేష్ హెల్త్ బులిటెన్‌కు సంబంధించి మార్గదర్శక సూత్రాలను సరిగా పాటించలేదని తెలిపారు. రిమాండ్‌ఖైదీగా ఉన్న కర్ల రాజేష్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించే క్రమంలో పాటించాల్సినటువంటి చట్టపరమైన మార్గదర్శకాలను ఎక్కడా పాటించినట్లు కనబడం లేదన్నారు. పోస్టుమార్టం నిర్వహించడానికి ముగ్గురు వైద్యులను నియమించే విషయంలో అలాగే పోస్టుమార్టం నిర్వహిస్తున్న క్రమంలో చట్టపరమైనటువంటి నిబంధనలు పాటించే విషయంలో నిర్లక్ష్యం వహించారన్నారు. పోస్టుమార్టానికి సంబంధించిన ఏ విధమైన చట్టపరమైన రికార్డులు గాంధీహాస్పిటల్ అధికా రులు చూపెట్ట లేకపోయారని, పూర్తి వివరాలు త్వరలోనే అందిస్తామని గాంధీ హాస్పిటల్ అధికారులు తెలి పారన్నారు.

ఎస్ఐ సురేష్‌రెడ్డి, కోదాడ డి.ఎస్.పి, సూర్యపేట ఎస్పీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్, నరేష్ మాదిగ, ఎంఎస్ పీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు గిజు నర సింహారావు మాదిగ, ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగ, ఇటిక్రశ్రీ కిషన్ మాదిగ, గజ్జల రాజశేఖర్ మాదిగ, బైరపోగు శివ మాదిగ, జనపాల మహేష్ మాదిగ, ధ్రువ ఆదిత్య మాదిగ, వలకులు రేణుక మాదిగ, సూరారం సుజాత మాదిగ, దుర్గాబాయి మాదిగ, దావ శివప్రసాద్ మాదిగ, నారాయణ మాదిగ, అమ్ముగూడెం దశరథ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



## చైనా కార్గో నౌకలకు డ్రోన్లు, క్షిపణి లాంచర్లు?

**బీజింగ్, జనవరి 12:** చైనా తన కార్గో నౌకలకు డ్రోన్లు, క్షిపణి లాంచర్లను అమర్చుతుందా? వాటిని ఓ షిప్‌కు అమర్చినట్టుగా ఉన్న ఓ చిత్రం ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. ఇది ఇప్పుడు రక్షణ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. మారిటైమ్ ట్రాకర్ సైట్స్‌లో జోంగ్డా 79 కార్గోషిప్ వద్ద పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నేవీ హెలికాప్టర్ కనిపించింది. దీనిని ప్రస్తుతం క్షిపణులు ప్రయోగించే ఆయుధ నౌకగా చైనా మారుస్తోంది. ఇటీవల తైవాన్ చుట్టూ చైనా భారీగా నౌక, వైమానిక విన్యాసాలు చేపట్టిన సంగతి తెలిసిందే. యుద్ధ విమానాలు, నౌకలను మోహరించింది. ఆ నౌకకు మాడ్యులార్ ఎలక్ట్రోమాగ్నటిక్ క్యాటపల్ట్ సిస్టమ్‌ను అమర్చారు. దానిని ఫైటర్ డ్రోన్లను లాంచ్ చేయడానికి వాడతారు. ఈ నౌకలో ఇతర లాంచింగ్, రాడార్ వ్యవస్థలు కనిపించాయి. యుఎస్ఎన్ఐ న్యూస్ ప్రకారం.. పిఎల్ఎఎన్ ప్రపంచంలోనే అతిపెద్ద నౌకాదళం. దాని వద్ద 370కిపైగా యుద్ధ నౌకలు ఉన్నాయి. అమెరికా వద్ద ఉన్న వాటి సంఖ్య 290. అయితే సాంకేతికంగా అమెరికా నౌకదళానిదే ఆధిపత్యం. అయితే దానిని అధిగమించేలా చైనా వేగంగా విస్తరిస్తోంది. చైనా వద్ద 4000 వాణిజ్య నౌకలు ఉన్నాయి. వాటిని వేగంగా యుద్ధనౌక తరహాలోకి మార్చే సౌలభ్యం ఉండటం గమనార్హం.



## విజేత మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీపై పోలీసుల దాడులు

### 114 పాస్‌పోర్టులు స్వాధీనం

### కన్సల్టెంట్స్ నిర్వాహకుడు గంగాధర్ అరెస్టు

### విదేశాలకు పంపిస్తామని అమాయకులను మోసం చేస్తే కఠిన చర్యలు

### జగిత్యాల డిఎస్పీ రఘుచందర్

**జగిత్యాల బ్యూరో ప్రభాతవార్త:** గల్ఫ్ దేశాలకు పంపిస్తామని అమాయకులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జగిత్యాల డిఎస్పి రఘు చందర్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని మ్యాన్ పవర్ కన్సల్టెన్సీపై పోలీసుల దాడి చేసి 114 పాస్పోర్టు స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగాజగిత్యాల పట్టణంలోని డి.ఎస్.పి కార్యాలయంలో సోమవారం డీఎస్పీ రఘు చందర్ విలేకరుల సమావేశం నిర్వహించారుఈ సందర్భంగా డిఎస్పి రఘు చందర్ మాట్లాడుతూ పట్టణంలోని విజేత మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ యజమాని కాముని గంగాధర్ గల్ఫ్ లో ఉద్యోగం ఇప్పిస్తానని ఒక్కొక్కరి దగ్గర లక్ష 40 వేల రూపాయలు వసూలు చేసి విసిట్ వీసా తో వారిని మూడు రోజులు బొంబాయిలో ఉంచి అటు నుండి బెహరాన్ పంపించాడు అన్నారుఅక్కడ ఒక గదిలో వరిని నిర్బంధించారు అని పేర్కొన్నారుఅక్కడి నుండి ఒక్కొ క్కరు రెండు నుంచి మూడు లక్షల వరకు ఖర్చు చేసుకొని తిరిగి ఇండియాకు తీవ్ర కష్టాలు ఎదుర్కొని వచ్చారని పేర్కొన్నారుగత నెల 13వ తేదీన. ఆరెల్లి రవీందర్ అనే బాధితుడు ఫిర్యాదు చేయగా ఆయన ఫిర్యాదు మేరకు పట్టణంలోని బైపాస్ రోడ్ లో గల విజేత మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ నీ జగిత్యాల పట్టణ పోలీసులు దాడి చేసి 144 పాస్పోర్టులను స్వాధీనం చేసుకొని గంగాధర్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా మాయమాటలతో గల్ఫ్ దేశాలకు పంపిస్తామని డబ్బులు లక్షలలో వసూలు చేయడం చట్టరీత్య నేరమని అలాంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారుఈ సమావేశంలో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కర్ణాకర్, ఎస్సై రవి కిరణ్ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ ఇడబ్ల్యుఎస్ కాలనీ వద్ద స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించిన మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్

## స్వామివివేకానందుని బోధనలు ఆచరణీయం

### దేశభక్తి, అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలి

### మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్

**ఘట్‌కేసర్, జనవరి 12, ప్రభాతవార్త:** దేశభక్తి, జాతీయభావం పెంపొందించేందుకు యువత కృషి చేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. జిహెచ్ఎంసి ఉప్పల్ జోన్ ఘట్‌కేసర్ ఇడబ్ల్యుఎస్‌కాలనీ చౌరస్తాలో సోమవారం ఆయన స్వామివివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. స్వామి వివేకానంద 164వ జయంతి సందర్భంగా స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఫ్రైమ్‌లాండ్ రోడ్డు డివైడర్‌పై నెలకొల్పిన విగ్రహాన్ని ఎంపీ రాజేందర్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి కొబ్బరికాయలు కొట్టి ఆవిష్కరించారు. ఈసందర్భంగా యూత్ సభ్యులు ఎంపీకి శాలువా కప్పి స్వాగతం పలికారు. వివేకానంద విగ్రహానికి ఎంపీతో పాటు నాయకులు పూలదండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎంపీ రాజేందర్ మాట్లాడుతూ యువత ప్రాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి మన సాంప్రదాయాలను విస్మరించకూడదన్నారు. నేటి సమాజంలో యువత సెల్‌ఫోన్‌లకు బానిసై చెడు వ్యసనాలకు లోనవుతున్నారని, ఫోన్ ద్వారా విజ్ఞానాన్ని, సాంకేతికతను పెంపొందించుకోవాలన్నారు. వివేకానంద చికాగో సభలలో భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి బ్రిటిషుల కళ్లు తెరిపించారని కొనియాడారు. దేశంలో మౌళిక సదుపాయాలే కాకుండా నైతిక విలువలు అవసరమని, ఆచార వ్యవహారాలను మరువకూడదన్నారు. పేదరికం అంతరాలు లేని సమాజం సాధ్యం కావాలంటే యువత చేతిలోనే బాధ్యత ఉందన్నారు. స్వామివివేకానంద భోధనలను ప్రచారం చేయాలని, ఆయన డిక్షనరీలో సాధ్యం కానిది లేదని చెప్పిన మాటలను పాటించాలని ఎంపీ రాజేందర్ సూచించారు. ఈకార్యక్రమంలో బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, రాష్ట్రకార్యవర్గసభ్యులు-మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనియాదవ్, మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్, మాజీ ఎంపిటిసిలు రేసు లక్ష్మారెడ్డి, మేకల నర్సింగ్‌రావు, కీసరగుట్ట డైరక్టర్ సగ్గు అనిత, గడ్డిఅన్నారం ఎఎంసీ డైరక్టర్ చిల్కూరి మచ్చేందర్‌రెడ్డి, కొమురవెల్లి ఉత్సవ కమిటీ సభ్యులు మెరుగు నరేశ్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు బర్ల శశికళ దేవేందర్, కొమ్మగోని రమాదేవి, కడుపొల్ల మల్లేశ్, షేక్ జహంగీర్, కుతాడి రవీందర్, మున్సిపల్, మండల బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, బసవరాజుగౌడ్, కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్, మామిండ్ల చిత్తారియాదవ్, కొంతం రాంరెడ్డి, కొత్తకొండ వెంకటేశ్, నోముల నవీన్‌ప్రకాష్, ఇడబ్ల్యుఎస్‌కాలనీ అధ్యక్షులు కేశవపట్నం అంజనేయులు, కార్యదర్శి శశిధరణ్, డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, బిజెవైఎం అధ్యక్షులు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, యూత్ సభ్యులు దంతాల అనిల్‌కుమార్, సార శ్రీనివాస్‌గౌడ్, శివరాత్రి సురేశ్, బర్ల సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## హీరా గ్రూప్ గోల్‌మాల్ వ్యవహారంలో నకిలీ కన్సల్టెంట్ అరెస్టు

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు చెం దిన అమాయకులను అధిక వడ్డీ ఆశచూపి 5978 కోట్ల రూపాయలను వసూలు చేసి బిచాణా ఎత్తేసిన హీరా గోల్డ్ గ్రూప్ సంస్థ కేసులో తాజాగా మరో పరిణామం చోటుచేసుకుంది. ఈ సంస్థ తరపున పనిచేసిన నకిలీ కన్సల్టెంట్ కల్యాణ్ బెనర్జీని కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అధికారులు సోమవారం నాడు అరెస్టు చేశారు. ప్రజల నుంచి వే ల కోట్ల రూపాయలను వసూలు చేయడంలో బెనర్జీ కీలకంగా వ్యవహరించినట్లు ఈడీ గుర్తిం చింది. ఏడాదికి 36 శాతం వడ్డీ అంటే నెలకు మూడు రూపాయల వడ్డీ ఆశచూపిన నౌహెరా షేక్‌పై మహారాష్ట్రతో పాటు తెలుగు రాష్ట్రాలలో కేసులుండగా ఈడీ కూడా రంగంలో దిగి మనీలాండరింగ్ కో ణంలో విచారణ చేబట్టింది.

చిత్తూరు జిల్లాకు చెందిన నౌహెరా షేక్ హైదరాబాద్‌లోని టోలిచౌకిలో స్థిరపడి పదే ళ్లుగా గోల్‌మాల్ కార్యకలా పాలను సాగిస్తుండడం తెలిసిందే. హైదరాబాద్‌లో ఆమెపై అనేక కేసు లుం డగా ముందుగా మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేసి ఆరు నెలకు పైగా జైల్లో ఉంచారు. ఈ కేసులో హీరా గోల్డ్ సంస్థకు చెందిన 428 కోట్ల రూపాయల ఆస్తులను ఇడి జప్తు చేయగా మరికొన్ని ఆస్తులు కోర్టు విచా రణలో ఉన్నాయి. నౌహెరాషేక్‌కు సుప్రీంకోర్టు ఐదు కోట్ల రూపాయల జరి మానా విధించడంతోపాటు దీనిని ప్రధానమంత్రి సహాయనిధికి జమా చేయాలని ఆదేశించింది.

ఈ పరిణామాలు ఇలావుంటే తాజాగా ఈ సంస్థకు నకిలీ కన్సల్టెంట్‌గా ఉన్న కల్యాణ్‌బెనర్జీ అరెస్టవడం సంచలనం రేపింది.

## బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం

### మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్ కల్చరల్, ప్రభాతవార్త:** కరీంనగర్ మార్కెట్ రోడ్డులోని లక్ష్మీ,పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ ఏడాది మరింత వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈనెల 23 నుండి 30వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల సన్నాహక సమావేశం జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డు వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఈ సంవత్సరం మరింత వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు ప్రశాంతంగా స్వామి వారి దర్శనం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని, పార్టీలతో సంబంధం లేకుండా ప్రజాప్రతినిధులంతా బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. గతేడాది మాదిరిగానే స్వామివారి సేవకు



ముందుకు వచ్చి విరాళాలు సమర్పిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలోట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బందోబస్తు నిర్వహించాలన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ వేడుకలు నిర్వహించాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉందని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ అధికారులతో వివిధ శాఖలు సమన్వయం చేసుకుంటూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని సూచించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలూ తీసుకుంటుందని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ స్వామివారి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు ఆలయ పరిసరాల్లో శానిటేషన్, క్లీనింగ్ సమస్యలు రాకుండా చూస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు దాతలు బ్రహ్మోత్సవాల నిర్వాహణకు విరాళాలను ప్రకటించారు. సమావేశంలో ఆర్డీవో మహేశ్వర్, కరీంనగర్ కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్రె రాజశేఖర్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఆలయ చైర్మన్లు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఏసీపి వెంకటస్వామి, ఈవో సుధాకర్ పాల్గొన్నారు.

## నిజాయితీ గల మోసగాడు రేవంత్‌రెడ్డి

### యూరియా ఇవ్వనోడు తులం బంగారం ఇస్తాడా?

### మహబూబ్‌నగర్ సర్పంచుల సన్మాన సభలో

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 12, ప్రభాతవార్త :** సీఎం రేవంత్ రెడ్డి నిజాయితీ గల మోసగాడు అని,, జనాలను మోసం చేయాలని వాళ్లు అలా చేస్తేనే నమ్ముతారని మోసపోతారని గతం లో చాలా సార్లు ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి చెప్పి మరి మోసం చేశారని బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రైతులకు యూరియానే ఇవ్వలేని వాడు తులం బంగారం ఇస్తాడా అని ఎద్దేవా చేశారు. మంగళవారం మహబూబ్నగర్ లో సర్పంచుల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథి గా బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఎమ్మెల్యేలకే నిధులు ఇవ్వని ముఖ్యమంత్రి సర్పంచులకు ఎలా ఇస్తాడని ప్రశ్నించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో కొడంగల్ తో సహా 14 సీట్లు బిఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ఇందులో ఎలాంటి సందేహం లేదని కార్యకర్తలకు భరోసా నిచ్చారు. మున్సిపల్ ఎన్నికల ఓట్లు పూర్తి స్థాయి లో బీఆర్ఎస్ విజయం అందించాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. మనం సబ్జెక్ట్ మాట్లాడితే సీఎం బూతులు మాట్లాడుతున్నారని, లాగులలో తొండలు ఇడుస్తా, కనుగుడ్లు పీకుతా.. అంటారని ఈ మాటలు ఎంతవరకు కరెక్ట్ తో ఆయన చెప్పాలన్నారు. " నేను మీ పాలమూరు బిడ్డను ఆశీర్వదించండి " అంటూ మాయమాటలు చెప్పి రేవంత్ రెడ్డి సీఎం సీటులో కూర్చున్నారని కేటీఆర్ విమర్శించారు. 6 గ్యారంటీలు 420 హామీలు ఇచ్చి రేవంత్ రెడ్డి గద్దెనెక్కి కూర్చున్నారని విమర్శించారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్ రెండేళ్ల పూర్తి చేసుకున్న నేటికి అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తవి అమలు చేయడం దేవుడు ఎరుగు ఉన్నవి కూడా అమలు చేయడం లేదని ఒక ఆడబిడ్డ ప్రసిద్ధి అయితే కేసీఆర్ కిట్టును బిడ్డను తల్లికి భరోసా కల్పించేలా అందించడం జరిగిందని తెలిపారు.

## హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆనంద్ ఫిట్‌నెస్‌పై యువ ఫిట్‌నెస్ ట్రైనర్ల వీడియో

### 57 యేళ్ల వయసులో కుర్రాళ్లతో పోటీపడి

### హెచ్‌సిఎ లీగ్‌లో హాఫ్ సెంచరీ

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి సివి ఆనంద్ ఒకప్పటి అండర్-19 క్రికెటర్ అనే విషయం తెలిసిందే. ఐపిఎస్ అధికారి కాకముందు ఆనంద్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అండర్ 19 క్రికెటర్‌గా ఓ వెలుగు వెలిగారు. ఇప్పటి విషయానికి వస్తే ఆనంద్ వయ స్సు 57 యేళ్లు. సికింద్రాబాద్ క్రికెట్ క్లబ్ తరపున హెచ్‌సిఎ లీగ్ మ్యాచ్ లలో పాల్గొంటూ కుర్రాళ్లకు గట్టిపోటీ ఇస్తున్నారు. బిసిసిఐ నిర్వహించే సీని యర్ క్రికెటర్ల లీగ్ మ్యాచ్‌లలో హైదరాబాద్ తరపున ఆయన పాల్గొని అనేక విజయాలను అందించారు. మూడు రోజుల క్రితం జరిగిన వన్‌డే లీగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆయన హాఫ్ సెంచరీ చేయడం, ఈ సం దర్భంగా వికెట్ల మధ్య వేగంగా పరుగెత్తడం, అంతకు ముందు వామప్‌లు నిర్వహించడం అక్కడే వున్న ఇద్దరు యువ ఫిట్‌నెస్ ట్రైనర్లను ఆశ్చర్యపరి చింది. దీనిపై వారిద్దరు ఆనంద్‌తో మాట్లాడగా ఆయన దీనిపై వారికి తనదైన శైలిలో సూచనలు ఇచ్చారు. ఏ క్రీడాకారుడైన రాణించాలంటే ఆటతోపాటు వామప్‌లు కచ్చితంగా చేయాలని, దీంతోపాటు జాగింగ్, స్ట్రెచింగ్, యోగా, ప్రాణా యామం వంటివి చేయాలని ఆనంద్ తెలిపారు. ఆనంద్ ఫిట్‌నెస్‌పై కోచ్ కార్తిక్ అరగంట విడియో విడుదల చేశారు.

GREATER VISAKHAPATNAM SMART CITY CORPORATION LIMITED (GVSCCL)
Ref. No: GVSCCL/Project/422 (Rain water harvesting Pits) /2025-26; Dt: 31-12-2025 (2nd call)
Ref.No: GVSCCL/Projects/Open Wells/2025-26 / Dt.12-01-2026(2nd call)
TENDER NOTICE
GVSCCL desires to invite the tender towards 1) Providing Rain Water Harvesting pits near Open wells in various locations of GVMC under SSASCI. 2) Rejuvenation of Open Wells in Visakhapatnam City Under SSASCI. The detailed tender documents can be downloaded from website of https://apeprocurement.gov.in/ from 12/01/2026 onwards.
The last date for online submission of bids is 23/01/2026 up to 05:00 PM.
For more details contact:
E-mail: visakhapatnamsmartcity@gvsccl.in
Mobile No: +91 9848308824
MD & CEO, GVSCCL

వార్త


స్వల్ప విషయాలే మనల్ని చికాకుపరచి బాధ పెట్టేవి. ఏనుగుని తప్పించుకోగలం కానీ దోమను ఏం చేయగలుగుతాం.

-హౌస్‌మాన్

# అంతర్యుద్ధమా! యుద్ధమా?

వెనెజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను సునాయాసంగా చెరసాల పాల్జేయడంలో విజయోత్సాహం, వీరగర్వంలో ఉన్న శ్వేతసౌధాధిపతి ట్రంప్ ఇంకా ఆగేట్టు లేరు. కారణంలేకుండా విషయం చెప్పకుండా దేశంలోని ఇతర చిన్నాచితక దేశాలపై హుంకరించే ఆయన తాజాగా ఇరాన్‌ను తమ చెప్పుచేతల్లో పెట్టుకోవాలనే ప్రయత్నంలో పడ్డారు. అది సాధ్యమో అసాధ్యమో చెప్పలేం. కానీ ఇరాక్‌పై అమెరికా సమర సన్నాహాలు చేస్తోంది. ఇరాన్‌లో ఆదేశ సుప్రీం ఆయెతుల్లా అలీ ఖొమేనీ ప్రభుత్వానికి అక్కడ 'జెన్‌జి' నిరసనలు వెల్లువెత్తిన విషయం విదితమే. ఆ నిరసనలపై ఇరాన్ పాలనాపర నిర్ణయం తీసుకొని వాటిని అణగదొక్కేందుకు ప్రయత్నిస్తోంది. ఇరాన్ తిరగపడితే ఇదో పెద్ద సైజు యుద్ధంలా మారే పరిస్థితి తలెత్తుతుంది. నిరసనకారులను అణగదొక్కడమనేది ఏ దేశంలోనైనా జరిగేదే! అందులో ప్రత్యేకత ఏమీ లేదు. పాలకులు పాలితుల మధ్య వైరుధ్యాలు ఏర్పడినప్పుడు ఇరు వర్గాలు సంయమనం పాటిస్తుండటం అవసరం. అదేలేనప్పుడు చిక్కులొస్తాయి. కానీ ఇక్కడ లాంటి పరిస్థితి ఏమీ లేదు. ఇరాన్ తన పాలన తను చేసుకుపోతూ ఉంది. వారి వ్యవహారాల్లో తలదూర్చడానికి అమెరికాకు ఏ అధికారమూ లేదు. పెద్దన్నలా వ్యవహరించేందుకు పెత్తనం చేసేందుకు ఎలాంటి అధికారమూ లేదు. దాదాపు అన్ని దేశాలపైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎగుమతులు దిగుమతుల స్థాయిని బట్టి సుంకాల వడ్డన చేస్తూ భయపెడుతోంది. అమెరికా సుంకాలు తట్టుకునే స్థాయిలో ఇండియా కూడా లేదు. స్వదేశీ తయారీకి ప్రాధాన్యతనిచ్చి అటువైపు దృష్టి సారిస్తే అమెరికా బెడద ఇండియాకు తప్పుతుందని ప్రధాని నరేంద్రమోడీ కూడా పిలుపునిచ్చారు. పరోక్షంగా చెప్పాలంటే ట్రంప్ చమురు బావులున్న దేశాలు, చమురు కొంటున్న దేశాలను గుర్తించి 'చమురు' వ్యాపారాన్ని తానే చేసే విధంగా వ్యూహాలు పన్నుతున్నారు. ఇలాంటివన్నీ చమురు కోసం కాదని చెప్పుకుంటున్నా చివరాఖరుకు తేలేది 'చమురు' నేపథ్యమే. ఇరాన్, అమెరికాల వైరుధ్యంతో సమిధలయ్యేది నిరసనకారులే. ఆ విషయాన్ని వారు గుర్తించడం లేదు. ఇరాన్ ప్రభుత్వం నిరసనకారులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడటం కొనసాగితే తాముచూస్తూ ఊరుకునేది లేదని, పరిమిత స్థాయిలో ఇరాన్‌పై దాడులు చేయనున్నట్లు అమెరికా పరోక్ష సంకేతాలిస్తోంది. ఇరాన్‌లో మళ్లీ రాచరిక వ్యవస్థను ప్రవేశపెట్టే ప్రయత్నాన్ని చేస్తున్నట్లు ఆయన చర్యలే చెబుతున్నాయి. ఇరాన్ స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కోసం ఎదురుచూస్తోందని ప్రజల్లోఅలాంటి ఆకాంక్ష ఉన్నట్లు తాను గుర్తించానని ఆయన చెబుతున్నారు. అందుకే తాను వారి కోసం ఇరాన్ వ్యవహారాలపై జోక్యం చేసుకుంటున్నానని ట్రంప్ బహిరంగంగానే చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇజ్రాయెల్ హై ఎలర్ట్ కూడా ప్రకటించింది. వీటన్నిటినీ ఇరాన్ పార్లమెంట్ ఖండిస్తోంది. పార్లమెంట్ సభ్యులు 'డెత్ టు అమెరికా' అటు నినాదాలు కూడా చేసారు. స్పందనగా ఇరాన్ స్పీకర్ మహ్మద్ బాఘెర్ కలిబఫ్ మాట్లాడుతూ అమెరికా సైన్యం, ఇజ్రాయెల్ తమలక్ష్యాలుగా మారుతాయని హెచ్చరించారు. తాము అమెరికా దుందుడుకు చర్యలను నిరసిస్తున్నామని, తామంటూ ప్రతిఘటిస్తే అమెరికన్ మిలిటరీపైన, ఇజ్రాయెల్ ఆక్రమిత భూభాగంపైనే తమ దాడులుంటాయని ప్రటకించారు. ఇక ఇరాన్ నిరసన కారులను అదుపు చేయడంలో జరిపిన కాల్పుల్లో వందలాది మంది మరణిస్తున్నారు. ఇరాన్ దవాఖానాల్లో శవాల కుప్పలు కుప్పలుగా పేరుకుంటున్నాయి. ఇవి దాదాపు 600 మందికిపైగానే ఉంటాయని అంచనా. ఆందోళనకారుల్ని సైన్యం తీవ్రంగా అణచివేస్తోంది. ఇరాన్‌లో జరుగుతున్నది అంతర్యుద్ధంలానే భావించాలి. నిత్యావసర వస్తువులు నింగినంటడం, పెచ్చు పెరిగిన అవినీతి. అస్తవ్యస్త పాలన వెరసి ఆయాతుల్లా ఖోమెనీపై జనం తిరగపడుతున్నారు. ఇది ఇరాన్ ప్రజల్లోంచి పెల్లుబికిన ఆగ్రహం తాలూకు నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఖమేనీ పాలన అంతం కావాలని కోరుకుంటున్నారు. వారిలోని ఆగ్రహాన్ని చల్లార్చేందుకు పాలకులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదు. సరిగదా! సైన్యాన్ని వారి మీదకు ఉసికొల్పడం ఇరాన్‌లో కనపడుతున్న విచిత్ర విధ్వంస సన్నివేశాలు. ఇరాన్ ప్రజలపై ఖమేనీ ప్రభుత్వం విచక్షణారహితంగా బుల్లెట్ల వర్షం కురిపిస్తోందని ట్రంప్ వాపోతున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీలో నిరసన కార్యక్రమాల్లోపాల్గొనే ప్రతిఒక్కరికీ అత్యంత కఠినమైన శిక్షలు విధిస్తాం. అలాంటి వాళ్లంతా దేవునికి శత్రువులే కనుక వారిని వధిస్తాం. కఠిన శిక్షవేస్తాం అని ఇరాన్ అటార్నీ జనరల్ మొహ్మద్ మొహహెదీ అజాద్ ఆందోళనకారుల్ని హెచ్చరించినట్లుగానే వారి దుశ్చర్యలు ఉన్నాయి. దీంతో అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఇస్లామిక్ విప్లవం తర్వాత దేశాన్ని వీడిన ఇరాన్ యువరాజు రెజా పహ్లావి ఆఘమేఘాల మీద ఇరాన్‌లో తాను కూడా ఉద్యమకారునిగా మారుతానంటూ ఇరాన్ ప్రధాని లక్ష్యంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేయడం ఆయనకు అమెరికా పరోక్ష మద్దతునీయడంతో ఇరాన్ ప్రభుత్వ వైఫల్యాలు ఆ దేశాన్ని ఎంతవరకు తీసుకెళ్తాయో వేచిచూడాలి. ఒకపక్క గ్రీన్ లాండ్ ఆక్రమణకు ప్లాన్ వేస్తున్న ట్రంప్ క్యూబా, కొలంబియాలపై స్వారీ చేయాలని సన్నద్ధమవుతున్నారు. ఇరాన్‌లో జరుగుతున్న నిరసనలు అమెరికా వత్తాసుతో అంతర్యుద్ధానికి ప్రేరేపితమవుతుందా? లేదు అమెరికాయే ఇరాన్‌పై నేరుగా యుద్ధం ప్రకటిస్తుందా అన్న అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. కానీ ట్రంప్ దూకుడు యావత్తు ప్రపంచానికీ తెలిసిందే. ఇరాన్‌కు అమెరికా విదేశాంగ శాఖ నుంచి ఓ కీలక హెచ్చరిక విడుదలైంది.

మాట్లాడిన మాట, వదిలిన బాణం, జరిగిన కాలం, వదులుకున్న అవకాశం, ఈ నాలుగు వెనక్కిరావు.



ప్లినీ

శత్రువుల నుంచి కాపాడుకోవాలంటే వాళ్లని మిత్రులుగా మార్చుకోవడమే ఉత్తమమైన మార్గం.



స్వామి వివేకానంద

# రాజ్యాంగ వ్యవస్థలు విమర్శలకు అతీతంగా ఉండాలి

**రాజకీయాల్లో ఇంతవరకు మునుపు సహజ చతురోక్తులూ సాంప్రదాయాలు, గౌరవాన్ని ఇచ్చిపుచ్చుకోవటాలూ, రాజకీయ వాసనలేని కార్యక్రమాల్లో హుందాగా పాల్గొని పదవులూ హోదాలు కావు ముఖ్యం. సమత్వం సమదృష్టి నిజాయితీతత్వం ముఖ్యం అని ఆనాటి నాయకుల ప్రవర్తన తీరులో స్పష్టంగా ద్యోతకమయ్యేది. ఈనాటి రాజకీయాల్లో పెద్ద పదవులు అనుభవిస్తున్నవారు కూడా తక్కువ స్థాయిలో, నీచపదాలతో అసభ్యకరంగా వ్యవహరించటం చూస్తుంటే జాలివేస్తున్నది. అందు కనే రాజకీయాల్లో ఉన్నవారి పట్ల తేలిక భావం ప్రజల్లో ఏర్పడుతున్నది. ప్రజాస్వామ్యంలో పాలన 'నమ్మకం' పై ఆధారపడి ఉంది. ఎవరు, ఎంత పెద్ద పదవిలో ఉన్నా ప్రొటెస్టు కార్యక్రమాలు చేస్తున్నప్పుడు విషయాన్ని అగౌరవ పర్చకుండా వ్యక్తం చేయటమేముఖ్యం. అప్పుడు అసలు విషయం మరుగునపడదు. అలా కానప్పుడు అసలుపోయి 'కొసరు' మిగిలి రసాభాస పర్వం ఆవిష్కరించబడుతుంది. తస్మాత్ జాగ్రత్త.**



రావులపాటి సీతారాం రావు

ప్రభుత్వాల మధ్య గొడవులు వేర్వేరు పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు గత కాలంలో భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో కూడా పెద్దగా ఉండకపోయేవి. అటు తర్వాత కొన్ని సంవత్సరాల వరకూ రాజకీయ నాయకుల మధ్య తగాదాలు రాజకీయాల వరకే పరిమితమయ్యాయి. అంతేగాని రాయలసీమను ఫాక్షన్ తరహాలో మొహమొహాలు చూసుకోని పరిస్థితి లేదు. కానీ ఈ మధ్యకాలంలో రాష్ట్రాలలోనే కాదు కేంద్రం వరకూ ఈ ఫాక్షన్ రాజకీయాలు విస్తరించడం దురదృష్టకరం. ఇప్పుడు వ్యవస్థలకు కూడా అంటుకుంటున్న ప్రమాదకర ధోరణి కళ్లకు కొట్టొచ్చినట్లు కనపడుతుండటం మరింత దురదృష్టకరం. వెస్ట్‌బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, ప్రధాని మోడీలాగానే జనంతో, అధికారంలో వారి అభిమానంతో ఉన్న నాయకురాలు! అదే విధంగా ఫెడరలిజం ప్రజాస్వామ్యం రాజ్యాంగంలో పొందుపర్చుకున్న భారత్ ఆ విధానాలను సర్వదా, శతథా ఆచరించాలని అనుకోవటంలో ఇసుమంతైనా తప్పులేదు! అధికారాలను రాజ్యాంగ ప్రకారం శాసనాలు చేసే వ్యవస్థ, వారి పాలన చేసే వ్యవస్థ, న్యాయాన్ని కాపాడే వ్యవస్థలుగా విభజింపబడి రాజ్యాంగానికి లోబడి వ్యవహరించే వ్యవస్థలు స్వాతంత్ర్యం ముందూ అటు తర్వాత స్వతంత్ర పాలనలో కూడా ఏర్పడినప్పుడు దేశ పాలన కానీ, రాష్ట్ర పాలన కానీ అందుకనుగుణంగా నడవక తప్పదు. ఇలాంటి అవగాహనతో భారతదేశంలో పాలన సాగుతున్నప్పుడు వెస్ట్‌బెంగాల్ రాష్ట్ర సి.యం ఇ.డి (ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్)లు తన పార్టీ రాజకీయ ఎలక్షన్ కమిటీ వ్యవహారాల్లో దర్యాప్తు నిమిత్తం జోక్యం చేసుకోవటాన్ని బాహాటంగా ఖండిస్తూ ఇ.డి దాడులను భౌతికంగా నిలిపేసేందుకు తన పార్టీ మద్దతుదారులతో ప్రయత్నించింది. జనవరి 8 నాడు ఇది జరిగింది. ఇ.డి కోల్‌కత్తా లోని ఈ కమిటీ లొకేషన్లలో 2021 ఎన్నికల ముందు చేసిన దాడుల మాదిరే రాబోయే ఎన్నికల ముందు కూడా ఇలాంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు చేపట్టటాన్ని బాహాటంగా ఇదొక అప్రజాస్వామిక చర్యగా, ఎన్నికల్లో పోటీ చేస్తున్న తమ పార్టీ రాజకీయ ఎత్తుగడలను దాడుల నెపంతో కేంద్రంలోని బిజెపి తెలుసుకొని ఆడించే ప్రయత్నంగా అభివర్ణిస్తూ బాహాబాహీ పోరాటానికి దిగింది. మమతా బెనర్జీ ఆవేశంతోపాటు సమయానుకూలంగా తన పార్టీ అస్తిత్వానికి ఎంతకైనా తెగించి పోరాడే మనస్తత్వం కలిగిన రాజకీయ నాయకురాలిగా పేరు తెచ్చుకుంది. ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఇ.పి.ఎసి)గా రూలింగ్ తృణమూల్ కాంగ్రెస్ (టి.యం.సి) పార్టీ ఎన్నికల ప్రచారాన్ని పొలిటికల్ కన్సల్టెన్సీ పేరుతో తీర్చిదిద్దే వ్యవస్థగా భావించవచ్చు. ఈ లొకేషన్లలో దాడులు మనీలాండరింగ్ దర్యాప్తుకోసమని ఎన్నికలకు సంబంధించిన దాడులు కానే కావని, ఇ.డి ప్రకటించిన నేపథ్యంలో ఈ విషయం చినికి చినికి గాలి వానగా మారి ప్రజాస్వామ్య పాలనకు ఆటంకం కలిగించే బిజెపి ఎత్తుగడగా ప్రచారం జరుగుతుండటంతో విపరీతమైన సమస్యలు తలెత్తే అవకాశాన్ని విశ్లేషకులు ఎత్తి చూపుతున్నారు. ఈ దాడులు ప్రజాస్వామ్యం మీద దాడి అని యాక్షన్ కమిటీ ఆఫీసు ముందు ప్రొటెస్టు చేసిన మమతా బెనర్జీ కేంద్రప్రభుత్వాన్ని విమర్శించి కేంద్రదర్యాప్తు వ్యవస్థలను అప్రజాస్వామికంగా వినియోగించుకొని ప్రతిపక్ష పార్టీలను సమూలంగా నిర్మూలించే ఎత్తుగడ అని అనటం కూడా విపక్షాలు ఎత్తిచూపుతున్నాయి. అయితే ఇ.డి మాత్రం తను అధికారులను అడ్డుకున్నారని డాక్యుమెంట్లను ఏక




కంఠంతో కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు పేరుతో సిబిఐ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ వినియోగించుకుంటున్నదని వ్యతిరేకిస్తున్నారు. ఎవరు వాస్తవాలు చెబుతున్నారు? ఎవరు వక్రీకరిస్తున్నారన్న అంశాన్ని పక్కకు పెట్టి విషయాన్నిలోతుగా మథనం చేస్తే ఒక స్పష్టమైన అవగాహన బహిర్గతమవుతుంది. సమయాసమయాలు ఏ ప్రధాన నాయకుడైనా ఇటు రాష్ట్రాలు పాలించే వారు కానీ, అటు కేంద్ర పాలన చేసే వారు కానీ పాలించక తప్పదు. ప్రజాస్వామ్యం దేశంలో పదికాలాల పాటు నిలబడాలంటే అధికార పక్షం విపక్షాలూ కూడా నిలబడగలిగి ఉండాలి. ఎన్నికలల్లో నిజాయితీగా ఏ పార్టీ అటు ప్రజల మెప్పుతో, ఓట్లతో గెలవాలంటే ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించబడాలి. ఇడి ఇలాంటి చర్య అదీ ఎన్నికలు అతి త్వరలో నిర్వహించబోతున్నప్పుడు ఒక పార్టీ రాజకీయంగా న్యాయబద్ధంగా ఎన్నికలలో పాల్గొనబోయే ముందు ఎన్నికల కార్యాచరణను, ఎత్తుగడలను సమీకరించుకొనే కేంద్రాల మీద దాడులు మనీలాండరింగ్‌కు సంబంధించిన ఆరోపణలను దర్యాప్తు కోసం దాడులు చేయటానికి ఇది సమయమా? ఇది సందర్భోచితమా? న్యాయబద్ధంగా ఆలోచించే సామాన్యుడికైనా ఈ చర్య తప్పు అని అనుకోవటాన్ని ఎవరూ తప్పుపట్టలేరు. కేంద్ర, రాష్ట్రాల సంబంధాలను దెబ్బతీసే చర్యగానే ఎవరైనా భావిస్తారు. ఎన్నికల కోసం డబ్బుల వినియోగంతోపాటు ఫండింగ్ ఎంతవరకు సహేతుకంగా జరుగుతున్నదన్న సందేహం ఎవరికైనా కలగకమానదు. ఎన్నికల్లో పోటీ చేసే అన్ని పార్టీలకూ, అధికారంలో ఉన్న పార్టీతోసహా, ఏపార్టీకీ ముఖ్యంగా అధికారంలో ఉన్న పార్టీకీ, మొగ్గుచూపకుండా ఎన్నికలు సజావుగా నడిపే విధంగా కేంద్ర ప్రభుత్వం ఉండక తప్పదు. కేవలం మాటలకే పరిమితం కాకుండా కార్యాచరణలలో కూడా ఆ దృక్పథాన్ని మెరుగైన రీతిలోచూపాలి. ఆవిధంగా ప్రభుత్వాలు చేస్తున్నాయి అనే బలమైన నమ్మకం ప్రజలకూ, ఓటర్లకూ అన్ని పార్టీల వారికీ కలిగినప్పుడే కొన్ని పొరుగుదేశాల్లో మాదిరి ఎన్నికల నిర్వహణ భ్రష్టుపట్టలేదు. సజావుగా నిజాయితీగా న్యాయబద్ధంగా ఆ అధికారంలో ఉన్నప్పుడు ఉండే అవకాశాలను దుర్వినియోగం చేయకుండా చట్టాలను అతిక్రమించకుండా కేంద్ర ప్రభుత్వం అందరికీ సమాన అవకాశాలతో ఏ వ్యవస్థనూ వాడుకోకుండా (ముఖ్యంగా ఇ.డి,సిబిఐ ఎన్నికల కమిషన్ లాంటి) ఎన్నికలను నిర్వహించాలి. అంతే కాదు ఆ విధమైన బలమైన విశ్వాసాన్ని అందరికీ కలిగించాలి. కేంద్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఉండాల్సిన బాధ్యతలను ఎత్తిచూపుతున్నప్పుడు ప్రతిపక్షాల విధులూ బాధ్యతలను ఎత్తి చూపడం, విస్మరించి ఏకపక్షంగా ఒక్క కేంద్రాన్ని తప్పుపట్టటం సమంజసం కాదు. ప్రతిపక్షాలు ఈ మధ్య ప్రతి చిన్న విషయాన్ని రాజకీయం చేస్తున్నాయి. పెద్ద పెద్ద పదాలను వాడుతూ ప్రధాన మంత్రి, రాష్ట్ర ముఖ్య మంత్రుల పదవులను అగౌరవపరుస్తున్నారు. 'చోర్' అన్న పదం అధి కారంలో ఉన్న పార్టీని కానీ, ప్రధానిని ఉద్దేశించి కానీ వాడ టం ఏ విధంగా చూడాలి? వాదనలో పసఉంటే పడికట్టు పదాలు అనవసరపు వర్ణనాపూరిత మాటలు అవసరం లేనే లేదు. నిజాలను వెలికి తీసి వ్రేలెత్తిచూపాలి. అర్థ సత్యా లనూ, అసత్యాలను నిజాలను నమ్మబలకడం ఈ ఆధునిక సాంకేతిక యుగంలో కొంతకాలం చెల్లినా ఎల్ల కాలం చెల్లదు. రాజకీయాల్లో గౌరవప్రదంగా బాధ్యతల నిర్వహణ ఏ పదవికైనా పదవీ లేకపోయినా వన్నెతెస్తుంది. రాజకీయాల్లో ఇంతవరకు మునుపు సహజ చతురోక్తులూ సాంప్రదాయాలు, గౌరవాన్ని ఇచ్చిపుచ్చుకోవటాలూ, రాజకీయ వాసనలేని కార్యక్రమాల్లో హుందాగా పాల్గొని పదవులూ హోదాలు కావు ముఖ్యం. సమత్వం సమదృష్టి నిజాయితీతత్వం ముఖ్యం అని ఆనాటి నాయకుల ప్రవర్తన తీరులో స్పష్టంగా ద్యోతక మయ్యేది. ఈనాటి రాజకీయాల్లో పెద్ద పదవులు అనుభవిస్తున్నవారు కూడా తక్కువ స్థాయిలో, నీచపదాలతో అసభ్యకరంగా వ్యవహరించటంచూస్తుంటే జాలివేస్తున్నది. అందు కనే రాజకీయాల్లో ఉన్నవారి పట్ల తేలిక భావం ప్రజల్లో ఏర్పడుతున్నది. ప్రజాస్వామ్యంలో పాలన 'నమ్మకం' పై ఆధారపడి ఉంది. ఎవరు, ఎంత పెద్ద పదవిలో ఉన్నా ప్రొటెస్టు కార్యక్రమాలు చేస్తున్నప్పుడు విషయాన్ని అగౌరవ పర్చకుండా వ్యక్తం చేయటమేముఖ్యం. అప్పుడు అసలు విషయం మరుగునపడదు. అలా కానప్పుడు అసలు పోయి 'కొసరు' మిగిలి రసాభాస పర్వం ఆవిష్కరించబడుతుంది. తస్మాత్ జాగ్రత్త. ●

# అభివృద్ధి పేరుతో ఊపిరి దోపిడి!

టి. శ్రీనివాస్

మన దేశంలో నేడు ఊపిరి పీల్చుకోవడం కూడా అదృష్టంగా మారిన పరిస్థితి నెలకొంది. స్వచ్ఛమైన గాలి జీవన హక్కులో భాగమని రాజ్యాంగం చెబుతుంటే, వాస్తవంలో మాత్రం కోట్లాది మంది రోజూ విషగాలినే శ్వాసగా తీసుకుంటున్నారు. అభివృద్ధి అనే ముసుగులో మనం సృష్టించిన వాయు కాలుష్యం ఇప్పుడు మౌన హంతకుడిగా మారి, ఎలాంటి హెచ్చరిక లేకుండానే ప్రజల ఆరోగ్యాన్ని కబళిస్తోంది. రహదారులపై వాహనాల పొగ, పరిశ్రమల నుంచి ఎగసే దుమ్ము, చెత్త దహనం నుంచి వెలువడే విష వాయువులు ఇవన్నీ కలిసి మన ఊపిరితిత్తులపై నిరంతర దాడి చేస్తున్నాయి. ఈ దాడికి బాధ్యులు ఎవరు? ప్రభుత్వాలా? పరిశ్రమలా? ప్రజలా? నిజానికి ఈ మూడు కలిసిన నిర్లక్ష్యమే ఈ సంక్షోభానికి మూలం. నగరాల అభివృద్ధిని వాహనాల సంఖ్యతో కొలిచే మన దృక్పథమే గాలిని విషపూరితం చేసింది. ప్రతి కుటుంబానికి రెండు, మూడు వాహనాలు సాధారణమవుతున్న ఈ కాలంలో, ట్రాఫిక్ జామ్‌లు కేవలం సమయాన్ని కాదు, ఆరోగ్యాన్ని కూడా తినేస్తున్నాయి. డీజిల్, పెట్రోల్ వాహనాల నుంచి వెలువడే కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు గాలిలో కలసి కనిపించని గోడలా మన చుట్టూ ఏర్పడుతున్నాయి. పిల్లల ఊపిరితిత్తులు ఇంకా ఎదుగుతున్న దశలోనే విష వాయువులతో నిండిపోతున్నాయి. ఇది కేవలం వ్యక్తిగత ఆరోగ్య సమస్య కాదు. ఇది భవిష్యత్ తరాలపై మోపుతున్న సామూహిక నేరం. పరిశ్రమల కాలుష్యం మరో ఘోరమైన వాస్తవం. లాభాల కోసం నిబంధనలను పక్కన పెట్టే పరిశ్రమలు, పర్యవేక్షణలో వైఫల్యం చూపుతున్న పాలకులు కలిసి గాలిని విషపూరితం చేస్తున్నారు. కాలుష్య నియంత్రణ పరికరాలు పత్రాలపై మాత్రమే ఉండటం, తనిఖీలు కాగితాలకే పరిమితం కావడం ఈ వ్యవస్థల నిర్లక్ష్యాన్ని ఎండగడుతోంది. విద్యుత్ అవసరాల పేరుతో బొగ్గును విపరీతంగా కాల్చడం, ప్రత్యామ్నాయ శక్తులపై నిర్లక్ష్యం చూపడం వల్ల వాతావరణ మార్పుల ముప్పు మరింత పెరుగుతోంది. అరణ్యాల నాశనం ఈ సమస్యకు నూనెపోస్తున్నట్లే. చెట్లులేకుండా అభివృద్ధి సాధ్యమన్న అపోహ మనకు ఊపిరాడనీయకుండా చేస్తోంది. అడవులు కేవలం కలప నిల్వలు కాదు అవి గాలిని శుద్ధి చేసే సహజ ఫిల్టర్లు. కానీ రియల్ ఎస్టేట్, మైనింగ్, రహదారి ప్రాజెక్టుల పేరుతో అడవులను నరికేస్తూ, అదే సమయంలో గాలి విషమవుతోందని ఆందోళన వ్యక్తం చేయడం పరస్పర విరుద్ధత కాదు మరేమిటి? గ్రామీణ ప్రాంతాల్లో పంట అవశేషాలను కాల్చడం, పట్టణాల్లో చెత్తను తగలబెట్టడం వంటి అలవాట్లు ఈ విషవలయాన్ని మరింత బిగిస్తున్నాయి. వాయు కాలుష్యం ప్రభావాలు ఇక గణాంకాలకే పరిమితం కావడం లేదు అవి ఆసుపత్రులలో కనిపిస్తున్నాయి. ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు, క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. వైద్య ఖర్చులు కుటుంబాలను కుంగదీస్తున్నాయి. వాయుకాలుష్యం వల్ల ఏర్పడేఆమ్లవర్షాలు, ఉష్ణోగ్రతల పెరుగుదల, అసాధారణ వర్షాలు ప్రకృతిలో అసమతుల్యతను సృష్టిస్తున్నాయి. ఇది మనిషి ప్రకృతితో చేస్తున్న యుద్ధఫలితం. ఈ సంక్షోభం నుంచి బయట పడాలంటే మాటలతో కాదు, కఠిన నిర్ణయాలతో ముందుకు రావాలి. ప్రజా రవాణాను బలపరచకుండా, వ్యక్తిగత వాహనాలపై ఆధారాన్ని తగ్గించకుండా గాలి శుద్ధి సాధ్యం కాదు. ●

# ప్రజావాక్కు



## సమతుల్యతే మార్గం

**చెరువులు,** వీధులు, కాలనీల్లో తిరుగుతున్న వీధికుక్కల సమస్యపై దేశవ్యాప్తంగా తీవ్ర చర్చ సాగుతున్న వేళ, ఈ అంశంపైవిధించినఆంక్షలను సడలించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అదే సమయంలో వీధికుక్కలపై దాడులు, కుక్కలపై ద్వేషపూరిత చర్యలు వంటి అంశాలను ఈ కేసు పరిధిలోకి విస్తరించేందుకుకూడా న్యాయస్థానం ఒప్పుకోలేదు. ఈ తీర్పు ప్రజా భద్రత, జంతుసంక్షేమం అనే రెండు సున్నితమైన అంశాల మధ్య సమతుల్యతను కాపాడే ప్రయత్నంగా చూడాలి. అయితే ఈసమస్యకు పరిష్కారం భావోద్వేగాలతో కాకుండా చట్టబద్ధమైన, శాస్త్రీయమైన విధానాల ద్వారా రావాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టంచేసినట్టుగా ఈతీర్పు తెలియజేస్తోంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## పర్యవేక్షణ తప్పనిసరి

**ఇప్పటి** కాలంలోచిన్నపిల్లల చేతుల్లోకూడా మొబైల్ ఫోన్లు కనిపిస్తున్నాయి. చదువుకోడానికి, ఆటల కోసం అని మొదలైన ఈ అలవాటు క్రమంగా హానికరంగా మారుతోంది. ఎక్కువసేపు మొబైల్ వాడడంవల్ల కంటిచూపు తగ్గిపోవడం, నిద్రసరిగా లేకపోవడం, శారీరక చలనం తగ్గిపోవడం జరుగుతోంది. మొబైల్ గేమ్స్, వీడియోలతో సమయం వృథాఅవ్వడంతో చదువుపైదృష్టి తగ్గిపోతోంది. స్నేహితులతో ఆడుకోవడం, మాట్లాడడం తగ్గి పిల్లలు ఒంటరిగా మారుతున్నారు. కొన్నిసార్లుఅనుచితమైన కంటెంట్ చూసే ప్రమాదం ఉంది. అందుకే తల్లిదండ్రులు పిల్లల మొబైల్ వాడకాన్ని పరిమితం చేసి, పర్యవేక్షణలో ఉంచాలి.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

## యుద్ధాలతో ఆకలికేకలు

ఈ ప్రపంచ ఆధిపత్య పోరాటాల రూపంలో ఆకలి చావులు సంభవించే అవకాశం ఉంది అది. రష్యా, ఉక్రెయిన్ మీద చూపిన ఆధిపత్యం వల్లనే అనే విషయం విదితమే. అయితే ఇప్పుడు గ్రీన్‌ల్యాండ్ బహిరంగంగా మేము తీసుకుంటామని, ఇప్పటికే వెనుజులదేశాధ్యక్షుడిని ఎత్తుకెళ్ళాం అని బహిరంగంగా ప్రకటించిన నేపథ్యంలో ప్రజల సంక్షేమంపరిస్థితి ఏమిటి? ఆధిపత్యంపోరులో సామాన్య జనం ఆకలిచావులు సంభవించడం ఈ దాశబ్దపు విచారం.

- భారత అవినాష్, జనగామ

## సమన్వయంతో కాలుష్య నియంత్రణ

**ఏపి** కాలుష్య నివారణ మండలి ప్రస్తుత ఛైర్మన్ రాబోయే భోగీ సందర్భంగా ఏర్పాటు చేసేభోగీ మంటల్లో ఇష్టానుసారం ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వగైరా వేయడం చేయరాదని చెప్పారు. కట్టెలు, వ్యవసాయ వ్యర్థాలు వల్ల ఏ హానీ లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో గాలిలోకి ప్రవేశించి వాతావరణాన్ని కలుషితం చేసే పొగలు చాలా ప్రమాదం. కొన్ని ఆ ప్రాంతంలో ఉన్న వారికి తక్షణమే శ్వాసకోశ ఇబ్బందితో ప్రమాదం వస్తుంది. కేవలం భోగీ మంట సందర్భం మాత్రమే కాక సాధారణంగా కూడా వాటిని గుర్తించి నిరోధించాలి. ముఖ్యంగా వీధి చివరి ఇటువంటి మంటలు ఎన్నో కనిపిస్తున్నాయి. వాటిలో నిషేధిత వస్తువులు వేసే పనివల్ల అందరికీ ముప్పు అని గుర్తెరగాలి.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

## విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెంచాలి

**భారత** విద్యా వ్యవస్థలో పరిశోధనా దృష్టిని విస్తరించాల్సిన అవసరం అత్యంత కీలకంగా మారింది. దేశంలో కోట్లాది మంది విద్యార్థులు, లక్షలాది పాఠశాలలు, ఉపాధ్యాయులు ఉన్న పరిస్థితిలో, పిల్లలలోజిజ్ఞాస, విచారణ, విశ్లేషణాత్మక ఆలోచనలను పెంపొందించడం ప్రధాన బాధ్యతగా నిలిచింది. చదువు అనేది కేవలం పాఠ్యపుస్తకాలు వల్లెవేయడం కాదు, ప్రశ్నించడం, అన్వేషించడం, వివిధ కోణాలలో ఆలోచించడం అనే దృక్పథాన్ని చిన్నప్పటి నుంచే అభివృద్ధి చేయాలి. పాఠశాల స్థాయి నుంచే గురువులు విచారణాత్మక పద్ధతులను బోధనా ప్రక్రియలో చేర్చాలి. తరగతిగదిలో చిన్నపాటి అన్వేషణా పనులు, పరిశీలన ఆధారిత కార్యాచరణలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల ఆలోచనా శక్తివిస్తరిస్తుంది. వారు 'ఎందుకు', 'ఎలా'దీనికి కారణం ఏమిటి' వంటి ప్రశ్నలు అడగడం ప్రారంభిస్తారు. ఈ ప్రశ్నించే గుణమే సమాజ పురోగతికి, విజ్ఞాన విస్తరణకు పునాది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## రికార్డులతో భూ సమస్యల పరిష్కారం

**తెలంగాణ** రాష్ట్రంలోని వ్యవసాయ భూములు, ఇండ్ల స్థలాల కబ్జాలు కాకుండా వివాదాలు గొడవలు కాకుండా రెవెన్యూ రికార్డులప్రకారంభూసమస్యలు పరిష్కారంచేయాలి. మండల కేంద్రాలలో ప్రభుత్వం పంచిన ఇండ్ల స్థలాలలో భూముల విలువ పెరిగిభూకబ్జాలు ఎక్కువగా అవుతున్నాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారంఇండ్ల స్థలాల విస్తీర్ణం, కొలతలు, మ్యాపులు, రెవిన్యూ రికార్డులను పరిశీలించి వివాదాలను పరిష్కరించాలి.

- రాపాక రవీందర్, జనగాం

# భూమి, కౌలు సంస్కరణలు అవసరం

డా. సునీల్ కుమార్ పోతన

భారతదేశంలో దాదాపు సగం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. కానీ దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో ఐదవ వంతు కంటే తక్కువ వాటా దక్కుతోంది. ఆర్థిక అవసరం, నిర్మాణాత్మక సవాలు రెండింటినీ ఈ సూచిక సూచిస్తోంది. భారత ప్రభుత్వ గణాంకాల మంత్రిత్వ శాఖ అంచనాల ప్రకారం పంట ఉత్పాదకత, సంస్థాగత క్రెడిట్ వంటివి వ్యవసాయ విలువలో మెరుగుదలను సూచిస్తున్నాయి. కానీ, నిర్మాణాత్మక అసమానతలు, పర్యావరణ ఒత్తిడి, విధాన పరిమితులతో పురోగతి అసమానంగా ఉందని అనేక విశ్లేషణలు వెల్లడిస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రకారం, 2030నాటికీ చిన్నతరహా ఆహార ఉత్పత్తిదారుల వ్యవసాయ ఉత్పాదకత, ఆదాయాలను రెట్టింపు చేయాలి. భారతీయ రైతులలో 85 శాతం కంటే ఎక్కువ మంది రెండు హెక్టార్ల కంటే తక్కువ భూమిపై పనిచేస్తున్నారు. కమతాలను విచ్ఛిన్నం చేయడంతో ఆర్థిక వ్యవస్థలు తగ్గాయి. ఇది యాంత్రీకరణను పరిమితం చేస్తోంది. ఉత్పత్తి ఖర్చులను పెంచుతోంది. హెక్టారుకు వరి, గోధుమల దిగుబడి వంటి ఉత్పాదకత సూచికలు 2025 నాటికి మెరుగుపడ్డాయి. నిర్మాణాత్మక పరిమితుల కింద ఉత్పాదకతను రెట్టింపు చేయడానికి పరివర్తనాత్మక భూమి, కౌలుసంస్కరణలు అవసరం. ఇవి రాజకీయంగా సున్నితంగా, పరిపాలనా పరంగా బలహీనంగా ఉన్నాయి. భూమి ఏకీకరణ, లీజు భద్రత, కార్యాచరణ స్థాయిని పరిష్కరించకుండా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకోలేం. 2030 నాటికి నికర ఆదాయాలు నిజంగా రెట్టింపు కావడానికి ప్రస్తుత ఆదాయ వృద్ధి సరిపోదని ఆందోళనలను కలిగిస్తున్నాయి. ప్రభుత్వ గణాంకాలు 2025 ప్రకారం వ్యవసాయ స్థూల విలువలో స్థిరమైన పెరుగుదల కనిపిస్తోంది. ఇది సగటు ఆదాయాలలో మెరుగుదలను సూచిస్తుంది. కానీ, క్లిష్టమైన సమస్య ఏమిటంటే విత్తనాలు, ఎరువులు, విద్యుత్, కార్మికశ్రమతో సహా పెరుగుతున్న సాగు ఖర్చులకు అనుగుణంగా ఆదాయ వృద్ధి లేదు. చిన్నతరహా ఉత్పత్తిదారులకు వాస్తవ ఆదాయలాభాలు నామమాత్రపు పెరుగుదల సూచించిన దానికంటే తక్కువగా ఉన్నాయి. ప్రధాన తృణధాన్యాలకు కొంత ఆదాయ స్థిరత్వాన్ని కనీస మద్దతు ధర విధానాలు అందించాయి. ఇది భౌగోళికంగా, పంటల వారీగా పరిమితంగానే ఉంది. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యానవన పంటలను పండించే లేదా పశువులు, మత్స్య సంపదలో నిమగ్నమైన చిన్న రైతులలో ఎక్కువ మంది మార్కెట్ అస్థిరతకు గురవుతున్నారు చిన్నతరహా ఆహార ఉత్పత్తిదారులలోఉత్పాదకతకు ఒక కోణాన్ని సూచించే గోధుమలు, బియ్యం వంటి ప్రధాన పంటలలో ఉత్పాదకత ఇటీవలి సంవత్సరాలలో సాపేక్షంగా స్వల్ప పెరుగుదల ధోరణిని చూపింది. గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వశాఖ ప్రచురించిన ఎస్‌డిజి జాతీయ సూచిక ఫ్రేమ్‌వర్క్ పురోగతి నివేదిక 2025ప్రకారంగోధుమ దిగుబడి 2015-16లో హెక్టారుకు సుమారు 3,034 కిలోలు ఉండగా 2024-25నాటికి సుమారు 3,540 కిలోలకు పెరిగింది. బియ్యం ఉత్పాదకత కూడా అదేకాలంలో హెక్టారుకు 2,400 కిలోల నుండి 2,859 కిలోలకు పెరిగింది.



ఉత్పాదకతలో క్రమంగా జరుగుతున్న మెరుగుదలలను ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. కానీ, మార్పువేగాన్ని గమనిస్తే 2030 నాటికి రెట్టింపు లక్ష్యాన్ని చేరుకోవడానికి గణనీయమైన వేగవంతం అవసరమని తెలుస్తోంది. వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలలో నిమగ్నమైన వ్యక్తుల సగటు ఆర్థిక సహకారాన్ని వ్యవసాయ రంగంలో స్థూల విలువ జోడింపు (జీవీఏ)ప్రతిబింబిస్తుంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ప్రతి కార్మికుడికి వ్యవసాయ జీవీఏ గత దశాబ్దంలో స్థిరంగా పెరిగింది. 2015-16లో సుమారురూ. 61,427 ఉండగా 2024-25లో సుమారు రూ. 94,110కి చేరింది. ఈ పెరుగుదల ప్రోత్సాహకరంగా ఉన్నప్పటికీ, వ్యవసాయ రంగంలో ఆదాయాల వృద్ధి వ్యవసాయేతర రంగాల కంటే వెనుకబడి ఉందని స్పష్టంచేస్తుంది. ఉత్పాదకతను మెరుగుపరచడంలో సాంకేతిక పురోగతి కీలకం. డిజిటల్‌వ్యవసాయ వేదికలు, సూక్ష్మ నీటిపారుదలని భారత ప్రభుత్వం ప్రోత్సహించింది. విస్తరణ సేవల పరిధి ప్రభావం అసమానంగానే ఉంది. ప్రధాన పంటలలో నీరు, ఎరువులు, రసాయనాల తీవ్రమైన వాడకంపై భారతదేశ ఉత్పాదకత లాభాలు ఆధారపడి ఉంటాయి. పెరుగుతున్న భూగర్భజల క్షీణత, నేల క్షీణత, వాతావరణ సంబంధిత ప్రమాదాలు, ముఖ్యంగా వేడి ఒత్తిడి, క్రమరహిత వర్షపాతం ఆందోళన కలిగించే అంశాలు. ఇండోగంగా మైదానాలు వంటి ప్రాంతాలలో సాంప్రదాయిక తీవ్రత ద్వారా మరింత ఉత్పాదకత పెరుగుదల పర్యావరణపరంగా నిలకడలేదు. వాతావరణస్థిరమైన, వనరులసమర్థవంతమైన వ్యవసాయంవైపు నిర్ణయాత్మక మార్పు లేకుండా ఉత్పాదకతను రెట్టింపుచేసే ప్రయత్నాలు దీర్ఘకాలిక దుర్బలత్వాలను తీవ్రతరం చేస్తాయి. ఆదాయాలు, ఆహార భద్రత రెండింటికీ ప్రమాదమే. భూమి, వనరులు, జ్ఞానం, ఆర్థిక సేవలకు సురక్షితమైన, సమాన ప్రాప్యతనుస్పష్టంగా ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యం గుర్తుచేస్తోంది. ఈ రంగాలలో భారతదేశం అసమానతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వ్యవసాయ శ్రామిక శక్తిలో మహిళలు గణనీయమైన వాటాను కలిగి ఉన్నారు. కానీ, అధికారిక డేటా ప్రకారం కార్యాచరణ భూమిలో 15శాతం కంటే తక్కువ మంది మహిళల పేర్లపైన వ్యవసాయ ఆస్తులున్నాయి. ఇది సంస్థాగత క్రెడిట్, భీమా, ప్రభుత్వ పథకాలకు వారి ప్రాప్యతను పరిమితం చేస్తుంది. కిసాన్ క్రెడిట్ కార్డులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు వంటి కార్యక్రమాలు 2025నాటికి గణనీయంగా విస్తరించినప్పటికీ, నాయకత్వం, నిర్ణయం తీసుకునే విషయంలో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉంది. అనధికారిక కౌలుదారుల నిలకడ, భూమి హక్కులు లేకపోవడం కౌలు రైతులకు మేలు జరగడం లేదు. ఆదాయాలను మెరుగుపరచడానికి అధిక ఉత్పత్తి మాత్రమే కాకుండా మెరుగైన మార్కెట్ ఏకీకరణ అవసరం. వ్యవసాయ మార్కెట్లు, మౌలిక సదుపాయాల నిధులు, వ్యవసాయ ప్రాసెసింగ్‌నుప్రోత్సహించడం వంటి సంస్కరణలు 2025 నాటికి పురోగమించినప్పటికీ, చిన్నతరహా ఉత్పత్తిదారులు ఇప్పటికీ బలహీనంగానే ఉన్నారు. లోతైన భూ సంస్కరణలు, మహిళలు, అట్టడుగు ఉత్పత్తిదారుల భాగస్వామ్యం పెరగాలి. స్థిరమైన వనరుల నిర్వహణ, బలమైన మార్కెట్ సంస్థలులేకుండా పురోగతి అసమానంగానే ఉంటుంది. ఇప్పటికే ఉన్న పథకాలనుహెచ్చించి వ్యవసాయ అభివృద్ధిని సమానత్వం, స్థితిస్థాపకత, దీర్ఘకాలిక స్థిరత్వం వైపు తిరిగి మార్చడం అవసరం. ●

మన వి — ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఇరాన్‌పై సైనిక చర్యకు యుఎస్ రెడీ!

- ట్రంప్ తాజా వ్యూహరచన.. - ఇరాన్ రెడ్‌లైన్ దాటుతోంది, జోక్యం చేసుకుంటామని హెచ్చరికలు - ఇజ్రాయెల్ ప్రధానితో అమెరికా విదేశాంగ కార్యదర్శి సమాలోచనలు - యుద్ధం కోరుకోవడం లేదు, చర్చలకు సిద్ధం: ఇరాన్ విదేశాంగ మంత్రి

**వాషింగ్టన్, జనవరి 12:** ఇరాన్‌పై సైనిక చర్య చేపట్టడానికి అమెరికా సన్నద్ధమవుతోంది. ఇప్పటికే వెనిజులాపై అర్ధరాత్రి దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను బందీగా పట్టుకుని విజయం సాధించింది. అదే ఊపులో ఆర్కిటిక్‌లో అత్యంత కీలకమైన గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు డెన్మార్క్‌పై ట్రంప్ నిరంతరం పలు రూపాల్లో ఒత్తిడి తెస్తున్నారు. తాజాగా డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై దృష్టి సారించినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. టెహ్రాన్‌లో అమెరికా జోక్యం చేసుకునే అంశానికి సంబంధించి చాలా వేగంగా ట్రంప్ పావులు కదుపుతున్నారు. ఓ వైపు బహిరంగంగా ఇరాన్ పాలకులను హెచ్చరించడం... మరోవైపు కలిసిసొచ్చే దేశాలతో దౌత్య సంబంధాలు నెరుపుతున్నారు. ఇందులో భాగంగా అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహుతో సమావేయ్యారు. ఇరాన్‌లో అమెరికా జోక్యంపైనే ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. గత ఏడాది ఇరాన్ అణుకేంద్రాలపై దాడులకు ఆదేశించిన ట్రంప్, తాజా పరిస్థితులను నేరుగా పర్యవేక్షిస్తున్నట్లు అధికార వర్గాల సమాచారం. తాజాగా ఎయిర్‌ఫోర్స్ వన్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ, "ఇరాన్‌లో నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఇవన్నీ చూస్తే ఇరాన్ స్వేచ్ఛ కోసం చూస్తోంది. అయితే, పాలకులు మాత్రం నిరసనలను అణచివేయడానికి ప్రయత్నిస్తోంది. నిరసనకారులపై నేరుగా కాల్పులు జరుపుతోంది. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి చర్యలు కొనసాగితే తాము చూస్తూ ఊరుకోం" అంటూ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా ప్రభుత్వం కొన్ని చలా కఠినమైన చర్యలను పరిశీలిస్తోందంటూ తెలిపారు. సైనిక చర్యకు దిగుతామని చెప్పకుండా కఠిన చర్యలంటూ ట్రంప్ దాటవేశారు. ఇప్పటికే ఇరాన్ రెడ్‌లైన్ దాటుతోంది. నిరసనకారులను చంపడమేంటి? అని మండిపడ్డారు. కేవలం హింస ద్వారా పరిపాలిస్తున్నారో నాకు తెలియదు కానీ తాము దీనిని చాలా తీవ్రంగా పరిశీలిస్తున్నాము. సైన్యం దీనిని పరిశీలిస్తోంది. తాము కొన్ని చాలా కఠినమైన చర్యలను పరిశీలిస్తున్నాము. తాము ఒక నిర్ణయం తీసుకుంటాము" అని ట్రంప్ పునరుద్ఘాటించారు. ట్రంప్ తాజా ప్రకటనపై అంతర్జాతీయ మీడియాలో పలు కథనాలు వెలువడ్డాయి. టెహ్రాన్‌లోని పలు ప్రాంతాలు సహా ఇరాన్ భద్రతాదళాలే లక్ష్యంగా దాడులుచేసే పలు ప్రతిపాదనలను సైన్యం వివరించినట్లు అమెరికా అధికారులు చెప్పారు. పశ్చిమాసియాలోని అమెరికా రాయబార కార్యాలయాలు, భద్రతాదళాలపై టెహ్రాన్ ప్రతీకార చర్యలకు అవకాశం లేకుండా దాడులు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు అగ్రరాజ్యం సైనికాధికారులు తెలిపారు. బలమైన సైనిక చర్య జరపటానికి వీలుగా వనరుల సమీకరణకు కొంత సమయం కావాలని మిలిటరీ కమాండర్లు కోరినట్లు చెప్పారు. మిడ్‌నైట్ హ్యామర్ పేరుతో ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపై 6 నెలల క్రితం దాడులు జరిపిన అమెరికా మళ్లీ ఆ దిశగా చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై సైనిక చర్యకు దిగడం ఖాయం, అది ఎలా ఉంటుందనే దానిపైనే సర్వత్రా ఉత్కంఠ.

**యుద్ధం కోరుకోవడం లేదు... చర్చలకు సిద్ధం**

యుద్ధాన్ని కోరుకోవడం లేదు కానీ, యుద్ధానికి ఇరాన్ పూర్తిగా సిద్ధంగా ఉందని విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి స్పష్టం చేశారు. టెహ్రాన్‌లో విదేశీ రాయబారులను ఉద్దేశించి అబ్బాస్ మాట్లాడుతూ, తాము చర్చలకు కూడా సిద్ధంగా ఉన్నాము, కానీ ఈ చర్చలు న్యాయంగా, సమాన హకునకలతో, పరస్పర గౌరవం ఆధారంగా ఉండాలి అని పేర్కొన్నారు. గత ఏడాది జూన్‌లో ఇజ్రాయెల్‌తో 12 రోజుల యుద్ధంలో కంటే ఇరాన్ మరింత సిద్ధంగా ఉందని అరాఘ్చి అన్నారు.

**చర్చల కోసం ఇరాన్ నాయకులు ఫోన్ చేశారు: ట్రంప్**

సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ నేతృత్వంలోని ఇరాన్ నాయకత్వం తనతో చర్చల జరిపేందుకు ముందుకొచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ప్రస్తుతం జరుగుతోన్న ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలపై చర్చల కోసం ఇరాన్ నాయకులు తనకు ఫోన్ చేశారని తెలిపారు. అమెరికా చేతిలో దెబ్బలు తినడం వారికి విసుగు చెంది ఉంటుందని అందుకే చర్చలకు వచ్చినట్లు తెలుస్తోందన్నారు. త్వరలోనే ఇరాన్ నాయకత్వంతో భేటీ అయ్యే అవకాశం ఉందని, అది కూడా ఒక సమావేశం మాత్రమే జరుగుతుందన్నారు. అయితే, ఇరాన్ తన పరిమితులు దాటినట్లుగా కనిపిస్తోందని భేటీకి ముందే తాము చర్యలు తీసుకునే అవకాశాలు కూడా ఉన్నాయని అభిప్రాయపడ్డారు.



## పట్టాలపైకి వస్తున్న వందేభారత్ స్లీపర్

ఎమర్జెన్సీ, విఐపి కోటాలుండవు..

**న్యూఢిల్లీ, జనవరి 12:** వందే భారత్ స్లీపర్ రైలు మరి కొన్ని రోజుల్లో పట్టాలెక్కనుంది. కోల్‌కతా, గువాహటి మధ్య తొలి వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ పరుగులు పెట్టనుంది. ఈ రైలు రాకతో తూర్పు భారతం, ఈశాన్య రాష్ట్రాల మధ్య రవాణా సదుపాయం మరింత మెరుగవుతుంది. ఈ రైలు ప్రారంభం కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాట్లను దాదాపు పూర్తి చేసింది.సామాన్యుల కోసమే ఈ రైలును ప్రవేశపెట్టినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ రైల్లో ఎమర్జెన్సీ, వీఐపీ కోటాలు వంటివేవీ ఉండవు. రైల్వే ఉన్నతాధికారుల పాస్‌లు కూడా ఈ రైల్లో చెల్లుబాటు కావు. కేవలం కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్లు ఉన్న వారికే ఇందులో ప్రయాణించే అవకాశం ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆర్‌ఏసీ టిక్కెట్స్‌కు కూడా ఈ రైల్లో అనుమతి ఉండదు. ప్యాసింజర్‌లకు అత్యద్భుత ప్రయాణ అనుభవం కల్పించేందుకు ఇలాంటి నిబంధనలు విధించినట్టు తెలుస్తోంది. ఈ రైల్లో ప్రయాణికులకు పలు సౌకర్యాలు కల్పించనున్నారు. ఆధునిక బెడ్స్, బ్లాంకెట్ కవర్స్ అందుబాటులో ఉంటాయి. సాధారణ రైళ్లల్లో కంటే ఇవి ఎంతో మెరుగ్గా ఉండనున్నాయి. ఏకీకృత నిబంధనలు, పారదర్శక టిక్కెటింగ్ విధానం అమల్లో ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

స్థానిక వంటకాలు ఈ రైల్లో అందుబాటులో ఉంటాయి. భారత సంస్కృతి ఉట్టిపడేలా రైలు లోపలి డిజైన్ ఉంటుందని కూడా అధికారులు చెప్పారు. ఈ రైల్లో మొత్తం 823 బెర్తులు ఉన్నాయి. పదకొండు 3టైర్ ఏసీ కోచ్‌లు , నాలుగు 2టైర్ ఏసీ కోచ్‌లు, 1ఏసీ కోచ్ ఒకటి ఉన్నాయి. ప్రయాణికులకు అత్యంత సౌకర్యవంతంగా ఉండేలా బెర్తులను రూపొందించారు. పటిష్ట భద్రతా ఏర్పాట్లు అనేకం చేశారు. రైలు ప్రమాదాలను నివారించే కవచ్ వ్యవస్థతో పాటు పరిశుభ్రత కోసం కోచ్‌లల్లో ప్రత్యేక డిస్‌ఇన్‌ఫెక్టెంట్ టెక్నాలజీని ఉపయోగించారని అధికార వర్గాలు తెలిపాయి. కనీస ఛార్జి రూ.960నుంచిమొదలవుతుంది. గరిష్టంగా 3500 కిలోమీటర్లకు ఫస్ట్ ఎసి ఛార్జి రూ.13,300గా ఉంది. థర్డ్ ఎసి కిలోమీటరుకు రూ.2.4, సెకండ్ ఎసికి కిలోమీటరుకు రూ.3.1, ఫస్ట్ ఎసికి కిలోమీటరుకు 3.8రూపాయలచొప్పున చెల్లించాలి.

## డేటా మిస్‌మ్యాచ్.. అసలైన ఓటర్లకు సమస్య



**సిఇసికి లేఖ రాసిన మమతా బెనర్జీ**

**కోల్‌కతా, జనవరి 12:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ మరోసారి అభ్యంతరాలు లేవనెత్తారు. ఈ ప్రక్రియ కోసం వినియోగిస్తున్న 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియలో లోపాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. దీంతో నిజమైన ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషన్ జ్ఞానేష్‌కుమార్‌కు లేఖ రాశారు. ఎస్‌ఐఆర్ మొదలు సిఇసికి దీదీ లేఖ రాయడం ఇది అయిదోసారి. కృత్రిమ మేధ ఆధారంగా 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ చేపట్టారు. అయితే, ఈ ప్రక్రియ సందర్భంగా ఓటర్ల వివరాల్లో తీవ్ర తప్పిదాలు చోటుచేసుకున్నాయి. ఇది కాస్తా పెద్ద ఎత్తున డేటా మిస్‌మ్యాచ్‌కు దారి తీసింది. దీంతో నిజమైన ఓటర్లు ఈ సమస్య బారిన పడ్డారు. ఓటర్ల జాబితా సవరణలకు సంబంధించి గత రెండు దశాబ్దాలుగా అనుసరించిన విధానాలను ఎన్నికల సంఘం పక్కన పెట్టింది. దీంతో ఓటర్లు తమ గుర్తింపును మళ్లీ నిరూపించుకోవాల్సి వస్తోంది. ఇసి తన సొంత పద్ధతులను విస్మరించడం, ఏకపక్షం, అహేతుకం, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఎస్‌ఐఆర్ సమయంలో సమర్పించిన పత్రాలకు సరైన రసీదు ఇవ్వడం లేదు.

ఈ ప్రక్రియలోనే లోపం ఉంది. ఎస్‌ఐఆర్ విచారణ ప్రక్రియ సైతం చాలావరకు యాంత్రికంగా, సాంకేతికంగా, సాంకేతిక డేటా ఆధారంగానే కొనసాగుతోంది. సున్నితత్వం, మానవీయతను పట్టించుకోవడం లేదు. ఇది మన ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను దెబ్బతీస్తోంది అని మమతా బెనర్జీ తన లేఖలో పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా బెంగాల్‌లో ఎస్‌ఐఆర్‌లో భాగంగా 58లక్షల మంది పేర్లను ఇసి తొలగించిన విషయం తెలిసిందే.

## భార్యను పోలీస్‌స్టేషన్‌లో కాల్చి చంపిన భర్త!

**లక్నో, జనవరి 12:** ఉత్తరప్రదేశ్‌లో దారుణం జరిగింది. 36 ఏళ్ల వ్యక్తి తన భార్యను పోలీస్‌స్టేషన్‌లోనే కాల్చి చంపాడు. ఈ ఘటన రాంపూర్ అతారియాలో జరిగింది. వివరాల్లోకి వెళితే తన భార్య లవర్‌తో కలిసి వెళ్లిపోయినట్లు కొన్ని రోజుల క్రితమే భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందిత వ్యక్తిని అనూప్‌గా గుర్తించారు. భార్యను పోలీస్‌స్టేషన్‌లో చంపిన అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హర్దోయి ఎస్పీ అశోక్‌కుమార్ మీనా మాట్లాడుతూ ఈ కేసులో దర్యాప్తు అధికారితో పాటు మహిళా కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసినట్లు చెప్పారు. డ్యూటీలో నిర్లక్ష్యం కింద ఆ ఇద్దర్నీ సస్పెండ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం అనూప్ భార్య సోని వయసు 35 ఏళ్లు. ఆమె స్వస్థలం రామాపూర్ అతారియా. అయిదు రోజుల క్రితం లవర్‌తో కలిసి ఆమె పరారీ అయింది. ఈ నేపథ్యంలో అనూప్ ఎఫ్ఐఆర్ నమోదు చేశాడు. నగలు, 35 వేల నగదు తీసుకెళ్లినట్లు తన ఫిర్యాదులో ఆరోపించాడు. ఆదివారం అనూప్ భార్యను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఉదయం కోర్టులో ఆమెను ప్రవేశపెట్టాల్సి ఉంది. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న క్యాంటిన్‌కు సోనీని ఓ మహిళా కానిస్టేబుల్ తీసుకెళ్లింది. అక్కడ వేచి ఉన్న భర్త అనూప్ సోనిపై దాడి చేసి కాల్చేశాడు. సోనీ తీవ్రంగా గాయపడింది. తుపాకీ శబ్దానికి పోలీసులు ఆందోళన పడ్డారు. వేగంగా అక్కడికి పరుగెత్తుకు వచ్చారు. తప్పించుకోబోతున్న అనూప్‌తో పాటు మరో వ్యక్తిని పట్టుకున్నారు. హత్యకు వాడిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. తీవ్రంగా గాయపడిన సోనీని ఆసుపత్రికి తీసుకెళ్లారు. కానీ ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోనే సెక్యూరిటీ లోపం ఎలా జరిగిందన్న కోణంలోనూ ప్రత్యేక దర్యాప్తు చేస్తున్నారు.

## అల్లర్లతో అట్టుడుకుతున్న ఇరాన్.. 500 మందికిపైగా మృతి



**టెహ్రాన్, జనవరి 12:** ఇరాన్ అట్టుడుకుతున్నది. ఆ దేశ సుప్రీం లీడరన అయతొల్లా అలీ ఖమేనీ నేతృత్వంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతున్నాయి. అదే సమయంలో నిరసనలపై ఆ దేశం ఉక్కుపాదం మోపుతోంది. సైన్యం కాల్పుల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. తాజా సమాచారం ప్రకారం.. ఈ ఆందోళనల్లో మృతుల సంఖ్య 500 దాటింది. దాదాపు 530 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అమెరికాకు చెందిన మానవ హక్కుల సంఘం తెలిపింది. దాదాపు 490 మంది నిరసనకారులు కాగా, 48 మంది భద్రతా సిబ్బంది మరణించినట్లు సమాచారం. రెండు వారాల్లో దాదాపు 10,600 మందికిపైగా అరెస్టు అయినట్లు పేర్కొంది. ఇరాన్ దవాఖానాలు శవాల కుప్పలతో నిండిపోయినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. టెహ్రాన్ సహా దేశవ్యాప్తంగా దవాఖానాల్లో శవాలు ఒకదానిపై మరొకటి పడి ఉన్నాయని, రోగులతో వార్డులు కిటకిటలాడుతున్నాయని మెడికల్ వర్కర్లు తెలిపారు. మరోవైపు ఇరాన్‌లో తాజా పరిస్థితులపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఖమేనీ ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్‌పై సైనిక చర్య అవకాశాన్ని అమెరికా తీవ్రంగా పరిగణిస్తోంది. ఆందోళనకారులకు ఏమైనా జరిగితే తాము రంగంలోకి దిగుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదే పదే హెచ్చరిస్తున్నారు. దీంతో ఇరాన్ సైతం అమెరికాకు కీలక హెచ్చరికలు చేసింది. సైనిక చర్య బెదరింపులు చేస్తే అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటామని టెహ్రాన్ బెదరింపులకు పాల్పడింది.

## జమ్ముకాశ్మీర్‌లో మసీదులను జల్లెడపడుతున్న పోలీసులు


**శ్రీనగర్, జనవరి 12:** జమ్ముకాశ్మీర్ లో పోలీసులు మరో ఆపరేషన్ మొదలుపెట్టారు. తీవ్రవాదానికి అడ్డాగా మారిన ఈ ప్రాంతంలో మసీదుల్ని జల్లెడ పడుతున్నారు. ప్రతి మసీదుకు వెళ్లి, పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఇందుకోసం నాలుగు పేజీల ఫాంలు రెడీ చేశారు. మసీదుల్లో ఉండే ప్రతి ఒక్కరూ ఈ డాక్యుమెంట్ నింపాల్సి ఉంటుంది. మసీదు వివరాల కోసం 4 పేజీల డాక్యుమెంట్, వ్యక్తిగత వివరాల కోసం మూడు పేజీల మరో డాక్యుమెంట్ ఫిల్ చేయాల్సి ఉంటుంది. పోలీసులు ఇలాంటి ఆపరేషన్ చేపట్టడం ఇదే తొలిసారి. మసీదులు నిర్వహించే ఇమామ్‌ల దగ్గరి నుంచి ముయెజ్జిన్ , ఖతీబ్స్, బైట్ ఉల్ మాల్ వంటి వారి వివరాలు సేకరిస్తున్నారు. అంటే అక్కడ మసీదు పెద్దతోపాటు, ప్రార్థనలు చేయించే వారు, సేవా కార్యక్రమాలు చూసే వారితోపాటు అక్కడికి వచ్చే వారి సంఖ్య, వారి పేర్లు, ఇతర వివరాల్ని కూడా నమోదు చేసుకుంటున్నారు. ఈ డాక్యుమెంట్లలో మసీదు ఎప్పుడు కట్టారు, ఎన్ని ఫ్లోర్లు, వైశాల్యం, ఆదాయ వనరులు, నిధులు, ల్యాండ్ టైప్, బ్యాంకు వివరాలు, దాతల వివరాలు, ఖర్చులు అక్కడ సాగించే కార్యకలాపాలు, టైమింగ్స్



తోపాటు మసీదు నిర్వహించే వారు, ఇతర సిబ్బందికి సంబంధించిన పేర్లు, ఫోన్ నెంబర్లు, వారి బ్యాంక్ డీటైల్స్, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్, పాస్ పోర్ట్, వాడే మొబైల్ మోడల్, ఐఎంఈఐ నెంబర్లు, ఈ మెయిల్, ట్రావెల్ హిస్టరీ, బర్త్ డేట్, ఆదాయ వివరాలు, ఏటీఎం, క్రెడిట్, రేషన్ కార్డులు, మసీదుల విలువ, అనుమతులు వంటివన్నీ సేకరిస్తున్నారు. దీని ద్వారా ఇక్కడి అసాంఘిక, తీవ్రవాద కార్యకలాపాల్ని అడ్డుకోవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## సంక్షిప్తంగా..

### వెనిజులా తాత్కాలిక అధ్యక్షుడిని నేనే: ట్రంప్



**వాషింగ్టన్, జనవరి 12:** వెనిజులాకు తాత్కాలిక అధ్యక్షుడిని తానేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ప్రకటించుకున్నారు. తన సొంత సోషల్‌మీడియా ట్రూత్‌లో పెట్టిన పోస్టు ఇపుడు ప్రపంచ దేశాల్లో వైరల్ అవుతోంది. వికీపీడియాను పోలిన ఎడిటెడ్ ఫొటోను ఆయన పంచుకున్నారు. ఈ ఫొటోలో డొనాల్డ్ ట్రంప్ ను వెనిజులా యాక్టింగ్ ప్రెసిడెంట్ గా చూపించారు. ట్రంప్ ఫొటో కింద ఈ ఏడాది జనవరి నుంచి వెనిజులాకు తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినట్లుగా ఉంది. వెనెజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను అమెరికా బలగాలు బలవంతంగా అరెస్ట్ చేసి ఫ్లోరిడాకు తరలించిన విషయం తెలిసిందే. దీంతో వెనెజువెలా అధ్యక్ష బాధ్యతలను తాత్కాలికంగా ఆ దేశ ఉపాధ్యక్షురాలు డెల్సి రోడ్రిగ్జ్ చేపట్టారు. ఆమె 90 రోజుల పాటు అధికారంలో ఉంటారని వెనెజువెలా రక్షణమంత్రి వెల్లడించారు.

### హిందీని బలవంతంగా రుద్దితే తరిమికొడతాం: రాజ్‌థాకరే

**ముంబయి, జనవరి 12:** హిందీ మీ భాష కాదనే విషయాన్ని ఉత్తరప్రదేశ్, బీహార్ వలసదారులు గుర్తుంచుకోవాలి. నాకు భాషపై ద్వేషం లేదు కానీ, దానిని మాపై బలవంతంగా రుద్దాలని చూస్తే మాత్రం తరిమికొడతానని మహారాష్ట్ర నవ నిర్మాణసేన అధ్యక్షుడు రాజ్ థాకరే హెచ్చరించారు. ముంబై మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాజ్‌థాకరే ఘాటుగా స్పందించారు. దాదాపు 20 ఏళ్ల విరామం తర్వాత థాకరే సోదరులు (రాజ్, ఉద్ధవ్ థాకరే) ఒకే వేదికపైకి వచ్చి మరాఠీ అస్తిత్వ నినాదాన్ని వినిపించారు. జనవరి 15న జరగనున్న ఎన్నికలను మరాఠీ మనుషుల ఉనికి కోసం జరుగుతున్న చివరి పోరాటంcగా రాజ్ థాకరే అభివర్ణించారు. అన్ని వైపుల నుంచి జనం వచ్చి మహారాష్ట్ర ప్రయోజనాలను కొల్లగొడుతున్నారని, మన భాషను, భూమిని కాపాడుకోకపోతే జాతి కనుమరుగవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

### అల్‌ఫలా వర్సిటీ ఆస్తులు జప్తు!

**న్యూఢిల్లీ, జనవరి 12:** ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దర్యాప్తును వేగవంతంచేసారు. అల్ ఫలా యూనివర్సిటీకి చెందిన ఆస్తులను జప్తు చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సిద్ధమైంది. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు కేసుతో సంబంధం ఉన్న వ్యవహారంలో అల్ ఫలా విద్యా సంస్థల ఛైర్మన్ జావెద్ అహ్మద్ సిద్ధిఖీని గత నవంబరులో ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఉన్న ఈ యూనివర్సిటీ భవనాలు అక్రమ మార్గాల్లో వచ్చిన నిధులతోనే నిర్మించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద చర్యలు తీసుకునేందుకు ఈడీ రంగం సిద్ధం చేస్తోంది.

### ఎలాన్‌మస్క్ గ్రోక్‌పై రెండుదేశాల నిషేధం



జకార్తా, జనవరి 12: ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు ఎలాన్ మస్క్ కు చెందిన ఎఐ కంపెనీ అభివృద్ధి చేసిన ప్రసిద్ధ చాట్‌బాట్ గ్రోక్ ఎఐని ఉపయోగించి నకిలీ, అశ్లీల డీప్‌ఫేక్ చిత్రాలు సృష్టిస్తున్నారనే ఆరోపణలు రావడంతో ఇండోనేషియా, మలేషియా దేశాలు దీనిని తాత్కాలికంగా నిషేధించాయి. మహిళలు, పిల్లలను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి అభ్యంతరకరమైన కంటెంట్ తయారవుతోందని, ఇది డిజిటల్ ప్రపంచంలో కొత్త ముప్పుగా మారుతోందని ఆ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. భారత్ కూడా ఇటీవల ఇలాంటి అశ్లీల కంటెంట్ వ్యాప్తిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గ్రోక్ ఎఐని కొందరు దుర్వినియోగం చేసి, అనుమతి లేకుండా నకిలీ డీప్‌ఫేక్ చిత్రాలు, వీడియోలు తయారు చేస్తున్నారని మలేషియా కమ్యూనికేషన్స్ అండ్ మల్టీమీడియా కమిషన్ స్పష్టం చేసింది.

### బ్లింకిట్ డెలివరీ బాయ్‌గా ఎంపి రాఘవ్ చద్దా!



**న్యూఢిల్లీ, జనవరి 12:** ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపి రాఘవ్‌చద్దా డెలివరీ బాయ్ అవతారమెత్తారు. బ్లింకిట్ డెలివరీఏజెంట్ డ్రెస్ ధరించి వస్తువులు డెలివరీ చేస్తున్నారు. ఇందుకు ఇందుకు సంబంధించి వీడియోని రాఘవ్ చద్దా సోషల్ మీడియాలో పోస్టు చేశారు. బోర్డు రూమ్‌లకు దూరంగా, అట్టడుగు స్థాయిలో అంటూ వీడియాకి కాప్షన్ ఇచ్చారు. ప్రస్తుతం వీడియో వైరల్ అవుతోంది. కాగా, డెలివరీ భాగస్వాముల కష్టాలు, తక్కువ వేతనం, సామాజిక భద్రత, పని గంటలు వంటి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఆయన డెలివరీ బాయ్‌గా మారినట్లు తెలుస్తోంది.

## నేవీ మాజీ చీఫ్ అడ్మిరల్‌కు ఇసి నోటీసులు



**న్యూఢిల్లీ, జనవరి 12:** తన గుర్తింపు నిరూపించుకోవాలంటూ నేవీ మాజీ చీఫ్ అడ్మిరల్ అరుణ్ ప్రకాశ్‌కు ఈసీ నుంచి నోటీ సులు ఇచ్చిన వైనంపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చింది. నేవీ మాజీ చీఫ్ ఎన్యుమరేషన్ ఫామ్‌లో అనేక వివరాలు లేవని చెప్పింది. గోవాలో ఓటర్ల జాబితా సవరణ చేపడుతున్న సందర్భంగా సర్ అధికారులు మాజీ నేవీ చీఫ్ ఇంటికి వెళ్లారు. రిటైర్మెంట్ తర్వాత ప్రకాశ్ గోవాలో స్థిరపడ్డారు. అయితే సర్ కోసం ఆయన తన ఐడెంటిటీ చూపాలని ఈసీ అధికారులు కోరారు. 1971 ఇండోపాక్ వార్‌లో పనిచేశారని, వీర చక్ర అవార్డు గెలిచారని, ఆయనకు నోటీసులు ఇవ్వడం ఆందోళనకరంగా ఉన్నట్లు కొందరు సైనిక దళాల విరమణ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం దీనిపై ఈసీ క్లారిటీ ఇచ్చింది. కోర్టాలిం అసెంబ్లీ నియోజకవర్గంలో నేవీ మాజీ చీఫ్ అరుణ్ ప్రకాశ్ నుంచి పార్ట్ నెంబర్ 43కి చెందిన బూత్ లెవల్ ఆఫీసర్ సమాచారాన్ని సేకరించారని, అయితే ఎన్యుమరేషన్ దరఖాస్తులో అవసరమైన వివరాలు లేవని, గతంలో సర్ చేపట్టినప్పుడు కూడా ఆ వివరాలు లేవని, వాటిల్లో ఓటరు పేరు, ఎపిక్ నెంబర్, బంధువు పేరు, అసెంబ్లీ నియోజకవర్గ పేరు, నెంబర్, పార్ట్ నెంబర్, సీరియల్ నెంబర్ లేవని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ మెడోరా ఎర్మోమిల్లా డీకాస్టా తెలిపారు. కీలకమైన ఐడెంటిఫికేషన్ వివరాలు లేనందు వల్లే బీఎల్ఓ అప్లికేషన్ ఆటోమెటిక్‌గా అప్‌డేట్ కాలేదన్నారు.

## వెయ్యిమందికిపైగా ఆత్మాహుతి వీరులు సిద్ధం!

### భారత్‌పై దాడులకు వీరంతా రెడీ: మసూద్ అజహర్

**న్యూఢిల్లీ, జనవరి 12:** నిషేధిత ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజహర్‌దిగా చెబుతున్న ఓ కొత్త ఆడియో రికార్డింగ్ ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది. భారత్‌పై దాడులకు వేలాది మంది ఆత్మాహుతి దళ సభ్యులు సిద్ధంగా ఉన్నారంటూ అందులో చేసిన హెచ్చరికలు సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ ఆడియో క్లిప్ వైరల్ కావడంతో నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆడియో క్లిప్‌లో, వెయ్యి మందికి పైగా ఆత్మాహుతి బాంబర్లు ఏ క్షణంలోనైనా భారత్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగేందుకు సిద్ధంగా ఉన్నారని అజహర్ చెప్పినట్టుగా ఉంది. వీళ్లు ఒకరు, ఇద్దరు, వంద కాదు.. వెయ్యి మంది కూడా కాదు. అసలు సంఖ్య చెబితే ప్రపంచ మీడియాలో రేపు పెను సంచలనం అవుతుందని అందులో హెచ్చరించాడు. తమ యోధులు ప్రాపంచిక సుఖాల కోసం కాకుండా షహాదత్ (అమరత్వం) కోసం సిద్ధంగా ఉన్నారని కూడా ఆ వాయిస్ పేర్కొంది. అయితే, ఈ ఆడియో రికార్డింగ్ ఎప్పటిది, దీని ప్రామాణికత ఎంతవరకు నిజమనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. దీనిని స్వతంత్రంగా ధృవీకరించాల్సి ఉంది. ఐక్యరాజ్యసమితి ద్వారా అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించబడిన మసూద్ అజహర్, పాకిస్థాన్ గడ్డపై నుంచి భారత్‌పై విషం చిమ్ముతూ అనేక ఉగ్రదాడులకు కుట్ర పన్నిన విషయం తెలిసిందే. 2001 పార్లమెంట్ దాడి, 2008 ముంబై దాడులతో సహా పలు భారీ ఉగ్రవాద ఘటనలకు ఇతడే ప్రధాన సూత్రధారి. ఆపరేషన్ సిందూర్‌లో భారత



బలగాల చేతిలో భారీగా నష్టపోయిన తన సంస్థకు మళ్లీ ఊపు తేవడానికే అజహర్ ఈ బెదిరింపులకు దిగి ఉంటాడని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది కేవలం ప్రచారం కోసం చేస్తున్న ఓ ఉత్తుత్తి బెదిరింపుగానే వారు అభివర్ణిస్తున్నారు.

## అమెరికా నిర్బంధంలో భారతీయ నేవీ అధికారి.. వచ్చే నెలలో పెళ్లి

**వాషింగ్టన్, జనవరి 12:** రష్యా జెండాతో వెళ్తున్న వెనిజులా 'మ్యారినెలా' నౌకతోపాటు మరో నౌకను అమెరికా సీజ్ చేసిన విషయం తెలిసిందే. మ్యారినెలా పేరుతో ఉన్న నౌక సిబ్బందిలో ముగ్గురు భారతీయులు ఉన్నట్లు రష్యా మీడియా ఇప్పటికే వెల్లడించింది. వారు హిమాచల్‌ప్రదేశ్, కేరళ గోవాకు చెందిన వారు కాగా.. హిమాచల్‌ప్రదేశ్‌లోని పాలంపూర్‌కు చెందిన రక్షిత్ చౌహాన్ మర్చంట్ నేవీ ఆఫీసర్. వచ్చే నెల ఆయన వివాహం జరగాల్సి ఉంది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. చౌహాన్‌ను రష్యా సంస్థ తొలిసారి సముద్రంపై విధులకు పంపింది. అది కూడా వెనిజులాకు. ఈ నెల 7న చివరిసారి చౌహాన్‌తో మాట్లాడామని ఆయన కుటుంబం వెల్లడించింది. ఆ తర్వాత కొన్ని గంటలకే అమెరికా దళాలు నౌకను సీజ్ చేశాయి. 'మా కుమారుడు సురక్షితంగా తిరిగి వచ్చేలా చూడండి' అని రక్షిత్ తల్లి రీతాదేవి ప్రధాని మోడీని అభ్యర్థించారు. ఫిబ్రవరి 19న తన కొడుకు వివాహాన్ని నిశ్చయించామని చెప్పారు. 'రక్షిత్ 2025లో రష్యా సంస్థలో మర్చంట్ నేవీ ఆఫీసర్‌గా చేరాడు. కొన్ని రోజుల క్రితం చివరిసారి మాట్లాడినప్పుడు అంతా బాగానే ఉందన్నాడు. వెనిజులాలో అమెరికా మిలిటరీ చర్య కారణంగా వెంటనే ఆ దేశం నుంచి తిరిగి రావాలని రష్యా సంస్థ సూచించినట్లు చెప్పాడు. ఇంతలో తమ కుమారుడు ఉన్న షిప్ సీజ్



అయిందని ఈ నెల 10న మాకు తెలిసింది' అని చౌహాన్ తండ్రి వెల్లడించారు. ఈ పరిణామాలపై ఇప్పటికే విదేశాంగ శాఖ స్పందించింది. అందులో ఉన్న భారతీయుల వివరాలను నిర్ధారిస్తున్నట్లు చెప్పారు.



## బాసర శ్రీపంచమి ఉత్సవాలకు సిఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 12:** బాసర శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో జరగబోయే వసంత పంచమి(శ్రీ పంచమి) ఉత్సవాల 2026లో పాల్గొనాల్సిందిగా సిఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. మంత్రి కొండా సురేఖ,బాసర దేవస్థానం ఈవో,అర్చకులు సిఎంను కలిసి ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు శ్రీజ్ఞాన సరస్వతి దేవస్థానం వారు శ్రీ పంచమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు.

## ఎంపిటిసి, జడ్పీటిసితోపాటు మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలి

### జాతీయ బిసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి డిమాండ్

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** 'బిసిలకు మోసం చేస్తే సహించం.. 42 రిజర్వేషన్లపై మోనమెందుకు?' అంటూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి డా. అరుణ్‌బాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మున్సిపల్, కార్పొరేషన్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ప్రభుత్వం వేగంగా సన్నద్ధమవుతున్న వేళ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని పక్కన పెట్టడంపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్రఆగ్రహం వ్యక్తమవుతోందని ఆయన పేర్కొన్నారు. రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్తే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని, అవసరమైతే ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 140కిపైగా పట్టణ స్థానిక సంస్థలు (మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు) ఉండగా, వీటిలో బీసీల జనాభా కీలకంగా ఉంది. మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మేయర్లు, కార్పొరేటర్ల ఎన్నికల్లో 42 రిజర్వేషన్లు అమలు కాకపోతే పట్టణ బీసీలకూ తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎన్నికల ముందు స్పష్టత ఇవ్వాలి' ఎంపీటీసీ, జడ్పీటీసీతో పాటు మున్సిపల్ ఎన్నికలకు ముందే 42 రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డా. అరుణ్‌బాబు డిమాండ్ చేశారు. అవసరమైన చట్టపరమైన చర్యలు, ఆర్డినెన్స్ లేదా అసెంబ్లీ తీర్మానం ద్వారా రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.



మాజీ ముఖ్యమంత్రి రోశయ్య సతీమణి శివలక్ష్మి భౌతికదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

## మాజీ సిఎం స్వర్గీయ రోశయ్య సతీమణి శివలక్ష్మి కన్నుమూత

### దేవరయాంజాలలోని వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు

### నివాళులర్పించిన పలువురు నేతలు

**శామీర్‌పేట,(మేడ్చల్ జిల్లా ప్రతినిధి), జనవరి 12, ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య సతీమణి శివలక్ష్మి(86) కన్నుముశారు. సోమవారం ఉదయం 5గంటల సమయంలో నగరంలోని వారి నివాసంలో శివలక్ష్మి తుదిశ్వాస విడిచినట్లు సంబంధితులు పేర్కొన్నారు. వయోధిక భారంతోపాటు, కొన్నాళ్ల నుంచి అనారోగ్యంతో ఉంటూ ఆమె నివాసంలో తుది శ్వాస విడిచినట్లు తెలిపారు. నగరంలోని ఆమె నివాసం నుంచి సోమవారం మధ్యాహ్నం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం దేవరయాంజాల్ లోని వారి వ్యవసాయ క్షేత్రంకు ఆమె పార్థీవదేహాన్ని తీసుకవచ్చి సాంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ దహన సంస్కారాలను ఆమె కుమా రులు కొణిజేటి శివ సుబ్బారావు, కొనిజేటి కృష్ణప్రసాద్, కొణిజేటి మూర్తిలు నిర్వ హించారు. శివలక్ష్మి మరణ వార్త తెలుసుకున్న పలువురు రాజకీయ నాయకులు, సామాజిక ప్రముఖులు వారి నివాసంకు చేరుకుని పార్థీవదేహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగ దేవరయాంజాల్‌లో జరిగిన అంత్యక్రియల కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యులు కె.వి.పి. రాంచందర్‌రావు, బిజెపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కొంపల్లి మోహన్‌రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, జిల్లా ఆర్టీఎ మెంబర్ భీమిడి జైపాల్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు కత్తి రమేశ్, పలువురు పాల్గొని పార్థీవ దేహానికి నివాళులు అర్పించారు. పలువురు శివలక్ష్మి సేవాభావాన్ని, ఆమె జీవన శైలిని పలువురు గుర్తు చేసుకున్నారు. ఆమె మృతిపట్ల ప్రగాఢ సంతాపంను, దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు పలువురు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆమె ప్రజాజీవితానికి దూరంగా ఉంటూనే, తన భర్త కొణిజేటి రోశయ్య రాజకీయ జీవితంలో వెన్నుదన్నుగా నిలిచారని పలువురు స్మరించుకున్నారు.

# జైళ్ల శాఖలో మరిన్ని సంస్కరణలు

### ఖైదీలకు ఉచిత న్యాయ సలహా

### వారికి గంజాయి, మద్యం సరఫరా అవాస్తవం, అసాంఘిక కార్యకలాపాలు లేవు

### జైళ్ల శాఖ డిజి సౌమ్యామిశ్రా

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్ర జైళ్ల శాఖలో మరిన్ని సంస్కరణలను అమలు చేసామని డిజి సౌమ్య మిశ్రా అన్నారు. ఇందులో భాగంగా జైళ్లలో వుండే ఖైదీలకు ఉచిత న్యాయ సలహా అందిస్తున్నామని ఆమె తెలిపారు. చంచల్‌గూడ జైలు ప్రధాన కార్యాలయంలో సోమవారం జైళ్ల శాఖ 2025 ఏడాది వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024తో పోలిస్తే 2025లో తెలంగాణ జైళ్లలో ఖైదీల సంఖ్య 11.8 శాతం పెరిగిందని తెలిపారు. ఇందుకు అనేక కారణాలు వున్నాయని ఆమె అన్నారు. జైళ్లలో ఖైదీలు పెరిగినపుడు బ్యారక్‌లలో సమస్యలు రాకుండా ఖాళీగా వున్న ఇతర జైళ్లలో కొందరు ఖైదీలను బదిలీ చేసామని ఆమె వెల్లడించారు. ఇరుకు బ్యారక్‌లలో ఖైదీలను వుంచేందుకు జైలు మాన్యువల్ అనుమతిం చదని ఆమె అన్నారు. జైళ్లలో ఉండే ఖైదీల్లో రిమాండు ఖైదీలతో పాటు శిక్షపడ్డవారు కూడా ఉంటారని, ఎవరి కేట గిరి మేరకు వారిని ఒక్కోచోట ఉంచడం, రౌడీలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి అరెస్టయిన వారిని పరిస్థి తుల ఆధారంగా వేర్వేరు జైళ్లకు మారుస్తామని ఆమె తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జైళ్లలో 42,566 మంది ఖైదీలు ఉన్నారని, 2024లో ఈ సంఖ్య 38,079గా ఉండేదని సౌమ్య మిశ్రా తెలిపారు. ప్రస్తుతమున్న ఖైదీల్లో అండర్ ట్రయల్ ఖైదీలు అత్యధికంగా 36,627 మంది ఉన్నారని, వీరి తరువాత హత్య కేసుల్లో వున్న వారు 3,260 మంది, డ్రగ్స్ కేసుల వారు 7,040, పోక్సో వారు 4,176, సైబర్ నేరాల్లో వున్న వారు 1784 మంది, డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారు 2833 మంది, ఆస్తుల గొడవల్లో వున్నవారు 7792 మంది, మహిళలపై నేరాలకు పాల్పడిన వారు 3,478 మంది, శిక్షలు పడ్డ ఖైదీలు 5856 మంది వుండగా మావోయిస్టు ఖైదీలు 40 మంది, 74 మంది విదేశీ ఖైదీలు వున్నారని జైళ్ల శాఖ డిజి తెలిపారు. డ్రగ్స్ కేసులు, పోక్సో కేసులతో పాటు, సైబర్ నేరాలు, డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో నిందితులుగా వుంటూ జైళ్లకు వస్తున్న వారి సంఖ్య ఇటీవల కాలంలో పెరిగిందని ఆమె వెల్లడించారు. ఇదే సమయంలో ఉగ్రవాదులు, తీవ్రవాదులు, పిడి కేసుల్లో నిందితుల సంఖ్య తగ్గిందని ఆమె అ న్నారు. జైళ్లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం వాటిని పర్యవేక్షిస్తున్నామని, జైళ్ల నుంచి ఖైదీలు పారిపోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. ఖైదీలను వారి కుటుంబీకులు కలిసేందుకు ఈ ములాఖత్‌లను ఏర్పాటు చేయగా ఇది విజయవంతంగా అమలవుతు ందని ఆమె తెలిపారు. జైళ్లలో వుండే బీద ఖైదీలు బెయిల్ పొందేందుకు సహకరించామని, వారికి ఉచిత న్యాయ సలహా అందిస్తున్నామని డిజి సౌ మ్యా మిశ్రా తెలిపారు. ఖైదీలకు నిబంధనల మేరకు పెరోల్ ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. శిక్ష పడ్డ ఖైదీలు తమ కుటుంబాలను ఆదుకునేందుకు రుణ సౌకర్యం కల్పించామని, ఈ రుణాలను ఖైదీలకు లభించే వేతనాల నుంచి మినహాయించుకుంటామని ఆమె వెల్లడించారు. స్కిల్ డెవలప్ కింద ఖైదీలకు పలు పథకాల కింద శిక్షణ ఇచ్చామని, వారంతా వృత్తి నైపుణ్యంలో తర్ఫీదు పొందారని ఆమె చెప్పారు. జైళ్లలో ఖైదీలు నిర్వహిస్తున్న పరిశ్రమలు బాగానే పనిచేస్తున్నాయని సౌమ్యా మిశ్రా అన్నారు. నిరక్షరాస్యులైన ఖైదీలో 23,220 మంది ఖైదీలను అక్షరాస్యులను చేశామని ఆమె తెలిపారు. జైళ్ల శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు ఖైదీల పునరావాసం కోసం ఉన్నాయని, ఇవి లాభాపేక్షతో ఏర్పాటైనవి కావని ఆమె వెల్లడించారు. జైళ్లలో గంజాయి, మద్యం సరఫరా జరుగుతుందని నేడి అవాస్తవమని, అసాంఘిక కార్యకలాపాలు కూడా నిజం కాదని ఆమె పేర్కొన్నారు. జైళ్ల శాఖలో మౌలిక వసతులను మరింత పెంచడంతోపాటు జైలు స్థలాలు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. ఖైదీల ఆరోగ్యం కోసం మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని, సిబ్బంది పనితీరును మరింత మెరుగుపరచేందుకు అన్నిచోట్ల సిసి కెమెరాలను ఏర్పాటుచేసి వాటిని చంచల్‌గూడలోని జైల్ భవన్‌లోని కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షిస్తున్నామని సౌమ్యామిశ్రా తెలిపారు. ఈ సమావేశంలో జైళ్ల శాఖ ఐజి రాజేష్, డిఐజిలు శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



సోమవారం చంచల్‌గూడ జైలు ప్రధాన కార్యాలయంలో జైళ్ల శాఖ 2025 ఏడాది వార్షిక నివేదికను విడుదల చేస్తున్న డిజి సౌమ్య మిశ్రా



## పిజెఆర్ జయంతి వేడుకల్లో సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 12, ప్రభాతవార్త:** దివంగత పీజేఆర్ 78వ జయంతి వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఖైరతాబాద్ కూడలిలోని పీజేఆర్ విగ్రహం వద్ద ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్, పీజేఆర్ కుమార్తె పి. విజయారెడ్డి ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఆమె ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఖైరతాబాద్ కూడలిలో నిర్వహించిన జయంతి వేడుకల్లో సీఎంతోపాటు మంత్రి దామోదర రాజనర్సింహ, రాజ్యసభ సభ్యులు అనీల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు రాజ్‌ఠాకూర్, నవీన్‌యాదవ్‌లు పాల్గొని పీజేఆర్‌కు నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయారెడ్డి పతంగులను పంపిణీ చేశారు. కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఖైరతాబాద్ డివిజన్ లైబ్రరీ సర్కిల్‌లోని పీజేఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకల్లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ప్రారంభించారు. ఖైరతాబాద్ డివిజన్ జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6వ పీజేఆర్ స్మారక క్రికెట్ పోటీలను బల్మూరి వెంకట్ ప్రారంభించారు. వెంకటేశ్వరగనర్ డివిజన్‌లో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు విజయారెడ్డి బహుమ తులను అందించారు. బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ధన్‌రాజ్ రాథోడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో విజయారెడ్డి పాల్గొన్నారు.

పిజెఆర్ విగ్రహం వద్ద సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ, రోహిణ్‌రెడ్డి, విజయారెడ్డి, నవీన్‌యాదవ్, అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు.

## మహిళా ఐఎఎస్ అధికారిపై అసత్య ప్రచారం

### ఛానళ్లు, యూట్యూబ్‌లు, వెబ్‌సైట్లపై కేసు నమోదు

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఓ మహిళా ఐఎఎస్ అధికారిపై ఐదు రోజుల క్రితం కొన్ని ఛానళ్లతోపాటు యూట్యూబ్‌లు, వెబ్‌సైట్లలో వచ్చిన అసత్య ప్రచారంపై ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల సంఘం ఫిర్యాదు మేరకు సిసిఎస్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఐఎఎ స్ అధికారుల సంఘం కార్యదర్శి జయేష్ రంజన్ చేసిన ఫిర్యాదు మేరకు (ఎఫ్ఐఆర్ 07/2026) ఈ కేసు నమోదయ్యింది. మహిళా ఐఎఎస్ అధికారిపై నిందారోపణలు రావడం రాష్ట్రంలో సంచలనం రేపడం తెలిసిందే. దీనిని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబులతోపాటు అందరు ఖండించడం విదితమే. సోషల్ మీడియా, వెబ్ సైట్లలోనూ ఈ వార్త ప్రసారం కావడంతో ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల సంఘం తీవ్రంగా పరిగణించి హోం శాఖను సంప్రదించి, అనంతరం సిసిఎస్‌లో ఫిర్యాదు చేశాయి. ఈ ఫిర్యాదు మేరకు భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 75, 78, 79 (వేధింపులు, మహిళల గౌరవానికి భంగం కలిగించడం), 351 (1), 352 (2) (శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా అవమానించడం) కింద కేసు నమోదు చేశారు. నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ ఈ కేసును స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిసింది.




14వ ఐద్వా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి

## మహిళా సాధికారతతోనే ప్రజాస్వామ్యం పటిష్టం

### ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జనవరి 12, ప్రభాతవార్త :** మహిళా సాధికారతతోనే ప్రజాస్వామ్యం పటిష్టమవుతుందని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్. పుణ్యవతి తెలిపారు. మహిళల హక్కుల కోసం పోరాటాలకు తలొగ్గి అనేక చట్టాలు వచ్చినప్పటికీ ఆచరణలో మాత్రం అవి అమలుకావడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల సాధన, ఉన్న చట్టాల అమలుకోసం ఐద్వా నినదిస్తూనే ఉందన్నారు. తమ పోరాటంలో సమాజం కలిసి రావాలని ఆమె పిలుపునిచ్చారు. సోమవారం సోమాజీగూడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.అరుణజ్యోతి, మల్లు లక్షి ్మ, సహాయ కార్యదర్శులు బుగ్గవీటి సరళ, కె. ఎన్. ఆశాలతలతో కలిసి 14 ఐద్వా అఖిల భారత మహాసభల పోస్టర్ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుణ్యవతి మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న ప్రతి సమ స్యపై ఐద్వా పోరాడిందని గుర్తుచేశారు. మల్లు లక్షి ్మ మాట్లాడుతూ ఈ నెల 25న హైదరాబాద్‌లో వేలాది మందితో ప్రదర్శన నిర్వహించి బస్‌భవన్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు.

## ఇంటర్ పరీక్ష ఇన్విజిలేటర్లకు ఎఫ్ఆర్ఎస్ అమలు!

### వాల్యుయేషన్‌లోనూ అమలు చేయనున్న ఇంటర్ బోర్డు

### వార్షిక పరీక్షలకు 1,495 కేంద్రాలు ఏర్పాటు

### ప్రాక్టికల్ పరీక్షలకు 1,924 కేంద్రాలు

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ యేడాది ఫిబ్రవరి 25 నుంచి జరగనున్న ఇంటర్మీ డియట్ వార్షిక పరీక్షల్లో ఇన్విజిలేటర్లకు ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్(ఎఫ్ఆర్ఎస్)ను అమలు చేయనున్నారు. ఇదే విధానాన్ని పరీక్షల అనంతరం నిర్వహించే ఇంటర్ మూల్యాంకనం (వాల్యుయేషన్)లోనూ అమలు చేయాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే ఇన్విజిలేటర్లతోపాటు చీఫ్ సూపరింటెండెంట్స్‌కు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్‌కి కూడా ఎఫ్ఆర్ఎస్‌ను అమలు చేయాలని నిర్ణయించారు. అలాగే ఫిబ్రవరి 1 నుంచి జరగనున్న ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యే ఇన్విజిలేటర్లకు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్‌కి కూడా ఎఫ్ఆర్ఎస్‌ను అమలు చేయనున్నారు. ఎఫ్ఆర్ఎస్‌ను ప్రస్తుతానికి పరీక్షల సిబ్బందికి మాత్రమే అమలు చేయనున్నారు. వచ్చే విద్యా సంవత్సరం 2026-27 సంవత్సరంలో విద్యార్థులకు కూడా అమలు చేసే యోచనలో ఇంటర్ బోర్డు అధికారులున్నారు. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల రిస్ట్‌వాచ్‌లపై నిషేదం విధించనున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల్లో గోడ గడియారాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలోనూ ఒక గోడ గడియారం అందుబాటులో ఉంచేలా ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటున్నారు. ఇంటర్ వార్షిక పరీక్షలకు ఈ ఏడాది 50,984 మంది విద్యార్థులు దూరంకానున్నారు. వారంతా ఇప్పటి వరకు పరీక్ష ఫీజు చెల్లించ లేదు. పరీక్ష ఫీజు చెల్లింపు గడువు ముగిసినందున.. వారు వార్షిక పరీక్షలకు హాజరయ్యే అవకాశం లేదు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ కలిపి మొత్తం 10,47,815 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. వారిలో ఇప్పటి వరకు 9,96,831 విద్యార్థులు మాత్రమే పరీక్ష ఫీజు చెల్లించారు. దీంతో పరీక్ష ఫీజు చెల్లించని 50,984 మంది పరీక్షలకు హాజరయ్యే అవకాశం లేదు. రాష్ట్రంలో ఫిబ్రవరి 25 నుంచి జరగనున్న వార్షిక పరీక్షలకు 1,495 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఫిబ్రవరి 2 నుంచి ప్రారంభం కానున్న ప్రాక్టికల్ పరీక్షలకు 1,924 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో జనరల్ విద్యార్థులకు 1,410 కేంద్రాలను, ఒకేషనల్ విద్యార్థులకు 484కేంద్రాలను ఏర్పాటు చేశారు.



బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

## రైతులు అధైర్యపడొద్దు

### కాంగ్రెస్ కర్షకుల సర్కార్

### రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నంగునూర్,జనవరి 12,ప్రభాతవార్త :** రైతులు అధైర్యపడి ఆత్మహత్యలకు పాల్పడొద్దని రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం ఘణపూర్‌లో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రాజిరెడ్డి కుటుంబాన్ని సోమవారం ఆయన పరామర్శించి ఓదార్చారు. ఈసందర్భంగా బాధిత కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతు రాజి రెడ్డి ఆత్మహత్య విష యాన్ని పత్రికల ద్వారా చూడగానే కలత చెందాన న్నారు. రంగారెడ్డి జిల్లాలో ఎన్నో ప్రోగ్రాము లు ఉన్నప్పటికీ ఏ టైం అయినా వచ్చి రాజిరెడ్డి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో వచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ రైతుల సర్కార్ అని రైతులు దిగులు చెంది అధైర్యపడి ఆత్మహత్యలకు పాల్పడొద్దన్నారు. సిద్దిపేటనే కాదు రాష్ట్రంలో ఎక్కడైనా రైతులు ఇబ్బందులు ఉంటే ఆ ప్రాంత నాయకులు తన దృష్టికి తీసుకవస్తే తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. రాజిరెడ్డి కుటుంబాన్ని చూస్తే ఎంతో బాధగా ఉందన్నారు.రాజిరెడ్డి కుమారునికి ఉద్యోగం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అదే గ్రామానికి చెందిన గణపురం రాములు హార్ట్ ఎటాక్‌తో ఆ రోజే మృతి చెందాడు ఆ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయన వెంట పార్టీ నాయకులు దేవులపల్లి యాదగిరి తదితరులు ఉన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

## రంగారెడ్డి జిల్లాను హైదరాబాద్‌లో కలపొద్దు

### చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

### విలీన ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలి

### లేదంటే బిజెపి ఆధ్వర్యంలో ఉద్యమం

**హైదరాబాద్ (అత్తాపూర్), జనవరి 12, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాను హైదరాబాద్‌లో ఎట్టి పరిస్థితిలో కలపవద్దని, జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉందని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాను హైదరాబాద్ జిల్లాలో విలీనం చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనకు వ్యతిరేకంగా సోమవారం రంగారెడ్డి జిల్లా బిజెపి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పోన్నమోని మల్లేష్‌యాదవ్ అధ్యక్షతన ఆరాంఘర్ చౌరస్తాలో భారీ మహాధర్నా నిర్వహిం చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజుభూపాల్‌గౌడ్ హాజరై హైదరాబాద్ వద్దు.. రంగారెడ్డి ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్ మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాను హైదరాబాద్‌లో విలీనం చేయడం అనేది కేవలం పరిపాలనాపరమైన నిర్ణయం కాదు, దీని వెనుక పెద్దకుట్ర దాగి ఉందన్నారు. రంగారెడ్డి జిల్లా ప్రజల హక్కుల కోసం బిజెపి పోరాడు తుందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజుభూపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, జిల్లాలోని గ్రామీణ, అర్ధపట్టణ ప్రాంతాలను హైదరాబాద్‌లో కలిపి గందరగోళం సృష్టించాలని చూస్తోందని, ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ లిమిట్ పెంపు

### రూ.2,407 కోట్లకు పెంచిన రిజర్వ్ బ్యాంక్

### ఎక్కువ అడ్వాన్స్‌లపైనే ఖజానా ఆధారం

### ఆదాయ, వ్యయాల మధ్య అంతరం తగ్గించే యత్నం

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ ఖజానాకు వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ లిమిట్‌ను పెంచుతూ రిజర్వ్ బ్యాంకు కీలక నిర్ణయం తీసుకుంది. ఈమేరకు అదనంగా రూ.2,407 కోట్లకు పెంచుతూ రాష్ట్ర సర్కార్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆర్థిక శాఖ అధికారవర్గాల సమాచారం మేరకు స్వల్పకాలిక నగదు నిర్వహణలో ఇబ్బందులు పడుతున్న తెలంగాణ ప్రభుత్వానికి పెద్ద ఉపశమనం కల్పిస్తూ ఈ నెల 9వ తేదీ నుండి వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ (డబ్ల్యుఎంఎ), తాత్కాలిక రుణం పరిమితిని రూ.2,407 కోట్లకు పెంచింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు మొత్తం డబ్ల్యుఎంఎ పరిమితిని ఇప్పటికే ఉన్న రూ. 60,118 కోట్ల నుండి రూ. 61,008 కోట్లకు సవరించాలన్న ఆర్‌బిఐ నిర్ణయానికి అనుగుణంగా తెలంగాణ సర్కార్‌కు కూడా ఈ పెంపు జరిగింది. ఫలితంగా, తెలంగాణ యొక్క వ్యక్తిగత పరిమితిని ఇప్పటి వరకూ రూ.2,300 కోట్లు ఉండగా, దాన్ని తాజాగా రూ.2,407 కోట్లకు పెంచింది. దీనివల్ల ఆదాయాలు మరియు చెల్లింపుల మధ్య తాత్కాలిక వ్యత్యాసం ఉన్న సమయాల్లో తెలంగాణ ఖజానా నుండి తక్షణ ఖర్చుల అవసరాలను తీర్చగల సామర్థ్యం బలపడుతుంది.

ఈ వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ అనేది రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు స్వల్పకాలిక నగదు కొరతను అధిగమించడానికి ఆర్‌బిఐ తాత్కాలిక రుణాలుగా అందించే ఆర్థిక సాయం. ఈ అడ్వాన్స్‌లు నగదు రాబడి, ఖర్చుల మధ్య సమయ వ్యత్యాసాలను పూడ్చడానికి ఉద్దేశించబడ్డాయి. కానీ ఇవి దీర్ఘకాలిక ఆర్థిక సహాయ యంత్రాంగంగా ఉపయోగపడటానికి ఉద్దేశించినవి కావు. డబ్ల్యుఎంఏ కింద తీసుకున్న మొత్తాన్ని 90 రోజులలోపు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. దీనికి గాను వసూలు చేసే వడ్డీ ప్రస్తుత రెపో రేటుకు అనుగుణంగా ఉంటుంది. ఈ సౌకర్యం ప్రభుత్వాలు నగదు కొరత కారణంగా నిత్య వ్యయాలలో అంతరాయాలను నివారించి, అవసరమైన సేవల సజావుగా నిర్వహణను కొనసాగించడానికి వీలు కల్పించనుంది.

కాగా వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్‌లపై ఆధారపడటాన్ని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఇటీవల ఆందోళన వ్యక్తం చేసింది. ఆదాయం మరియు వ్యయం మధ్య స్వల్పకాలిక అంతరాలను పూడ్చడానికి రాష్ట్రం రిజర్వ్ బ్యాంక్ నుండి తీసుకునే అడ్వాన్స్‌లపై ఎక్కువగా ఆధారపడుతోందని పేర్కొంది. గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణ వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ రుణాలకు సంబంధించినలో పరిమితి గణనీయమైన వృద్ధిని సాధించింది. 2014లో ఈ పరిమితి రూ.550 కోట్లుగా ఉండగా, రాష్ట్ర ఆదాయ ప్రొఫైల్, మూలధన వ్యయం ఆధారంగా 2016లో దీనిని రూ.1,080 కోట్లకు రిజర్వ్ బ్యాంక్ పెంచింది. ఇది దాదాపు 96.4 శాతం పెరుగుదలను సూచిస్తుంది. 2020లో దీనిని మరింతగా రూ. 1,728 కోట్లకు, ఆ తర్వాత 2026లో ప్రస్తుత స్థాయి అయిన రూ. 2,407 కోట్లకు చేరుకుంది. ఈ స్థిరమైన పెరుగుదల రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాల విస్తరణను మరియు నగదు ప్రవాహ హెచ్చుతగ్గులను నిర్వహించడానికి ద్రవ్య మద్దతు అవసరం పెరుగుతున్న విషయాన్ని నొక్కి చెబుతుంది.



# 300 వీధి కుక్కలు 'హత్య'

## హనుమకొండ జిల్లా ఆరెపల్లిలో కుక్కల సామూహిక హననం

### ఇద్దరు గ్రామ కార్యదర్శులు, ఇద్దరు సర్పంచులపై కేసు నమోదు

**హన్మకొండ బ్యూరో, జనవరి 12, ప్రభాతవార్త:** కుక్కలను సామూహిక హత్యలకు గ్రామ సర్పంచులు, సెక్రటరీలు, కొందరు వ్యక్తులు బాధ్యులని ఆరోపణలతో జంతు సంరక్షణ చట్టాలను పూర్తిగా ఉల్లంఘించిన ఘోర నేరం క్రింద జంతు సంక్షేమ కార్యకర్త ఫర్హానా బ్నేగ, స్ట్రే అనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ జి ఓ) క్రూరత్వ నివారణ మేనేజర్ ఆదులాపురం గౌతమ్ శాయంపేట పోలీస్ స్టేషన్ ను సందర్శించి అధికారిక ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయబడింది.హన్మకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రం, ఆరెపల్లి గ్రామంలో కుక్కల బెడద వల్ల జనాలను కరుస్తున్నాయనే నేపం కారణంగా వీధి కుక్కలను జనవరి 6,7,8 తేది లలో గ్రామ కార్యదర్శులు,, సర్పంచ్ లు, సర్పంచ్ భర్త, ఉప సర్పంచ్ సామూహ్నికగా కుక్కలను చంపమని కిందరికి చెప్పడం తో వాటిని చప్పడం జరిగింది. ఈ వ్యవహారంలో మాజీ కేంద్ర మంత్రి జోక్యం చేసుకొని సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్ఇన్‌స్పెక్టర్‌లతో మాట్లాడి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం మృతిచెందిన జంతువులకు చట్ట ప్రకారం పోస్ట్‌మార్టం నిర్వహించడం కోసం ఆదేశించారని పిర్యాదు దారుడు ఆదులాపురం గౌతమ్ ఒక ప్రకటన విడుదల చేయారు. వీధి కుక్కల జనాభాను నియంత్రించడానికి ఏకైక శాస్త్రీయ, మానవీయ పరిష్కారం అనిమల్ బర్త్ కంట్రోల్ మాత్రమేనని స్పష్టం చేశారు.అనిమల్ బర్త్ కంట్రోల్ రూల్ 2023 అమలులో వైఫల్య స్థానిక సంస్థల నిరక్ష్యం వల్లనే వీధి కుక్కల సంఖ్య పెరిగిందని తెలిపారు.అందువల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా సామూహిక స్టెరిలైజేషన్ (వంధ్యకరణ) మరియు యాంటీ రేబిస్ టీకాల కార్యక్రమాలను ప్రారంభించాలి అని ఆయన కోరారు. చట్టవిరుద్ధ హత్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ పరిష్కారం కాదు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారించవచ్చని ఆయన హెచ్చరించారు.

# తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే జీతాల్లో కట్

## 10 నుంచి 15 శాతం కోత, బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు తీసుకొస్తా

## ట్రాన్స్‌జెండర్లకు మున్సిపాలిటీల్లో కోఆప్షన్ సభ్యులుగా నియామకం

## దివ్యాంగులను వివాహం చేసుకుంటే రూ.2 లక్షల ఆర్థిక సాయం

## బాల భరోసా, ప్రణామ్ డే కేర్ సెంటర్లను ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 12:** దివ్యాంగులను దివ్యాంగులు వివాహం చేసుకుంటే రూ. 2లక్షల ఆర్థిక సాయాన్ని అందజేస్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. దివ్యాంగులను ఇతరులు వివాహం చేసుకున్నా.. ఈ ఆర్థిక సాయాన్ని అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. క్రీడల్లో రాణించిన దివ్యాంగులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. సమాజంలో ఆత్మగౌరవంతో వారు నిలబడేలా తమ ప్రభుత్వం మానవీయ కోణంలో పని చేస్తోందని తెలిపారు. సోమవారం ప్రజా భవన్‌లో చిన్నారుల కోసం 'బాల భరోసా' పథకం, 'ప్రణామ్' వయోవృద్ధుల డే కేర్ సెంటర్లను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతులకు సహాయ ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఒక కుటుంబసభ్యుల్లా దివ్యాంగులకు భరోసా కల్పించేందుకు ఈ ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా రూ. 50కోట్లు కేటాయించిందని తెలిపారు. ప్రభుత్వం మీ కోసం ఉందని చెప్పడానికి ఈ కార్యక్రమం నిర్వహించామని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను ఉపయోగించుకుని జీవితంలో ఎదగాలని దివ్యాంగులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మన రాష్ట్రంలో దివ్యాంగులకు స్ఫూర్తి.. కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి అని ఆయన గుర్తు చేశారు. వైకల్యం అనే ఆలోచనను దరి చేరనీయకుండా.. ఉన్నత స్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తి జైపాల్ రెడ్డి అని ఆయన గుర్తు చేశారు. ఆత్మస్థైర్యంతో జీవితంలో ఎదగాలన్న లక్ష్యంతో బెస్ట్ పార్లమెంటేరియన్‌గా ఎదిగిన కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి దివ్యాంగులకు ఒక స్ఫూర్తి అని చెప్పారు. ప్రణామ్ కార్యక్రమం ద్వారా వృద్ధులను ఆదుకుంటామని స్పష్టం చేశారు. తల్లిదండ్రులను నిరక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో 10 నుంచి 15 శాతం కోత విధిస్తామని హెచ్చరించారు. అందుకోసం ఈ బడ్జెట్ సమావేశాల్లో బిల్లు సైతం తీసుకు వస్తామన్నారు. తల్లిదండ్రులను నిరక్ష్యం చేసే వారిని మనమే దారిలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. తల్లిదండ్రులపై బాధ్యత లేని వారికి సమాజంపై ఏం బాధ్యత ఉంటుందంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇక ట్రాన్స్ జెండర్స్ కు ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని చెప్పారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కోఆప్షన్ మెంబర్‌గా ఒక ట్రాన్స్ జెండర్‌ని కార్పొరేటర్‌గా నామినేట్ చేయాలని మంత్రులకు సూచిస్తున్నట్లు తెలిపారు. అలాగే మున్సిపాలిటీల్లో కోఆప్షన్ సభ్యులుగా నామినేట్ చేయాలని, తద్వారా వారి సమస్యలపై వారు మాట్లాడుకునే అవకాశం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో హెల్త్ పాలసీని తీసుకు రాబోతున్నామన్నారు. తెలంగాణ సమాజం.. సామాజిక న్యాయం, సమాన అవకాశాలను కోరుకుంటోంద న్నారు. అందుకే దేశంలో ఎక్కడా లేని విధంగా దాదాపు వందేళ్ల తర్వాత రాష్ట్రంలో కులగణన నిర్వహించామని చెప్పారు. తెలంగాణ ఒత్తిడికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన నిర్వహించేందుకు అంగీకరించిందని గుర్తు చేశారు.

తెలంగాణ కులగణన మోడల్‌ను దేశం అనుసరిస్తోందని సిఎం పేర్కొన్నారు. తమ ప్రజా ప్రభుత్వంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసి సమాన అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఒకప్పుడు సామాన్యులకు ప్రవేశం లేని ఈ ప్రజాభవన్‌లో ఇప్పుడు అందరికీ ప్రవేశం కల్పించామని తెలిపారు. ఈ ప్రభుత్వానికి ధర్మ గంట ఉందని.. ఎవరు ఏ సమస్యలు చెప్పినా విని పరిష్కరిస్తుందని వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా, పేదల సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందామంటూ ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగాల భర్తీలో దివ్యాంగులకు వారి కోటాను వారికి కేటాయిస్తున్నాం. క్రీడల్లో దివ్యాంగులను ప్రోత్సహించాలని పారాలింపిక్స్ లో విజయం సాధించిన అమ్మాయికి ఉద్యోగం ఇచ్చాం పోటీ ప్రపంచంలో తాము వెనకబడ్డామన్న ఆలోచన లేకుండా అన్ని రంగాల్లో దివ్యాంగులకు అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. వయోవృద్ధులకు ప్రభుత్వమే కుటుంబంగా మారి ప్రణామ్ పేరుతో డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికి నూటికి నూరు శాతం వైద్యం అందించాలన్నదే మా విధానం వచ్చే బడ్జెట్ సమావేశాల్లో హెల్త్ పాలసీని తీసుకు రాబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, సీతక్క, అడ్లూరు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సోమవారం ప్రజాభవన్‌లో 'బాల భరోసా' పథకం కింద ప్రత్యేక ప్రతిభావంతులకు సహాయ ఉపకరణాల ఉచిత పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, దామోదర రాజనర్సింహ తదితరులు

# స్కూల్ విద్యార్థులకు 22 వస్తువుల కిట్ అందజేతకు చర్యలు

## నాణ్యత విషయంలో రాజీపడొద్దు : అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి 12:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించనున్న 22 వస్తువులతో కూడిన కిట్ కు సంబంధించి నాణ్యత విషయంలో రాజీపడొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం ముఖ్యమంత్రి నివాసంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల విద్యార్థులకు అందించే వస్తువులకు సంబంధించి సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ పై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు కిట్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల విషయంలో ఖర్చుకు వెనకాడొద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడొద్దని తెలిపారు. యూనిఫామ్ తో పాటు 21 వస్తువులతో కూడిన కిట్ ను విద్యార్థులకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. స్కూల్ బెల్ట్, టై, షూస్, స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, ఇతర వస్తువులను అందించేందుకు అవసరమైన ప్రొక్యూర్మెంట్ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, స్పెషల్ సీఎస్ సబ్యసాచి ఘోష్, సిఎం సెక్రటరీ వేముల శ్రీనివాసులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# జోగులాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు సిఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 12:** అలంపూర్ శ్రీ జోగులాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. మంత్రి కొండా సురేఖ,ఆలయ ఈవో,అర్చక బృందం సిఎంను కలిసి ఈనెల 19 నుంచి 23 వరకు జరగనున్న శ్రీజోగులాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానం అందించారు.





# సిఎంచే అంతర్జాతీయ హాకీ ప్రపంచ కప్ క్వాలిఫయర్స్ పోస్టర్ విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 12:** అంతర్జాతీయ హాకీ ప్రపంచ కప్ క్వాలిఫయర్స్-2026 పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహా దారు జితేందర్‌రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# సిఎం రేవంత్‌రెడ్డితో జార్ఖండ్ ఆరోగ్య శాఖ మంత్రి ఇర్ఫాన్ అన్సారీ భేటీ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 12:** జార్కండ్ ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ ఇర్ఫాన్ అన్సారీ హైదరాబాద్ పర్యనటకు వచ్చారు. ఈ సందర్భంగా బిఆర్ అంబేద్కర్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

# మహిళాప్రీమియర్‌లీగ్‌లో ఆర్సీబి హవా!

## తొమ్మిది వికెట్ల తేడాతో యుపి వారియర్స్‌పై విజయం

**నవీముంబై, జనవరి 12:** మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు హవా కొనసాగిస్తోంది. ఆర్సీబీ మహిళలు ఏకపక్ష పోరులో యూపీ వారియర్స్ ను 9 వికెట్ల తేడాతో మట్టికరిపించారు. మ్యాచ్‌లో 47 బంతులు మిగిలి ఉండగానే ఆర్సీబి విక్టరీ నమోదుచేసింది. 143 పరుగుల ఛేదనలో ఓపెనర్లు గ్రేస్ హ్యారిస్(85) పవర్ ప్లేలోనే అర్ధ శతకంతో విరుచుకుపడింది. స్మృతి మంధాన(47 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను ముగించింది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా జట్టులోని గ్రేస్ హ్యారిస్ నిలిచింది. సమిష్టి వైఫల్యంతో యూపీ జట్టు వరుసగా రెండో ఓటమిని చవిచూసింది.రెండో సీజన్ విజేత ఆర్సీబీ ఛాంపియన్ ఆటతో రెండో విక్టరీ కొట్టింది. డీవై పాటిల్ మైదానంలో బౌలర్ల విజృంభణతో యూపీ వారియర్స్ ను తక్కువకే కట్టడి చేసిన బెంగళూరు మోస్తరు లక్ష్యాన్ని ఊదిపారేసింది. యూపీ నిర్దేశించిన 144 పరుగుల ఛేదనను ఆర్సీబీ ఓపెనర్లు దూకుడుగా ఆరంభించారు. పవర్ ప్లేలోనే గ్రేస్ హ్యారిస్(85) బౌండరీలతో విరుచుకుపడింది. కెప్టెన్ స్మృతి మంధాన(47 నాటౌట్) నిదానంగా ఆడితే హ్యారిస్ మాత్రం ధనాధన్ ఆటతో యూపీ వారియర్స్ బౌలర్లను వణికించింది. డియాండ్ర డాటిన్ ఓవర్లో రెచ్చిపోయిన హ్యారిస్ వరుసగా 6, 4, 6, 6 బాది అర్ధ శతకం పూర్తి చేసుకుంది. పవర్ ప్లేలోనే యాభై కొట్టిన నాలుగో ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పింది. ఆ తర్వాత ఈ ద్వయాన్ని విడదీసేందుకు యూపీ కెప్టెన్ లానింగ్ బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. ఎట్టకేలకు శిఖా పాండే ఓవర్లో హ్యారిస్ కవర్స్‌లో చిక్కడంతో 137 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత వచ్చిన రిచా ఘోష్(4 నాటౌట్)తో కలిసి మంధాన లాంఛనం పూర్తి చేసింది. టాస్ ఓడిన యూపీ వారియర్స్‌ను బెంబేలెత్తిస్తూ లారెన్ బెల్(1 13) వికెట్ల వేట మొదలెట్టింది. ఓపెనర్ హర్లిన్ డియల్‌ను వెనక్కి పంపి తొలి బ్రేకిచ్చింది . శ్రేయాంక పాటిల్ ఓవర్లో కెప్టెన్ మేగ్ లానింగ్(14) రాధా యాదవ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యింది. బౌండరీలతో ఆర్సీబీ బౌలర్లపై ఒత్తిడి పెంచాలనుకున్న డేంజరస్ ఫొబె లిచ్‌ఫీల్డ్(20)ను శ్రేయాంక డగౌట్ చేర్చింది. స్వల్ప వ్యవధిలో మూడు వికెట్లు పడడంతో కష్టాల్లో కూరుకుపోయిన యూపీని నదినే డీక్లెర్క్(22) మరింత దెబ్బతీసింది. తను ఒకే ఓవర్లో వరుసగా కిరణ్ నవగిరె(5), శ్వేతా షెహ్రావత్(0)లను వెనక్కి పంపింది. దాంతో50పరుగులకే యూపీ జట్టు సగం వికెట్లు కోల్పోయింది. 10 ఓవర్లకు స్కోర్ 56-5. పీకల్లోతు కష్టాల్లో పడిన జట్టును డియాండ్ర డాటిన్(40 నాటౌట్) దీప్తి శర్మ(45 నాటౌట్) ఆదుకున్నారు. ఆర్సీబీ బౌలర్లను దీటుగా ఎదర్కొన్న వీరిద్దరు అజేయంగా 93 రన్స్ జోడించారు.దీనితో యూపీ నిర్ణీత ఓవర్లలో 143 పరుగులు చేసింది.



# ఒక్క డిఏతో చేతులు దులుపుకుంటే సరిపోదు

## గత సర్కార్ కంటే ఎక్కువ ఫిట్‌మెంట్ ఇవ్వాలి

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య డిమాండ్

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు పెండింగ్‌లో ఉన్న 5 డిఏలను క్లియర్ చేస్తారని ఆశగా ఎదురుచూస్తుంటే.. ప్రభుత్వం కేవలం ఒక్క డిఏను మాత్రమే ప్రకటించి చేతులు దులుపుకుందని కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య విమర్శించారు. సర్కారు తీరుతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర నిరాశలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన డిఏల ఊసెత్తకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. పిఆర్‌సి మంజూరుపై సీఎం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పిఆర్‌సిని మంజూరు చేయాలని, పెండింగ్ డిఏలన్నింటినీ విడుదల చేయాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన డిఏ వాస్తవానికి గత నెలలోనే ఇవ్వాల్సి ఉందని, అంతకుముందు గత ఏడాది జూలైలోనే ఇస్తామని చెప్పారని ఎమ్మెల్సీ గుర్తుచేశారు. ఇప్పుడు ఒక డిఏ ఇచ్చినప్పటికీ.. రేపో మాపో కేంద్రం కొత్త డిఏ ప్రకటిస్తుందని దీంతో పెండింగ్ డిఏల సంఖ్య మళ్లీ ఐదుకు చేరుతుందన్నారు. ఉద్యోగులకు రూ. కోటి ప్రమాద బీమా ఇస్తామనడం మంచిదే అయినప్పటికీ.. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్, రిటైర్మెంట్ బెనిఫిట్ బిల్లులను వెంటనే చెల్లించాలని మల్క కొమరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈహెచ్‌ఎస్ విధివిధానాలపై సీఎం మౌనం వీడాలన్నారు. పిఆర్‌సి కమిటీ నివేదికను వెంటనే బహిర్గతం చేసి.. గత ప్రభుత్వం కంటే మెరుగైన ఫిట్‌మెంట్‌తో రెండో వేతన సవరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమది ప్రజా ప్రభుత్వం, ఎంప్లాయ్ ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అన్ని సౌకర్యాలు కల్పించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఇందిరమ్మ ఇళ్లు- రూ.12 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 12:** మున్సిపల్ ఎన్నిలకు ముందు ఓటర్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇంటి నిర్మాణపు పనులు చేపట్టి వివిధ కారణాల వల్ల బిల్లులు ఆగిపోయిన ఎల్3 కేటగిరీ లబ్ధిదారులకు తీపి కబురు చెప్పింది. సంబంధించిన బిల్లులను విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ల నుంచి నివేదికలు తెప్పించుకున్న అనంతరం అర్హులైన సుమారు 1,072 మంది లబ్దిదారులకు సంబంధించిన రూ. 12.17 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేసినట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం తెలిపారు.

# రాష్ట్రానికి 40 వేల సోలార్ యూనిట్లు

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** తెలంగాణకు 40 వేల ఉచిత సోలార్ యూనిట్లను మంజూరు చేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఒక్కొక్కటి 2 కిలోవాట్ల సామర్థం ఉన్న ఈ రూఫ్ టాప్ యూనిట్ల ద్వారా రాష్ట్రంలో 80వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

రాష్ట్రంలో సోలార్ రూఫ్ టాప్ లను తెలంగాణ స్టేట్ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ అమలు చేసే ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన పథకం కింద రాష్ట్రానికి ఈ ఉచిత సోలార్ రూఫ్ టాప్ లను మంజూరు చేస్తున్నట్లు కేంద్ర సంప్రదాయేతర ఇంధన వనరుల శాఖ వెల్లడించింది. తెలంగాణకు మొదటి దశలో 20 వేల యూనిట్లను ప్రస్తుతం అందచేయనున్నట్లు పేర్కొంది. మిగిలిన 20 వేల యూనిట్లను రెండో దశలో కేటాయించనున్నట్లు కేంద్ర సీనియర్ కార్యదర్శి తెలిపారు.

ఈ పథకం కింద వినియోగదారులు ఎటువంటి పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. సామూహికంగా సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసే విధానం (యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్)లో భాగంగా కేంద్రం ఈ యూనిట్లను అందిస్తోంది.

# సంక్షేమానికి ఎమర్జెన్సీ ఫండ్

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సాంఘిక, గిరిజన, వెనుకబడిన, మైనార్టీ సంక్షేమ గురుకులాల నిర్వహణకు ఆర్థిక తోడ్పాటును ఇవ్వాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఇందుకు ఎమర్జెన్సీ ఫండ్‌ను విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ఎస్సీ, బీసీ సొసైటీలకు చెందిన ఒక్కో గురుకులం నిర్వహణకు 20 కోట్ల రూపాయలు, ఎస్టీ, మైనారిటీ సొసైటీల్లోని ఒక్కో గురుకుల నిర్వహణకు 10 కోట్ల రూపాయలు చొప్పున నిధులను కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించినట్టు సంక్షేమ శాఖ అధికార వర్గాల ద్వారా తెలియవచ్చింది. ఆ నిధులతో గురుకులాలకు సంబంధించిన అద్దెలు, డైట్ బిల్లుల చెల్లింపులు, నిర్వహణకు వినియోగించేలా సొసైటీల సెక్రటరీలకే అధికారాలను కల్పించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.

# నీతి ఆయోగ్ సూచనలతో 'ఉపాధి హామీ'లో మార్పులు

## వంద రోజుల పనిదినాలను 125కు పెంచాం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 12:** వీబీ జీ రామీ ఉపాధి హామీ పథకం మీద కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. 'కొత్త చట్టంతో ఈ పథకంలో సాంకేతికత ఉపయోగించామన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడంతో పాటు వంద రోజుల పనిదినాలను 125కి పెంచామన్నారు. వ్యవసాయ సీజన్లో లో కూలీల కొరత లేకుండావ్యవసాయానికి అనుసంధానం చేస్తున్నానున్నారు. వ్యవసాయ సీజన్ లేనప్పుడు 125 పని దినాలు దొరికేలా చూస్తా అని పేర్కొన్నారు. సోమవారం ఆయన బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఈ పథకం ద్వారా రాష్ట్రాలకి అదనపు భారం పడుతుంది. అయితే, కేంద్రం కూడా అదనంగా ఖర్చు పెడుతుందని పేర్కొన్నారు. కూలీల పేరుతో నకిలీ జాబ్ కార్డులు తయారు చేసే దళారీ వ్యవస్థను నిర్మూలించడమే. ఈ చట్టం ఉద్దేశమ న్నారు.. నీతి ఆయోగ్ సూచనలతో కొత్త ఉపాధి హామీ పథకంలో మార్పులు చేశాం అని తెలిపారు. భాజపా గాలివాటంతో గెలుస్తుం దన్న కేటీఆర్ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. గాలివాటం అయితే దేశంలో మూడు సార్లు అధికారంలోకి ఎలా వచ్చామో చెప్పాలన్నారు.

మళ్లీ గెలిచి దేశంలో ప్రధానిగా మోదీ అధికారంలోకి వస్తారన్నారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు.

పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్ని కల్లో గెలిచి చూపించామన్నారు. హి జాబ్ ధరించే మహిళను ప్రధాని చేయాలని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యల పట్ల కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశకు వెళ్లి బొట్టు పెట్టుకునే హిందువును ప్రధాని చేయా లని ఓవైసీ అడుగుతారా అని ప్రశ్నించారు. పాకి స్థాన్‌లో హిందువులు లేకుండా చేశారని, బంగ్లా దేశ్‌లో హిందువులను హింసి స్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు.

దేశంలో హిం దువులు లేకుంటే ప్రజాస్వామ్యం ఉండదని, మతాల పేరు మీద రాజకీయాలు నడవవని ఓవైసి గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు.





# మున్సిపల్ ఎన్నికలు.. మొత్తం 51.92 లక్షల మంది ఓటర్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 12:** మున్సిపాలిటీల్లో తుది ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లలో మొత్తం 51,92,220 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 25,37,136 మంది పురుషులు, 26,54,453 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 631 మంది ఇతర ఓటర్లున్నట్లు తుది జాబితాలో వెల్లడించింది. కాగా. ఈనెల 17న మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది.

# సిపిఐ శతవసంతాల ముగింపు సభకు రండి

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలో జనవరి 18న జరిగే సిపిఐ శతవసంతాల ముగింపు సభకు రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఆ పార్టీ నేతలు ఆహ్వానించారు. పార్టీ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సోమవారం సీఎంని సచివాలయంలో కలిసి బహిరంగ సభకు రావాలని ఆహ్వానించారు. సిపిఐ నేతల ఆహ్వానం మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సభకు హాజరయ్యేందుకు సుముఖంగా ఉన్నారని పల్లా వెంకట్ రెడ్డి, నెల్లికంటి సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19న జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. అలాగే ఈనెల 20, 21న సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం, కార్యవర్గం, జాతీయ సమితి సమావేశాలను నిర్వహించనున్నారు. కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల సంబురాలను కాన్పూర్‌లో ప్రారంభించి.. ఏడాదిపాటు కొనసాగించిన వేడుకలను ఖమ్మంలో ముగింపు వేడుకలతో ముగించాలని పార్టీ నిర్ణయించింది. అందులో భాగంగానే ఖమ్మంలో ఈ నెల 18న భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నారు. ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హాజరవుతున్నట్టు సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రకటించిన సంగతి తెలిసిందే. బహిరంగ సభకు దేశంలోని వామపక్ష పార్టీల జాతీయ నాయకులు, 40 దేశాల కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు హాజరు కానున్నారు.

# రాష్ట్రంలో యువత పరిస్థితి దుర్భరంగా మారుతోంది: మాజీ సిఎం జగన్

**విజయవాడ,జనవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో యువత పరిస్థితి చాలా దుర్భరంగా మారుతుందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు.జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. స్వామి వివేకానంద ఆలోచనలను ఆయన ప్రస్తావిస్తూ... యువత ఏకాగ్రత, లక్ష్యంతో కృషి చేస్తే దేశం బలపడుతుందని వివేకానంద నమ్మారని వివరించారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో యువత మాత్రం ఆ ఆశయానికి భిన్నంగా ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులు చూస్తుంటే బాధగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 8 త్రైమాసికాలకు ఫీజు రీయింబర్స్ మెంట్లు చెల్లించలేదని, రూ.4,900 కోట్ల విద్యా దీవెన, రూ.2,200 కోట్ల వసతి దీవెన బకాయిలు పేరుకుపోయాయని జగన్ విమర్శించారు. మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన... నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి కూడా రెండు సంవత్సరాలుగా చెల్లించకుండా మోసం చేస్తున్నా రని మండిపడ్డారు.



# అంతర్రాష్ట్ర కార్ల దొంగల ముఠా అరెస్ట్

## - రూ. 1.25కోట్లు విలువ చేసే 5 కార్లు స్వాధీనం

**నెల్లూరు క్రైం, జనవరి 12, ప్రభాతవార్త:** సులభంగా నగదు సంపాదించాలని అత్యాశతో స్నేహితులే ముఠాగా ఏర్పడి పథకం ప్రకారం ఇతర రాష్ట్రాల్లో కార్లు దొంగతనాలకు పాల్పడుతూ, వాటిని తీసుకొని వచ్చి నెల్లూరు, చుట్టుప్రక్కల ప్రాంతాల్లో విక్రయిస్తున్న ముఠా గుట్టును రట్టు చేశారు నెల్లూరు దర్గామిట్ట పోలీసులు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆమె తెలిపిన సమాచారం మేరకు ఎస్పీ ఆదేశాల మేరకు దర్గామిట్ట సి.ఐ కళ్యాణ్ రాజు తన సిబ్బందితో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి, అన్నమయ్య సర్కిల్ వద్ద వాహనాల తనిఖీ సమయంలో అనుమానాస్పదంగా బీవీ నగర్ కు చెందిన తూపిలి శివ, ఆత్మకూరుకు చెందిన పరవస్తు లక్ష్మణ్ కుమార్ లను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. విచారణలో వారి వద్ద సుమారు రూ.కోటి 20 లక్షలు విలువ గల ఐదు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ముఠా నాయకుడు ఏ వన్ ముద్దాయి తన అనుచరులతో కలిసి ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో కార్లు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దొంగిలించిన కార్లను నెల్లూరు ప్రాంతానికి తీసుకువచ్చి తూపిలి శివ, పరవస్తు లక్ష్మణ్ కుమార్ సహాయంతో వారికి ఉన్న కారు షెడ్‌లో ఉంచుకొని, కార్ల నెంబర్ ప్లేట్లు మార్చి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన నెంబర్ ప్లేట్లు అమర్చి విక్రయాలు జరుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా కార్లకు సంబంధించి డూప్లికేట్ రికార్డుల జెరాక్స్ కాపీలను ఉపయోగించి, సాధారణ వాహనాలుగా చూపిస్తూ నెల్లూరు చుట్టుప్రక్కల ప్రాంతాల్లో అక్రమంగా అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు తేలింది. ఈ కేసుకు సంబంధించి పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ముఠా గుట్టురట్టు చేసిన దర్గామిట్ట పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా యస్.పి. ప్రత్యేకంగా అభినందించారు. కీలక ముద్దాయి మరొకరు తన అనుచరులతో కలిసి ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా ప్రాంతాల్లో కార్లు దొంగతనాలకు పాల్పడుతూ, కార్లను తీసుకొని వచ్చి తూపిలి శివ, పరవస్తు లక్ష్మణ్ కుమార్ సహాయంతో వారికి ఉన్న కారు షెడ్ లో ఉంచి, దొంగిలించిన కార్ల నెంబర్ ప్లేట్ లను మార్చి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా నెంబర్ ప్లేట్‌లు అమర్చి, డూప్లికేట్ రికార్డ్స్ జెరాక్స్ కాపీలతో నెల్లూరు చుట్టుప్రక్కల ప్రాంతాల్లో అమ్ముతున్నారు. ఈ విషయమై పక్కా సమాచారంతో ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్. సౌజన్య సూచనల మేరకు, నెల్లూరు టౌన్ ఇంచార్జ్ డిఎస్పీ ఎం.గిరిధర్ రావు ఆద్వర్యంలో దర్గామిట్ట సి.ఐ. బి.కళ్యాణ రాజు, యస్.ఐ. వి. బ్రహ్మయ్య, క్రైమ్ సిబ్బంది వేణు, మహేంద్ర, ఖాజా, శామ్యూల్‌లతో కలిసి అన్నమయ్య సర్కిల్ వద్ద ముద్దాయి లలో ఇద్దరిని అదుపులో తీసుకొని వారి రూ. కోటి 20 లక్షలు విలువ గల ఐదు కార్లను స్వాధీన పరుచుకున్నారు. నేరస్తులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన నెల్లూరు టౌన్ ఇంచార్జ్ డిఎస్పీని, ఇన్స్పెక్టర్ కళ్యాణ్ రాజుని, క్రైమ్ సిబ్బందిని, యస్.పి అభినందించారు.

# తిరుమల సమాచారం

## 15నుండి తిరుమల ఆలయంలో సుప్రభాతం పునఃప్రారంభం



**తిరుమల,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వం స్వామి ఆలయంలో ప్రతిరోజూ తెల్లవారు జామున 2.30గంటలకు దేవదేవుడిని నిద్ర నుండి మేల్కొలిపేందుకు వైఖానస ఆగమోక్తంగా నిర్వహించే సుప్రభాతసేవ తిరిగి ఈనెల 15వతేదీ గురువారం నుండి పున: ప్రారంభంకానుంది.ధనుర్మాసం ఘడియలు 14వతేదీతో అర్ధరాత్రితో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో 15వతేదీ సంక్రాంతిపర్వదినంనుండి ఏడుకొండలస్వామికి "కౌసల్యా సుప్రజారామా పూర్వాసంధ్యాప్రవర్తితే"అనే నామం వినిపించనుంది. ప్రతి ఏడాది డిసెంబర్ 16వతేదీ నుండి ధనుర్మాసం ఆరంభమైన తరువాత నెలరోజులపాటు వెంకన్న ఆలయంలో సుప్రభాతసేవ రద్దయి ఆ స్థానంలో గోదాదేవి తిరుప్పావై పాశురాలు పారాయణం జరుగుతుంది. జనవరి 14వ తేదీతో ధనుర్మాసం ముగిస్తే యధాప్రకారం ఏడాదంతా సుప్రభాతసేవతోనే స్వామివారిని మేల్కొలుపుతారు. ఈ సేవకు గృహస్థభక్తులను అనుమతినిస్తారు. కాగా 16వతేదీ శుక్రవారం తిరుమలలోని పార్వేటమండపంలో పార్వేట ఉత్సవం జరుగుతుంది. కనుమపండుగ రోజు శ్రీనివాసుడు వేటకు వెళ్ళడం పరిపాటి. ఈ సాంప్రదాయాన్ని తిరుమల ఆలయ అర్చకులు కొనసాగిస్తారు.

## ఏప్రిల్ నెల ఆర్జితసేవల టిక్కెట్లు ఆన్‌లైన్‌లో

### - 19న విడుదల చేయనున్న టిటిడి - 22న వర్చువల్ సేవా టిక్కెట్లు - 23న అంగప్రదక్షణ టోకెన్లు

**తిరుమల,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి రోజువారీగా,వారాంతపుసేవగా నిర్వహించే ఆర్జిత సేవాటిక్కెట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఆన్‌లైన్‌లో విడుదల చేస్తోంది. రానున్న ఏప్రిల్ నెలకు సంబంధించి ఈ సేవా టిక్కెట్లు ఆన్‌లైన్ లో డిప్ విధానంలో,కొన్నిసేవలు ముందువచ్చిన భక్తులకు ముందు అనే ప్రాతిపదికన ఆన్‌లైన్‌విధానంలో భక్తులు నేరుగా బుక్‌చేసుకునే సదుపాయం కల్పిస్తున్నారు. 19వతేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో ఆర్జితసేవా టిక్కెట్లు విడుదల చేస్తే 21వతేదీ ఉదయం 10గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు 21వతేదీ నుండి 23వతేదీ మధ్యాహ్నం 12గంటల లోపు లక్కీడిప్‌ద్వారా భక్తులు నగదు చెల్లించి టిక్కెట్లు అందుకోవచ్చు. వర్చువల్ సేవా టిక్కెట్లను 22న మధ్యాహ్నం 3గంటలకు విడుదలవుతాయి. 23వతేదీ అంగప్రదక్షణ టోకెన్లు ఉదయం 10గంటలకు, శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లు కోటా రోజుకు 1,300 లెక్కన ఉదయం 23న 11గంటలకు విడుదల చేస్తారు.

వృద్దులు దివ్యాంగులు దర్శన కోటా ఆగస్ట్ 23న మధ్యాహ్నం 3గంటలకు విడుదల చేస్తారు. 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్ల కోటా 24న ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. భక్తులు ఈ టిక్కెట్లను ఆన్‌లైన్‌లో టిటిదేవస్థానమ్స్.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లోమాత్రమే బుక్‌చేసుకోవాలని టిటిడి కోరింది.

## స్వామి దర్శనం మహదానందం

### - అందరికీ శుభాలు కలగాలి : ప్రముఖులు



**తిరుమల,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం మహదానందం కలిగించిందని, శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని వేడుకున్నట్లు పలువురు సినీప్రముఖులు తెలిపారు. 2026 నూతన సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో ఇష్టదైవమ్ వేంకటేశ్వరస్వామిని సినీనటుడు మంచు మోహన్‌బాబు దంపతులు, మంచు కుటుంబం, టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్, సినీరచయిత చంద్రబోస్, నటుడు అరుణ్‌విజయ్, నటి డింపుల్ హయతి వేర్వేరుగా ఆలయంలోనికిచేరుకుని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు,నూతన సంవత్సరం క్యాలండర్,డైరీలు అందజేశారు.

# ప్రజల సంక్షేమం కోసం షిర్డిసాయిని ప్రార్థించా..

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి లోకేష్, బ్రాహ్మణి



**విజయవాడ,జనవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** షిర్డీలోని సాయినాథుడ్ని మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి దర్శించుకున్నారు, సాయిబాబాకు నిర్వహించే కాగడ హారతి, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. మంత్రి లోకేశ్ దంపతులకు ఆలయ ట్రస్ట్ సభ్యులు, అధికారులు స్వాగతం పలికి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల సంక్షేమం, శ్రేయస్సు కోసం బాబాను ప్రార్థించినట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో సంక్రాంతి పండగ జరుగుతున్న నేపథ్యంలో ఆయన పౌరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సాయి బాబా సమాధిని దర్శనం చేసుకున్న తర్వాత, నారా లోకేశ్ దంపతులు ద్వారకామాయి వెళ్లి దర్శనం చేసుకున్నారు. ఈ క్రమంలోనే వారిద్దరూ సాయిబాబా గురుస్థానాన్ని కూడా దర్శించుకుని, గురుస్థాన్ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దర్శనం పూర్తి అయిన అనంతరం, సాయిబాబా సంస్థాన్ సీఈవో గోరక్ష్ గడిల్కర్ నారా లోకేశ్ కు శాలువా కప్పి సాయిబాబా విగ్రహాన్ని ఇచ్చి సత్కరించారు. హారతి అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు. మంత్రి లోకేశ్ వెంట ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు ఉన్నారు.ఈ క్రమంలో నారా లోకేశ్ సాయిబాబా సంస్థాన్ సీఈఓ గోరక్ష్ గడిల్కర్ తో భేటీలో పాల్గొన్నారు. దక్షిణ భారతదేశం నుంచి సాయిబాబా దర్శనం కోసం ప్రతిరోజూ ఎంత మంది భక్తులు శిర్డీకి వస్తారు? సాయిబాబా సంస్థ వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తుంది అనే పలు అంశాల గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ, తాను మొదటిసారి శిర్డీకి వచ్చానన్నారు. సాయిబాబా సమాధి దర్శనం చేసుకునే అదృష్టం తనకు కలిగిందని, ఉదయం

# స్వయంగా కార్గో బుకింగ్స్ చేసిన ఆర్టీసి విసి

## - సంస్థలోని అధికారులకు,జోన్ ఈడీలకు స్వయంగా ఆర్టీసి కార్గో ద్వారా పుస్తకాలు పంపించిన సంస్థ ఎండి ద్వారకా తిరుమలరావు

**సచివాలయం,జనవరి 12,ప్రభాతవార్త :** తక్కువ ఖర్చుతో,తక్కువ సమయంలో,అందరికీ అందుబాటులో కార్గో సేవలను అందిస్తూ ఏపిఎస్ఆర్టీసి అందరి మన్ననలు పొందుతోంది.డిసెంబర్ 20నుంచి జనవరి 19వ రకు కార్గో మాసోత్సవాలు జరుగుతున్నాయి.ఈ కార్గో ప్రచార మాసోత్సవాల్లో భాగంగా సోమవారం సంస్థ వైస్ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ ద్వారకా తిరుమలరావు స్వయంగా విజయవాడ కార్గో కార్యాలయానికి వెళ్ళి ఆర్టీసీ జిల్లా అధికారులకు,అన్ని జోన్ల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లకు తన వంతు బాధ్యతగా రుజుతా దివేకర్ రచించిన "డోన్ట్ లాస్ యువర్ మైండ్,లాస్ యువర్ వెయిట్" అనే పుస్తకాన్ని డోర్ డెలివరీ విధానంలో పంపించారు.ప్రచార మాసోత్సవాల్లో కార్గో వృద్ధికి ప్రతి ఆర్టీసి ఉద్యోగి తనవంతుగా కార్గో డోర్ డెలివరీ బుకింగ్స్ పెరిగేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.తన వంతు బాధ్యతగా డోర్ డెలివరీ కార్గో బుకింగ్స్‌ను చేయడం జరిగింది. ఆర్టీసీ ఎండి సిహెచ్ ద్వారకా తిరుమలరావు విజయవాడ పిఎన్‌బిలోని ఎరైవల్ బ్లాక్‌లో గల కార్గో కార్యాలయానికి చేరుకోగానే అక్కడి అధికారులైన జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ రత్నం,కార్గో అధికారులు ఎండి కి సాదర ఆహ్వానం పలికారు.అనంతరం నూతనంగా నిర్మించిన కార్గో కార్యాలయాన్ని ఆయన సందర్శించి ఆనందం వ్యక్తంచేశారు.స్వయంగా ఆర్టీసీ కార్గో ద్వారా పుస్తకాలు పంపించారు.కొరియర్ చార్జీలకు అయిన ఖర్చును స్వయంగా స్కాన్ చేశారు.అంతేకాకుండా ప్రతి ఒక్క అధికారికి పేరు పేరున ఈ పుస్తకం యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ,ఆహార విషయంలో ఫాలో అవ్వాల్సిన డైట్ గురించి,ఆరోగ్యం గురించి తీసుకోవలసిన జాగ్రత్తలను ఆకాంక్షిస్తూ,ఒక ఉత్తరం కూడా ఆయన జత చేశారు.ఈ పుస్తకం చదవడం వలన శారీరక దృఢత్వం మాత్రమే కాకుండా,ఆరోగ్యకరమైన శరీరం,భావోద్వేగ సమతుల్యత,అలాగే మన వ్యక్తిత్వ,వృత్తిపరమైన జీవితాల్లో సామర్ద్యం కూడా మెరుగుపడుతుంది.అధికారులకు పంపించిన ఈ పుస్తకాల ఖరీదుకి,కార్గో బుకింగ్స్ కోసం ఆయన స్వయంగా రూ.20,000లు ఖర్చు చేశారు.కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వి.రవివర్మ,కార్గో అధికారులు,బస్టేషన్ ఏటిఎం,డిసిటిఎం,విజయవాడ జోన్,ఎన్టీఆర్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు రాయలసీమలో పెట్టాలి

## - కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్




కుప్పంలో జాతీయ జెండాలు ప్రదర్శిస్తున్న కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

**కుప్పం, జనవరి 12 ప్రభాతవార్త** మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్యనాదెళ్ల దేశంలో పెట్టనున్న పది లక్షల కోట్ల పెట్టుబడులను తిరుపతి నగరం లేదా రాయలసీమ జిల్లాల్లో పెట్టాలని కేంద్రమాజీమంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కుప్పం ఆర్అండ్‌బి అతిథిగృహం వద్ద జాతీయ జెండాలను ప్రదర్శించారు. ఇటీవలే సత్య నాదెళ్ల ప్రధాని మోడీని కలిశారన్నారు. ఈపెట్టుబడులు ఎపిలోని రాయలసీమలో పెట్టేలా సిఎం చంద్రబాబునాయుడు కృషి చేయాలని పేర్కొన్నారు. సత్యనాదెళ్ల రాయలసీమ వాసేనని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం యుపిఎ హయాంలో తెచ్చిన గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని మార్చేస్తోందని విమర్శించారు. దేశ స్వాతంత్ర్యం కోసం అహింసా విధానంతో పోరాడిన గాంధీజీ పేరును కనుమరుగు చేయాలని చూడడం దారుణమన్నారు. కేంద్రం తెస్తున్న కొత్త విబి రామ్‌జీ చట్టం ద్వారా దేశంలోని నలభై కోట్ల మంది ఉపాధిహామీ కూలీలకు అన్యాయం జరుగుతుందన్నారు. గతంలో సుర్జిత్ సింగ్ బర్నాలా వంటి సీనియర్ల సూచనలతో సోనియా గాంధీ ఉపాధిహామీ చట్టాన్ని దేశంలో అమలు చేయించారన్నారు. గాంధీజీ పేరు మార్చరాదని సిఎం చంద్రబాబు కేంద్రానికి సూచించాలని పేర్కొన్నారు.

# సైబర్ ముఠాకు చిక్కిన 22 మంది.. ఎపి యువతను రక్షించిన సిఐడి




మీడియాతో మాట్లాడుతున్న సీఐడీ ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా

**విజయవాడ.జనవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లి సైబర్ మోసాల ముఠాకు చిక్కుకున్న ఏపీకి చెందిన 22మందిని సీఐడీ పోలీసులు రక్షించారు.ఈ అంశంపై సీఐడీ ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా మీడియాతో మాట్లాడుతూ సైబర్ శ్లావరీ స్లేవరీలో భాగంగా ఈస్ట్ ఆసియా దేశాలలో చిక్కుకున్న భారతీయులకు విముక్తి కలిగించామన్నారు. ఫ్రీ జాబ్ ఆఫర్స్ కోసం విదేశాలకు వెళ్లి సైబర్ క్రైమ్ కూపంలో ఇరుక్కుంటున్నారని.. బ్యాంకాక్, మయన్మార్, కంబోడియా వంటి దేశాలలో జాబ్ కోసం వెళ్లిన భారతదేశ యువకులు ఈ సైబర్ ముఠా ట్రాప్‌లో పడుతున్నారని తెలిపారు. కాల్ సెంటర్ల ద్వారా యువతను ఆకట్టుకునేలా మాటలు చెబుతున్నారని.. ఫ్లైట్ టిక్కెట్లు కూడా ఏర్పాటు చేసి, మంచి ఉద్యోగం ఇస్తామని నమ్మబలుకుతారని సీఐడీ ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా వెల్లడించారు. ఆయా దేశాల్లో 15 గంటల ప్రయాణం తర్వాత అటవీ ప్రాంతంలో ఉంచి.. సైబర్ క్రైమ్ లో భాగస్వామ్యులుగా చేస్తున్నారని అదిరాజ్ సింగ్ రాణా తెలిపారు. యువకుల పాస్‌పోర్టు, ఫోన్లు లాగేసుకుని.. అనేక విధాలుగా సైబర్ క్రైమ్ లు చేయిస్తున్నారని చెప్పారు. ఫోన్లు చేసి హనీ ట్రాప్‌లు చేసేలా వీరిని బలవంతంగా ఒప్పించి పని చేయిస్తారన్నారు. మాట వినకుంటే.. తిండి పెట్టకుండా.. ఇబ్బందులు పెడతారని.. బెదిరించి, చెప్పినట్లు మోసం చేస్తేనే వారికి తిండి పెడతారని ఆయన తెలిపారు. ఎవరైనా వెళ్లిపోతామంటే.. రూ.10లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. దీంతో ఏ దారి లేక చాలా మంది భారతీయ యువత ఈ తరహాలో మోసపోయి.. సైబర్ క్రైమ్ లకు పాల్పడుతున్నారని సీఐడీ ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా పేర్కొన్నారు. భారతదేశ ప్రభుత్వం ఈ తరహా మోసాలను గుర్తించి వారిని తీసుకు వచ్చేలా ఏర్పాట్లు చేసిందని సీఐడీ ఎస్పీ తెలిపారు. ఈ విధంగా తాజాగా 22మంది ఏపీకి చెందిన వారిని క్షేమంగా తీసుకురాగా, వారిని సీఐడీ విచారించిందని తెలిపారు. దేశవ్యాప్తంగా 1,586మంది ఇలా సైబర్ మోసాల బారిన పడిన వారిని మూడు నెలల్లో వెనక్కి తీసుకువచ్చారన్నారు. వీరిలో ఏపీకి చెందిన వారు 120 మంది ఉన్నారని తెలిపారు. వీరిలో పురుషులతోపాటు మహిళలు, యువత కూడా చాలా మంది ఉన్నారన్నారు. అక్కడ ఎలా మోసం జరుగుతుంది.. ఆకర్షితమైన ప్రకటనలు ఎలా ఉంటాయో వారు తెలిపారని చెప్పారు. భారతీయ రీజనల్ లాంగ్వేజ్ బాగా మాట్లాడే వారిని గుర్తించి మరీ ఈ మోసాల్లోకి దింపుతున్నారని చెప్పారని సీఐడీ ఎస్పీ తెలిపారు. ఉద్యోగ అవకాశాలు వచ్చినప్పుడు, పెద్ద జీతం చూపినప్పుడు పూర్తిగా వెరిఫై చేసుకున్నాకే ఆయా దేశాలకు వెళ్లాలని సూచించారు అదిరాజ్ సింగ్ రాణా. ఇటువంటి ఆఫర్లు వచ్చినప్పుడు పోలీసులకు సమాచారం ఇస్తే.. ఆ సంస్థ గురించి ఆరా తీసి వివరాలు ఇస్తారన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల గురించి ఆలోచన చేయాలని.. మంచి ఉద్యోగం, జీతం అనగానే అప్పులు చేసి పిల్లలను ఆయా దేశాలకు పంపవద్దని సూచించారు. డబ్బులతోపాటు, పిల్లల భవిష్యత్ కూడా నాశనం అవుతుందని హెచ్చరించారు. ఇటువంటి మోసాలపై మీడియా కూడా ప్రచారం చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని సీఐడీ ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా కోరారు. సోషల్ మీడియాలో ప్రకటనలు చూసి సంప్రదించాం. మంచి ఉద్యోగం ఇస్తామని చెప్పి ఫ్లైట్ టిక్కెట్లు వారే ఇచ్చారు. అక్కడకు వెళ్లిన తర్వాత మారు మూల ప్రాంతానికి తరలించారు. రెండు నెలలు వీసా ఇచ్చి.. వారి ఆధీనంలో ఉంచుకున్నారు. పాస్ పోర్టు, ఫోన్లు కూడా లాగేసుకుంటారు. వారు ఇచ్చే ఫోన్లనే ఆపరేట్ చేయాలి. ఫేక్ ఎకౌంట్లను క్రియేట్ చేసి వాటి ద్వారా ఆపరేటివ్ చేయిస్తారు. 500రీ టూ 1000రీ వరకు మాకు లక్ష్యాలు ఇచ్చి.. మాట్లాడిస్తారు. మయన్మార్‌లో గత రెండు నెలలుగా చాలా ఇబ్బందులు పడ్డాం. అసలు ఎవరితో అక్కడ మేము మాట్లాడే అవకాశం ఉండదు. వారికి స్పెషల్ ఆర్మీ ఉంటుంది.. చేతిలో గన్‌లు ఉంటాయి. ఏదైనా మాట్లాడితే .. చంపేస్తామని బెదిరిస్తారు. ఒక్కో గదిలో పది మంది సభ్యులకు షెల్టర్ ఇస్తారు. ఎవరైనా గట్టిగా ప్రశ్నిస్తే.. గదిలో బంధించి చిత్ర హింసలు పెడతారు.

# ఆసియా గేమ్స్ ..అంటే తెలియకపోవడం సిగ్గుచేటు!

## - మాజీమంత్రి రోజాపై శాప్స్‌చైర్మన్ రవినాయుడు మండిపాటు



**తిరుపతి,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** ఆసియా గేమ్స్ అంటే తెలియని రోజాను క్రీడాశాఖ మంత్రిగా చేసిన వైసిపి ప్రభుత్వం అవినీతిమయమైందని శాప్స్ చైర్మన్ ఎ.రవినాయుడు మండిపడ్డారు. గతంలో క్రీడల శాఖ మంత్రిగా పనిచేసిన ఆమెకు ఏషియా గేమ్స్ అంటే తెలియకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ రాష్ట్రానికి పట్టిన దరిద్రం రోజా, కొడాలి నాని, పేర్ని నాని అని, పోలీసులను కించపరిచేలా మాట్లాడటం రోజాకు తగదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. సోమవారం తిరుపతిలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఆంధ్రాకు పరిశ్రమలు వస్తే అడ్డుకుంటున్నారని, కేంద్ర నిధులను అడ్డుకోవడానికి వైసీపీ నేతలు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి లేఖలు రాస్తున్నారని రవినాయుడు విమర్శించారు. రాయలసీమ కోసం మాటల పోరాటం చేయడం కాదు, కడప స్టీల్ ప్లాంట్ కోసం పోరాటం చేయాలని జగన్ మోహన్ రెడ్డికి సవాల్ విసిరారు. మీ హయాంలో రాయలసీమకు ఏ పరిశ్రమ తెచ్చారో చెప్పాలని, అనంతపురానికి కియా పరిశ్రమ తీసుకొచ్చింది సీఎం చంద్రబాబునాయుడు అని గుర్తుచేశారు. ఐఐటీ, ఐసర్ తీసుకొచ్చామని, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నా చూసి తెలుసుకోలేకపోవడం మూర్ఖత్వమన్నారు. గత ఐదేళ్లు రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడ్డారని, జగన్ ప్రభుత్వంలో యువత గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే డిఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామన్నారు..తిరుమల శ్రీవారిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయడం మంచిదికాదన్నారు. గత ప్రభుత్వంలో టీటీడీ సొత్తును కాజేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రశ్నించిన విద్యార్థుల పైన అక్రమ కేసులు పెట్టారు..ప్రస్తుతం రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని, చూసి జగన్ ఓర్వలేకపోతున్నాడని రవినాయుడు పేర్కొన్నారు.

# వినియోగదారుల సమస్యల పరిష్కారంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయొద్దు

## -'డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి'లో శివశంకర్ లోతేటి

**తిరుపతి,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** వినియోగదారులు తమ సమస్యలను విన్నవిస్తే వాటిని పరిష్కరించడంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయరాదని, తక్షణం సమస్యలు పరిష్కరించేలా అధికారులు చూడాలని ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి స్పష్టం చేశారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు, విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్ల మార్పు, లోఓల్టేజ్ సమస్య, ట్రాన్స్ ఫార్మర్ల సామర్థం పెంపు, విద్యుత్ స్తంభాల మార్పు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వంటి సమస్యలను సంబంధిత అధికారులు తక్షణం పరిష్కరించి తనకు తెలియజేయాలన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం సోమవారం "డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి" కార్యక్రమం తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి 63సమస్యలు అందాయి. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన ఫోన్‌ద్వారా వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, సాధ్యాసాధ్యాలను పరిశీలించి, వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912, 1800 425 155333కు కాల్ చేసి తెలియజేయవచ్చని కోరారు. ఇంకా 91333 31912కు వాట్సాప్‌నంబర్‌కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్,ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ ,హెచ్‌ఆర్డి) కె. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు పి. హెచ్. జానకి రామ్, జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎన్. శోభావాలెంటీనా, కె. ఆది శేషయ్య, యం. మురళీ కుమార్, యం. కృష్ణా రెడ్డి, జనరల్ మేనేజర్లు రామచంద్ర రావు, వి. విజయన్, చక్రపాణి, సురేంద్రరావు, వెంకటరాజు, శ్రీకాంత్, భాస్కర్ రెడ్డి, జగదీష్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



# కాశీబుగ్గ వెంకటేశ్వరాలయంలో చోరీ

## అరకోటి విలువ చేసే బంగారం, వెండి, నగదు అపహరణ

**శ్రీకాకుళం, జనవరి 12 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర ఆలయం చిన్నతిరుపతిగా ప్రఖ్యాతిగాంచిన ఆలయంలో అరకోటి విలువ గల బంగారం, వెండి, నగదును ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత దుండగులు చోరీకి పాల్పడి ఆపహరించుకు పోయారు. పోలీసులు, ఆలయధర్మకర్త ముకుంధవండా కధనం ప్రకారం చిన్నతిరుపతిగా ప్రఖ్యాతిగాంచిన కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత దుండగులు వెనుక ద్వారం తాళం పగలగొట్టి లోపలకు చొరబడి సుమారు అరకోటి విలువ గల వెంకటేశ్వరస్వామి విగ్రహంపై ఉన్న 9 తులాల బంగారం, 11 కిలోల వెండి ఆభరణాలు అవహరించారు. అలాగే ఆలయంలో ఉన్న రెండు హుండీలలో భక్తులు వేసిన ఆభరణాలు, నగదును కూడా దోచుకువెళ్లారు. సి.సి. టివీ డివిఆర్‌లకు సైతం లూటీ చేశారు. ఫిర్యాదు అందుకున్న కాశీబుగ్గ డి.ఎస్.పి షేక్ సహబాజ్ అహ్మద్, సి.ఐ. వై.రామక్రిష్ణ, కాశీబుగ్గ ఎస్.ఐ నరసింహామూర్తి, క్లూస్ టీంలు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టి, వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. గత ఏడాది నవంబర్ 1 బీష్మ ఏకాదశి రోజున జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది భక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. మరికొన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి భక్తులు స్వామి వారిని దర్శించు కునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ధర్మకర్తకు పోలీసులు, దేవాదాయశాఖ అధికారుల సూచనలు మేరకు ఆలయంలో క్యూ లైన్ ఏర్పాట్లు పూర్తి చేశారు.

## సెలవు దినాల్లో విధులు నిర్వహించలేం

### - విఆర్ఓ అసోసియేషన్

విజయవాడ, జనవరి 12, ప్రభాతవార్త: తమ సమస్యలు పరిష్కరించేంత వరకు ఉదయం 10 నుండి సాయంత్రం 5 వరకు మాత్రమే పనిచేస్తామని, సెలవు, పండుగ దినాల్లో పనిచేయమని

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు వెల్లడించారు. రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ తమ సమస్యలపై గత నెల 24న చర్చించి పరిష్కరించమని ఆదేశాలిచ్చినప్పటికి ఇప్పటివరకు ఎటువంటి చర్చ జరపలేదన్నారు.

# దేశ రక్షణ కోసం శాస్త్రవేత్తనై..



సరిహద్దుల్లో తుపాకీ పట్టాలన్నా, యుద్ధ విమానం నడపాలన్నా 'ఆమె'కు ప్రవేశం లేని రోజులవి. అయినా ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయి అందులో చేరాలని కలలు కన్నారు. కాలం తనకి యూనిఫామ్ వేసుకునే అవకాశం ఇవ్వలేదు. కానీ, యూనిఫామ్ వేసుకున్న సైనికుడికి ఆయుధాన్ని అందించే స్థాయికి చేర్చింది. ఆమె డీఆర్డీవో డైరెక్టర్ జనరల్ (పీసీ అండ్ ఎస్ఐ) చంద్రిక కౌశిక్. ఆమె గూర్చి తెలుసుకుదాం..

నాకు చిన్నప్పటి నుంచి ఆర్మీలో చేరాలని, దేశం కోసం పోరాడాలని బలమైన కోరిక. కానీ నేను డిగ్రీ పూర్తి చేసే నాటికి(1990ల్లో) అమ్మాయిలు 'ఫైటింగ్ ఫోర్స్'లో చేరే అవకాశం లేదు. కేవలం డాక్టర్లు, నర్సులుగానే తీసుకునేవారు. అప్పుడే ఆలోచన వచ్చింది. నేను నేరుగా యుద్ధం చేయలేను.. కానీ యుద్ధం చేసే సైనికుడికి అవసరమైన ఆయుధాన్ని తయారు చేసి ఇవ్వగలను కదా! అనుకున్నా.

అలా బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ఎంచుకోవచ్చు. అప్పటికి ఆ సబ్జెక్టు దేశంలోనే కొత్త. మాది బహుశా దేశంలోనే తొలి లేదా రెండో బ్యాచ్. బీఎస్సీ పూర్తయ్యాక మాస్టర్స్ చేసి 1991లో డీఆర్డీవోలో అడుగుపెట్టా. 30 ఏళ్ల ఈ ప్రయాణంలో ఎన్నో క్షిపణి వ్యవస్థలు, రాడార్ల తయారీలో భాగమయ్యాను.

అమ్మే స్ఫూర్తి... మాది ఢిల్లీ, సాధారణ మధ్యతరగతి కుటుంబం. 40 ఏళ్ల క్రితం ఒకరి సంపాదనతో నలుగురు ఆడపిల్లలను పెంచడమంటే మాటలు కాదు. అమ్మ సంతోష్ కుటుంబ బాధ్యతల్ని చక్కగా నిర్వర్తించేవారు. తను సంస్కృతంలో పోస్ట్ గ్రాడ్యుయేట్, స్కూల్ ప్రిన్సిపల్‌గా రిటైర్ అయ్యారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బంది లున్నా సర్దుకుపోవడం తానే నేర్చారు. పిల్లలకు ట్యూషన్లు చెబుతూ నేను చదువుకునేదాన్ని మేం ఖరీదైన బట్టలు వేసుకోలేదు. విలాసాలు ఎరుగం. కానీ అమ్మ ఒకే మాట చెప్పేది.. తిండి, దుస్తుల విషయంలో రాజీ పడదాం.. కానీ మీ చదువు విషయంలో మాత్రం రాజీ లేదు. అదొక్కటే మీ తలరాతను మారుస్తుంది అని. అనారోగ్యం ఉన్నా, కష్టాలు చుట్టుముట్టిన ఆవిడ ఎప్పుడూ కుంగిపోలేదు. తనే నా మొదటి రోల్ మోడల్, పరిస్థితులు ఎలా ఉన్నా సరే, ఎదుర్కోవాలి అనే ఆత్మవిశ్వాసాన్ని అమ్మే అందించింది. ముందే మేల్కొన్నాం... నా కెరియర్‌లో అత్యంత సవాలుతో కూడిన, సంతృప్తినిచ్చిన ప్రాజెక్ట్.. 'యాంటీ డ్రోన్ సిస్టమ్' (సరిహద్దుల్లో డ్రోన్లతో జరిగే అక్రమ రవాణా అడ్డుకోవడం). ఆరేళ్ల కిందట ప్రపంచం ఇంకా డ్రోన్ దాడుల గురించి పెద్దగా భయపడట్లేదు. కానీ మన సరిహద్దుల్లోకి మాత్రం వాటితో ఆయుధాలు, డ్రగ్స్ రవాణా అయ్యేవి. అప్పుడు మా బృందం రంగంలోకి దిగింది. ఒక డ్రోను పసిగట్టడానికి రాడార్, దాన్ని జామ్ చేయడానికి జామర్, అవసరమైతే కాల్చడానికి లేజర్.. ఇలా మీరు ల్యాబ్లతను ఒక్కచోట చేర్చి ఓ అద్భుతమైన రక్షణ కవచాన్ని తయారు చేశాం. శత్రువు ఆలోచించేలోపే మనం పరిష్కారం కనుగొన్నాం. రెండు రెట్లు కష్టపడాల్సిందే! సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో, ముఖ్యంగా డీఆర్డీఓలో మహిళల సంఖ్య ఇంకా 20 శాతం మించలేదన్నది వాస్తవం. నిజం చెప్పాలంటే, ఒక మహిళ ఉన్నత స్థాయికి ఎదగడం అంత సులువు కాదు. ఆఫీసులో ఎంత పెద్ద సైంటిస్ట్ అయినా, ఇంటికి వెళ్లాక అమ్మగా, భార్యగా బాధ్యతలు మోయాల్సిందే. పురుషులతో సమానంగా గుర్తింపు రావాలంటే మనం వాళ్లకంటే రెట్టింపు కష్టపడాలి. కానీ, సహకరించే కుటుంబం దొరకడం నా అదృష్టం. పిల్లల్ని స్వతంత్రంగా పెంచండి. చిన్నప్పటి నుంచే వాళ్ల పనులు వాళ్లు చేసుకునేలా అలవాటు చేస్తే.. మన కెరియర్‌కి అదే పెద్ద సపోర్ట్. ◻

# ఈ అలవాట్లతో అందం దెబ్బతింటుంది



సౌందర్యపరంగా ఎన్ని జాగ్రత్తలు తీసు కున్నా. ఇందుకు మనం పాటించే కొన్ని అలవాట్లే కారణ మంటు న్నారు నిపుణులు. అవేంటో తెలుసు కుందాంరండి..


**తరచుగా తాకుతున్నారా?** రోజూ వివిధ పనులు చేసే మన చేతులతో తలుపులు, డోర్ నాబ్స్, పెన్నులు, టేబుల్స్.. ఇలా రకరకాల వస్తువులను తాకుతాం. ఫలితంగా వాటిపై ఉన్నమ్ము, ధూళి, దుమ్ము మొదలైనవన్నీ చేతులకు అంటు కుంటాయి.మళ్ళీ అవే చేతులతో ముఖాన్ని కూడా తాకుతున్నాం. చర్మ రంధ్రాల్లోకి చేరి చర్మ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. కాబట్టి పదే పదే ముఖాన్ని చేత్తో తాకకుండా జాగ్రత్తపడాలి. అలాగే ముఖం. కడుక్కునే ముందు చేతులను శుభ్రం చేసుకోవడమూ ముఖ్యమేనని నిపుణులు చెబుతున్నారు.

**మేకప్ తొలగించుకోకపోయినా..** కొన్ని రకాల మేకప్ ఉత్పత్తుల చర్మం మీద ఒక పల్చని పొరను ఏర్పరచి మేకప్ ఎక్కువ సమయం నిలిచి ఉండేలా. కాబట్టి ఇలాంటి ఉత్పత్తులను ఉపయోగించిన ప్పుడు మేకప్ త్వరగా తొలగించుకోవాలంటున్నారు నిపుణులు. లేదంటే చర్మం నిర్జీవంగా మారడం, మొటిమలు రావడం.. తదితర చర్మ సమస్యలు తలెత్తుతాయి. అలాగే రాత్రి పడుకునే ముందు కూడా మేకప్ తొలగించుకోవడం ముఖ్యమే.

**ఫోన్ ద్వారా..** స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ వల్ల కూడా ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫోన్ మాట్లాడేటప్పుడు చెవి దగ్గర్నుంచి బుగ్గల దాకా చర్మానికి ఫోన్ స్క్రీన్ తాకుతుంటుంది. ఫలితంగా ముఖానికి ఉన్న మేకప్ ఫోన్ స్క్రీన్‌కు అంటుకుంటుంది. దానిని శుభ్రం చేయకపోతే సూక్ష్మ క్రిములు దానిపై చేరతాయి. తిరిగి అదే ఫోన్ చర్మాన్ని తాకినప్పుడు అవన్నీ చర్మరంధ్రాల్లోకి చేరి.. మొటిమలు, మృతకణాలకు కారణవుతాయని చెబుతున్నారు నిపుణులు. కాబట్టి ఎప్పటికప్పుడు ఫోన్ స్క్రీన్‌ని శుభ్రం చేయడంతో పాటు మాట్లాడేటప్పుడు కూడా ఫోన్ చర్మానిక తాకకుండా జాగ్రత్తపడాలి. ◻

# తిరుప్పావై

## 29వ పాశురము



శిత్తుం శిఱుకాలే
వందున్నైచ్చేవిత్తు, ఉన్
పొత్తామరై యడియే పోత్తుం
పారుళ్ కేళాయ్
పెత్తం మేయుత్తుణ్ణుం
కులత్తిల్ పిఱందు, నీ
కుత్తేవల్ ఎంగళై క్కొళ్ళామల్
పోగాదు,
ఇత్తైప్పఱై కొళ్వా నన్రుగాణ్ గోవిందా,
ఎత్తైక్కు మేళళు పిఱవిక్కుం,
ఉందన్నోడు
ఉత్తోమేయావోం ఉనక్కేనాం
ఆట్చెయ్‌వోం
మత్తైనం కామంవగళ్ మత్తేలో
రెంబావాయ్.

బాగా తెలవారకముందే వచ్చి మిమ్ములను సేవించాలి. తామరపూలవంటి సుందరము లైనట్టి పాదములకు వందనములు, మేము వచ్చిన కారణము తెలుపు వారు. పశువులను మేపుతూ జీవనం సాగించు గోపకుల వంశములో పుట్టిన మీరు అంతరంగ కైంకర్యములు మాచే స్వీకరించుట తగదు. నేడు 'పరఖి తీసుకొని వెళ్ళుటకు రాలేదు. ఓగోవిందా ఏడేడు జన్మలు మీతో విడిపోని బంధము మాకు కావలెను. దాస్యముచేయ దలచాము. మా ఇతర కోరికలను పోగొట్టుము.

ఫలం: "సంపూర్ణ శరణాగతి"

# మసాలా జంతికలు




కావాల్సి నవి: బియ్యప్పిండి రెండు కప్పులు, సెనగపిండి ముప్పావు కప్పు, వెన్న పావు కప్పువాము, నువ్వులపొడిరెండు టీస్పూన్లు, పసుపు అర టీస్పూన్, ఉప్పు తగినంత, కారం టీస్పూన్, గరంమసాలా పొడి టీస్పూన్, చాట్మసాలా పొడి అర టీస్పూన్,

తయారీ: వెడల్పాటి పాత్రలో బియ్యప్పిండి, సెనగపిండి మిగిలిన పదార్థాలన్నీ వేసుకోవాలి. కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ పిండిని ముద్దల కలపాలి. జంతికల గొట్టంలో కొద్దిగా నూనె రాసి కొంచెం మిశ్రమాన్ని పెట్టాలి. కడాయిలో నూనె పోసి మరిగించి జంతికలు వేయాలి. మధ్యస్థంగా ఉండే మంట మీద రెండు వైపులా వేయించి తీయాలి. ◻

21 చుక్కలు
మధ్యచుక్క
11 వచ్చే వరకు



అడపాల మహాలక్ష్మి
బెంగళూర్





18 చుక్కలు
4 వరుసలు
ఇటు అటూ వదలి
4 వరకు



దీప్తి. ఎన్
నంది హిల్స్
హైద్రాబాద్

# ఫుడ్ పాయిజనింగ్ కాకుండా..




బయటే కాదు.. మనం ఇంట్లో శుభ్రమైన వాతావరణంలో వండిన పదార్థాలూ కొన్నిసార్లు విషతుల్యమయ్యే ప్రమాదం ఉంటుందంటున్నారు నిపుణులు ముఖ్యంగా ఆయా పదార్థాల్ని సరిగ్గా నిల్వ చేయకపోయినా వాటిలో సూక్ష్మ క్రిములు వృద్ధి చెంది. అది క్రమంగా ఫుడ్ పాయిజనింగ్‌కు దారితీస్తుందని చెబుతున్నారు. అందుకే పదార్థాలను నిల్వ చేసే విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**ఎందుకు విషతుల్యమవుతుంది?** .. సాధారణ గృహాలు ఉన్నప్పుడు వండిన ఆహార పదార్థాలను రోజంతా గది ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేసినా ఏమీ కాదనుకుంటాం. కానీ అలాంటి పదార్థాలు మనకు తెలియకుండానే కలుషితమయ్యే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. .. వండిన ఆహార పదార్థాలు లేదా మిగిలిపోయిన పదార్థాలను రెండు గంటల్లోపే ఫ్రిజ్‌లో పెట్టేయాలి. అది కూడా 5 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత వద్ద మాత్రమే నిల్వ ఉంటుంది. డిస్క్ (దీ) ఆహారం వండే పాత్రలు, గరిటెలు శుభ్రంగా కడగకపోయినా అందులోని ఆహారం 3 కలుషితమయ్యే ప్రమాదం ఉంది. పచ్చి మాంసంపై ఉండే ఆహారం కూడా ఫుడ్ పాయిజనింగ్‌కు దారితీసే ప్రమాదం ఉంది. కాబట్టి వాటిని ఇతర కాయగూరలు, పండ్లతో కాకుండా విడిగా తీసుకురావడం, నిల్వ చేయడం.. మంచిదని చెబుతున్నారు నిపుణులు. ◻

# తెర

# యూరప్‌లో 'పెద్ది' సాంగ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం పెద్ది. ఈ సినిమా పై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఐతే, తాజాగా ఈ సినిమాకి సంబంధించి మరో క్రేజీ న్యూస్ వినిపిస్తోంది. జనవరి - ఎండింగ్‌లో బుచ్చిబాబు, యూరప్ షెడ్యూల్ ను ప్లాన్ చేస్తున్నాడట. యూరప్‌లో చరణ్ పై సాంగ్ ను షూట్ చేయనున్నారని తెలుస్తోంది. అన్నట్టు సాంగ్ తో పాటు ఓ యాక్షన్ సీన్ ను కూడా షూట్ చేస్త కాగా ఈ సినిమా క్లైమాక్స్ ఓ భారీ ప్రమాదం కారణంగా హీరో పాత్రకి కాళ్ళు పోతాయని.. అయినప్పటికీ రన్నింగ్ లో హీరో ఛాంపియన్ అవుతాడని.. సినిమా చాలా ఎమోషనల్ గా ఉంటుందని వార్తలు వస్తున్నాయి. కాగా, ఇప్పటి వరకూ చరణ్ నుంచి వచ్చిన అన్ని చిత్రాల కంటే.. ఈ సినిమా చాలా భిన్నంగా ఉండబోతుందట. బుచ్చిబాబు రాసిన ఈ సినిమా స్క్రిప్ట్ చాలా భిన్నమైందట. ఈ సినిమాలో శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేంద్రు శర్మ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. మరి పెద్ది సినిమా ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో చూడాలి. రెహమాన్ ఈ చిత్రానికి స్వరాలు అందిస్తున్నారు.

# ప్రపంచవ్యాప్తంగా 183 కోట్ల మూవీ 'రాజా సాబ్'



రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన "రాజా సాబ్" మూవీ బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ జర్నీ కంటిన్యూ చేస్తోంది. ఈ సినిమా 3 రోజుల్లో వరల్డ్ వైడ్ 183 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించింది. రెండో రోజు మించిన కలెక్షన్స్ డే 3 దక్కించుకుంది ప్రెస్టీజియస్ మూవీ. హారర్ ఫాంటసీ జానర్ లో హయ్యెస్ట్ కలెక్షన్స్ అందుకున్న చిత్రంగా "రాజా సాబ్" నిలుస్తోంది. అన్ని వర్గాల ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ఈ సినిమాను తెరకెక్కించారు దర్శకుడు మారుతి. పీపుల్ మీడియా ఫ్యాక్టర్ బ్యానర్ పై గ్లోబల్ సినిమా స్థాయిలో గ్రాండ్ గా మూవీని నిర్మించారు ప్యాషనేట్ ప్రొడ్యూసర్స్ టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ తమ పర్ ఫార్మెన్స్ లు, అందంతో ఆకట్టుకున్నారు. సంక్రాంతి హాలీడేస్ సీజన్ లో ఫస్ట్ వీక్ "రాజా సాబ్" హ్యూజ్ నెంబర్స్ క్రియేట్ చేస్తుందనే అంచనాలు ఏర్పడుతున్నాం

# 'నందమూరి మోక్షజ్ఞ' మొదటి సినిమాకి రంగం సిద్ధం



మోక్షజ్ఞ మొదటి సినిమా 'ఆదిత్య 369'కి కొనసాగింపుగా రాబోతుంది. 'ఆదిత్య 999 మ్యాక్స్' అనే టైటిల్ తో మోక్షజ్ఞ కథానాయకుడిగా పరిచయం కానున్నాడు. కాగా ఈ సినిమాని ప్రముఖ దర్శకుడు క్రిష్ తెరకెక్కించనున్నాడు. ఆల్ రెడీ ఈ చిత్రం స్క్రిప్ట్ వర్క్ కూడా పూర్తి అయింది. కాగా ఈ జనవరి ఎండింగ్ లో ఈ సినిమాని పూజా కార్యక్రమాలతో అధికారికంగా మొదలు పెట్టనున్నట్లు తెలుస్తోంది. అలాగే, మార్చి ఫస్ట్ వీక్ నుంచి షూటింగ్‌ను స్టార్ట్ చేసే ప్లాన్‌లో ఉన్నారట. కాగా ఈ సినిమాలోని ఇతర క్యాస్టింగ్ పై క్రిష్ ప్రస్తుతం ఫోకస్ పెట్టాడట. అన్నట్టు ఈ సినిమాలో బలమైన క్యాస్టింగ్ కూడా ఉంటుందట. అలాగే, మోక్షజ్ఞ లుక్ కూడా చాలా స్టైలిష్‌గా ఉంటుందని తెలుస్తోంది. ఇక ఆ మధ్య తన వారసుడి ఎంట్రీ పై బాలయ్య మాట్లాడుతూ..'మోక్షజ్ఞను ఎలా ఇంట్రడ్యూస్ చేయాలో నాకు తెలుసు. మోక్షజ్ఞ కోసం ఒక ఐదు ఆరు స్క్రిప్ట్స్ నా మైండ్ లోనే రెడీగా ఉన్నాయి' అని చెప్పుకొచ్చారు. రచయిత సాయి మాధవ్ బుర్రా ఈ సినిమాకి డైలాగ్స్ రాస్తున్నారు.

# అనుకోకుండా ఇండస్ట్రీలోకి వచ్చా : రాణీ ముఖర్జీ



సినిమా అంటే గ్లామర్ కాదు తాను అనుకోకుండా సినీ ఇండస్ట్రీలోకి వచ్చానని, మొదటి సినిమా టైమ్ లో ఎంతో భయపడిన ఆమె, తర్వాత బాలీవుడ్ లో ఎంతో పెద్ద స్టార్ హీరోయిన్ అయినప్పటికీ, ఫస్ట్ సినిమా టైమ్ లో ఉన్న ఎనర్జీ, తడబాటును తాను ఇప్పటికీ ప్రతీ క్యారెక్టర్ లోకి తీసుకెళ్తున్నట్టు తెలిపారు. రాజా కీ ఆయేగీ బారాత్ సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసిన రాణీ, సినిమా అంటే కేవలం గ్లామర్ కాదని, అదొక బాధ్యత అని మొదటి సినిమాతోనే ఓ అవగాహన కల్పించారు. కెరీర్ స్టార్టింగ్ లోనే ఆత్మ గౌరవం కోసం పోరాడే పాత్రను చేయడంతో తర్వాత ఫ్యూచర్ లో చేసే క్యారెక్టర్లపై అది ప్రభావం చూపిందని ఆమె పేర్కొన్నారు. 1990 దశక రోజులు కెరీర్ పరంగానే కాకుండా ఎమోషనల్ గా కూడా తన లైఫ్ లో ట్రాన్స్‌ఫర్మేషన్ ను తీసుకొచ్చిందని ఆమె గుర్తుచేసుకున్నారు. ఆ టైమ్ లో వచ్చిన సినిమాలు, బాలీవుడ్ ఆడియన్స్ లైఫ్ లో ఎంతగా పాతుకుపోయాయో అర్థం చేసుకోవడానికి తనకు సహాయపడ్డాయని, ఆడియన్సే మన విధిని డిసైడ్ చేస్తారని, తన జర్నీని గొప్పగా తీర్చిదిద్దినందుకు ఆడియన్స్ కు రాణీ ముఖర్జీ కృతజ్ఞతలు తెలిపారు. సాథియా తో రాణీ కెరీర్ టర్నింగ్ 2000వ దశకం స్టార్టింగ్ లో రాణీ ముఖర్జీ సాథియా అనే సినిమా రాణీ కెరీర్లో ఓ గొప్ప టర్నింగ్ పాయింట్ గా నిలవగా, హమ్ తుమ్ లాంటి మూవీస్ ఆమెలోని కామెడీ యాంగిల్ ను చూపించగా, బ్లాక్ మూవీ తన కెరీర్‌లో అత్యంత డిమాండ్ ఉన్న సినిమాల్లో ఒకటిగా నిరూపించబడింది.

# మనోజ్ బ్రాండ్ ఫిల్మ్



పండుగ సందర్భంగా తెలుగు ప్రేక్షకుల కోసం దీన్ని రూపొందించారు. ఇందులో సంక్రాంతి పండుగ ఆత్మీయత అంతా ఘనంగా ప్రతిబింబి స్తోంది. అలాగే నిజంగా తెలుగు ప్రేక్షకులకు తిరుగులేని ఎంటర్‌టైన్మెంట్‌ను అందిస్తామనే జీ5 హామీ మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. మన పండగ, మన ఎంటర్‌టైన్‌మెంట్, మన తెలుగు జీ5 అనే కమ్యూనికేషన్ లైన్‌తో రూపొందిన ఈ క్యాంపెయిన్, ప్రాంతీయ సంస్కృతి, ప్రేక్షకులతో జీ5కి ఉన్న గాఢమైన అనుబంధాన్ని తెలియజేస్తోంది. సంక్రాంతి సంబరాల మధ్య తెలుగు ప్రేక్షకులకు తిరుగు లేని వినోదాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ బ్రాండ్ ఫిల్మ్‌ను రూపొందించినట్లు మేకర్స్ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా రూపొందించిన సంప్రదాయ గ్రామీణ మండువ ఇంటి సెట్‌లో రూపొందించిన ఈ బ్రాండ్ ఫిల్మ్.. పండుగ సందర్భంలో కుటుంబ సభ్యుల మధ్య ఉండే అనురాగం, ఆత్మీయత, సునిశితమైన హాస్యాన్ని ఆవిష్కరించారు. ఇందులోని కథను గమనిస్తే.. రాకింగ్ స్టార్ మంచు మనోజ్ తన గ్రామానికి బస్సులో ప్రయాణాన్ని ప్రారంభిస్తాడు. మధ్యలో మనకు కుటుంబ సభ్యుల మధ్య జరిగిన హాస్యభరితమైన సందర్భాలు, సరదాగా సాగిన చర్చలను పరిచయం చేస్తారు.

# 'నారి నారి నడుమ మురారి' ట్రైలర్



చార్మింగ్ స్టార్ శర్వా పర్ఫెక్ట్ సంక్రాంతి ఎంటర్‌టైనర్ నారి నారి నడుమ మురారితో అలరించబోతున్నారు. జనవరి 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కానుంది. సామజవరగమన ఫేమ్ కామెడీ మాస్ట్రో రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రం టీజర్, మొదటి రెండు పాటల ద్వారా భారీ అంచనాలను పెంచింది. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్ర ట్రైలర్ ఈరోజు విడుదలైంది. శర్వానంద్ రెండు డిఫరెంట్ టైమ్‌లైన్లలో, రెండు ప్రేమకథల్లో రెండు స్టైలిష్ లుక్స్‌లో కనిపించి తన కామిక్ టైమింగ్, డైనమిక్ షేడ్స్‌తో అదరగొట్టారు. సాక్షివైద్య తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకుంటే, సంయుక్త కథకు మరింత స్పైస్ యాడ్ చేసింది. శర్వానంద్ తండ్రిగా నరేష్ మరోసారి తన ప్రత్యేకమైన కామెడీ టైమింగ్ తో ఆకట్టుకున్నారు సత్య, సునీల్, సుదర్శన్, సంపత్ రాజ్‌ల కామెడీ నవ్వుల వర్షం కురిపిస్తుంది. తిరీ ఎంటర్‌టైన్ మెంట్స్ , అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణ విలువలు సినిమాకు మరో బలంగా నిలిచాయి. భాను బొగవరపు కథ, నందు సవిరిగాన డైలాగ్స్ ఆకట్టుకున్నాయి. ఈ సినిమాకి ఆర్ట్ డైరెక్షన్ బ్రహ్మ కడలి, సహ నిర్మాత అజయ్ సుంకర. ఆకట్టుకునే కథనం, నవ్వులతో నిండిన స్క్రీన్‌ప్లేతో ట్రైలర్ ప్రేక్షకుల్లో అంచనాలను పెంచింది. సంక్రాంతికి డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్, ట్రిపుల్ మ్యాడ్‌నెస్‌తో వచ్చే ఈ సినిమా ప్రేక్షకులకు పూర్తి స్థాయి పండుగ ట్రీట్ ఇవ్వనుంది.

## న్యూజిలాండ్ వన్డేల్లో..
# వికెట్ల ఫాస్ట్ బౌలర్లు
### 5 వికెట్లు తీసిన నలుగురు హీరోలు






**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టు 2026ని విజయంతో ప్రారంభించింది. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో సంచలన ప్రదర్శన కనబర్చి భారీ చేజింగ్ చేసిన టీమిండియా 6 వికెట్లు కోల్పోయి టార్గెట్ సాధించింది. ఇక స్వదేశంలో జరిగిన వన్డేల్లో న్యూజిలాండ్‌తో ఇప్పటి వరకూ జరిగిన మ్యాచ్‌ల్లో భారత బౌలర్లు కొన్ని బలమైన ప్రదర్శనలు ఇచ్చారు. భారత్‌లో కివీస్‌పై 5 వికెట్లు తీసి నలుగురు టీమిండియా బౌలర్లు రికార్డు సొంతం చేసుకున్నారు. సీనియర్ ఫాస్ట్ బౌలర్ మొహమ్మద్ షమీ స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన వన్డేల్లో రెండు సార్లు ఐదు వికెట్లు పడగొట్టాడు. ముంబైలో జరిగిన 2023 ప్రపంచ కప్ తొలి సెమీఫైనల్లో అతను 9.5 ఓవర్లలో 7/57 అద్భుతమైన స్పెల్లింగ్‌ను అందించాడు. ఆ మ్యాచ్‌లో షమీ అద్భుతమైన బౌలింగ్‌తో డెవాన్ కాన్వే (13), రాచిన్ రవీంద్ర (13), కేన్ విలియమ్సన్ (69), టామ్ లాథమ్ (0), డారిల్ మిచెల్‌లను అవుట్ చేశాడు. అదే ప్రపంచ కప్ లీగ్ దశలో ధర్మశాలలో షమీ 5/54 గణాంకాలను కూడా నమోదు చేశాడు. మొదట బౌలింగ్ చేస్తూ, అతను విల్ యంగ్ (17) ను అవుట్ చేసి, తరువాత రచిన్ రవీంద్ర (75) ను బాగా స్లో బాల్ తో అవుట్ చేసి, లోయర్ ఆర్డర్ ను క్లీన్ చేశాడు. అలాగే ఈ జాబితాలో భారత మాజీ ఓపెనర్ క్రిస్ శ్రీకాంత్ ఒక ఆశ్చర్యకరమైన పేరు. అప్పుడప్పుడు ఆఫ్ స్పిన్నర్ అయిన అతను 146 వన్డే మ్యాచ్‌ల్లో 25 వికెట్లు పడగొట్టాడు. అతని రెండు ఐదు వికెట్లు డిసెంబర్ 1988లో న్యూజిలాండ్‌తో జరిగిన స్వదేశీ సిరీస్‌లో వచ్చాయి. విశాఖలో జరిగిన తొలి వన్డేలో శ్రీకాంత్ ఏడు ఓవర్లలో 5/27 వికెట్లు తీసుకున్నాడు. కెన్ రూథర్‌ఫోర్డ్ (67), ఇయాన్ స్మిత్ (6), ట్రెవర్ ఫ్రాంక్లిన్ (21), జాన్ బ్రేస్‌వెల్ (12), క్రిస్ కుగ్గెలీజ్న్ (4) లను అవుట్ చేశాడు. ఇండోర్‌లో జరిగిన మూడో వన్డేలో, శ్రీకాంత్ ఆరు ఓవర్లలో 5/32 వికెట్లు పడగొట్టాడు. ఇక భారత మాజీ లెగ్ స్పిన్నర్ అమిత్ మిశ్రా 2016 అక్టోబర్‌లో విశాఖలో న్యూజిలాండ్ మ్యాచ్‌లో ఆరు ఓవర్లలో 5/18తో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. ఇది సిరీస్‌లో ఐదవ మరియు చివరి వన్డే. మిశ్రా రెండు మెయిడెన్ ఓవర్లు బౌలింగ్ చేయడంతో న్యూజిలాండ్ 23.1 ఓవర్లలో 79 పరుగులకే ఆలౌట్ అయింది. మిశ్రా రాస్ టేలర్ (19), బిజె వాట్లింగ్ (0), జేమ్స్ నీషమ్ (3), టిమ్ సౌథీ (0), ఇష్ సోధి (0) లను అవుట్ చేశాడు. భారత మాజీ ఆల్ రౌండర్ మనోజ్ ప్రభాకర్ 1995 నవంబర్‌లో అమృత్సర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 10 ఓవర్లలో 5/33 వికెట్లు తీసుకున్నాడు. ఆరు వన్డేల సిరీస్‌లో ఈ మ్యాచ్ రెండవది. మార్క్ గ్రేట్‌బ్యాచ్ (2), మార్టిన్ క్రో (2) లను అవుట్ చేయడం ద్వారా ప్రభాకర్ తొలి పురోగతి సాధించాడు. షేన్ థామ్సన్ (14), లీ జర్మన్ (9), డియోన్ నాష్ (0) లను కూడా అవుట్ చేసి తన ఐదు వికెట్ల పడగొట్టాడు.

## వరల్డ్ టేబుల్ టెన్నిస్ ఫీడర్‌లో ఛాంపియన్‌గా మనుష్

**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్ ఫీడర్ సిరీస్ 2026లో టాప్ సీడ్, హోమ్ ఫేవరెట్ భారత్‌కు చెందిన మనుష్ షా, కొరియా రిపబ్లిక్ కు చెందిన ర్యూ హన్నా వరుసగా పురుషుల, మహిళల సింగిల్స్ ఛాంపియన్‌లుగా నిలిచారు. ఐదు గేమ్‌ల ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో పయాస్ జైన్‌ను ఓడించి పురుషుల సింగిల్స్ ఫైనల్లో మనుష్ బలమైన పునరాగమనం చేశాడు. మొదటి రెండు గేమ్‌లను కోల్పోయిన తర్వాత, భారత ప్యాడ్లర్ 7-11, 10-12, 11-6, 11-6, 11-8 తేడాతో విజయం సాధించాడు. మరోవైపు, మహిళల సింగిల్స్ ఫైనల్ ఏకపక్షంగా జరిగింది. క్వాలిఫయర్ అనుషా కుటుంబలే అద్భుతమైన ప్రస్థానం కు ర్యూ హన్నా ముగింపు పలికింది. కొరియాకు చెందిన ర్యూ 11-6, 11-6, 11-5 తేడాతో వరుస గేమ్‌లలో గెలిచి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఐదు గేమ్‌ల మహిళల డబుల్స్ ఫైనల్‌లో భారతదేశపు టాప్ డబుల్స్ జోడీ సుతీర్థా ముఖర్జీ-అయిహికా ముఖర్జీలను ఓడించి, యూ యెరిన్‌తో కలిసి, కొరియా క్రీడాకారిణి ఆ రోజు తన ఖాతాలో రెండవ ట్రోఫీని జోడించింది. డబుల్స్ ఈవెంట్లలో పయాస్ జైన్ మెరిశాడు. సింగిల్స్ కిరీటాన్ని కోల్పోయినప్పటికీ, పయాస్ జైన్ డబుల్స్ విభాగాలలో విజయవంతమైన ప్రదర్శనను ఆస్వాదించాడు. సింన్డ్రెలా దాస్‌తో కలిసి, అతను నాలుగు ఆటలలో రెండవ సీడ్ హర్మీత్ దేశాయ్ మరియు యశస్విని ఘోర్పడేలను ఓడించి మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. ఆ తర్వాత జైన్ అంకుర్ భట్టాచార్జీతో కలిసి పురుషుల డబుల్స్ ట్రోఫీని గెలుచుకున్నాడు.




## కరాటే 1 సిరీస్‌లో.. పతకం సాధించిన తొలి మహిళ అలీషా

**న్యూఢిల్లీ:** కరాటే 1 సిరీస్ ఎ ఈవెంట్‌లో పతకం గెలుచుకున్న తొలి భారతీయ మహిళగా అలీషా చౌదరి నిలిచి, భారత కరాటే చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. జార్జియాలోని టిబిలిసిలో పోటీ పడుతున్న అలీషా సోమవారం మహిళల కుమైట్ 55 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించింది. ఇది దేశంలో ఈ క్రీడకు ఒక పురోగతి క్షణంగా నిలిచింది. అలీషా తన క్రొయేషియా ప్రత్యర్థిపై 8-0 తేడాతో ఆధిపత్య విజయంతో పతకాన్ని గెలుచుకుంది, కరాటే 1 సిరీస్ ఎ అనేది వరల్డ్ కరాటే ఫెడరేషన్ (డబ్ల్యూకెఎఫ్) కింద అత్యంత పోటీతత్వ ప్రపంచ సర్క్యూట్‌లలో ఒకటిగా పరిగణించబడుతోంది. ఈ విజయం భారతీయ కరాటేకు చాలా ముఖ్యమైనదిగా నిలిచింది. 2025లో, ఆమె ఆసియా సీనియర్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని కూడా గెలుచుకుంది. కాగా అలీషా రెండుసార్లు కామన్వెల్త్ క్రీడల్లో బంగారు పతక విజేతగా రికార్డులు సాధించింది. అలాగే దక్షిణాసియా స్థాయిలో రెండు పతకాలు గెలుచుకుంది. అలీషా రెండు సందర్భాలలో ప్రపంచ కరాటే ఛాంపియన్‌షిప్‌లలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. ఇది క్రీడలోని ఉన్నత వర్గాలలో ఆమె నిరంతర ఉనికిని ప్రతిబింబిస్తుంది. దేశీయంగా కూడా ఆమె ఆధిపత్యం ప్రదర్శించింది. ఆమె వరుసగా ఆరుసార్లు జాతీయ స్థాయిలో బంగారు పతకాలు, ఆల్ ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో వరుసగా నాలుగు బంగారు పతకాలు సాధించింది.

## హాకీ ఇండియా లీగ్‌లో..
# అగ్రస్థానానికి కళింగ లాన్సర్స్

**న్యూఢిల్లీ:** పురుషుల హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) 2025-26 మ్యాచ్‌లో కళింగ లాన్సర్స్ జట్టు షూటౌట్‌లో 3-1 తేడాతో హాకీ ఇండియా లీగ్ గవర్నింగ్ కౌన్సిల్ (హిల్ జిసి) పై విజయం సాధించింది. నిర్ణీత సమయంలో అజీత్ యాదవ్ (19వ నిముషం), అలెగ్జాండర్ హెండ్రిక్స్ (23) తమ తమ జట్ల తరపున గోల్స్ చేశారు. తొలి క్వార్టర్‌లో ఇరు జట్లు ఒక్క షాట్ కూడా కొట్టలేకపోయాయి. రెండో క్వార్టర్‌లో తొలి ప్రయత్నంలోనే హెచ్ఐఎల్ జిసి గోల్ చేసింది. కెప్టెన్ హార్దిక్ సింగ్ మిడ్‌ఫీల్డ్ నుంచి గోల్ చేశాడు. ఆ తర్వాత అజీత్ యాదవ్ (19) తన ప్రయత్నాన్ని దగ్గరి నుంచి కొట్టి డెడ్‌లాక్‌ను ఛేదించాడు. లాన్సర్స్ జట్టు గోల్‌పై రెండు షాట్లు, ఆరు పెనాల్టీ కార్నర్‌లు సాధించింది. అలెగ్జాండర్ హెండ్రిక్స్ (23) డ్రాగ్‌ఫ్లిక్‌తో చివరికి హెచ్ఐఎల్ జిసి గోల్ కీపర్ జేమ్స్ మజారెలోను దాటుకుని హాఫ్ టైం ముగిసే సమయానికి స్కోరును సమం చేశారు. రెండో అర్థభాగం జిసి ఓపెనింగ్ కోసం ప్రయత్నించింది. అయితే లాన్సర్స్ ఎదురుదాడిలో అలెగ్జాండర్ హెండ్రిక్స్ ద్వారా గోల్ స్థాయికి చేరుకున్నారు. అయితే చివరి క్వార్టర్‌లో జిసి కేవలం మూడు సర్కిల్ ఎంట్రీలను నమోదు చేయగా, కళింగ కేవలం రెండు మాత్రమే చేసింది. ఏ జట్టూ లక్ష్యం వైపు షాట్ కొట్టకపోవడం తో మ్యాచ్‌ను షూటౌట్ ద్వారా నిర్ణయించారు. ఇద్దరు గోల్ కీపర్లు తొలి ప్రయత్నాల్లో ఒక్కొక్కరు గోల్ ఇచ్చిన తర్వాత, జేమ్స్ మజారెలో, జెడ్ స్నోడెన్ తదుపరి రెండు షాట్ల ను సేవ్ చేశారు. అయితే దిల్‌ప్రీత్ సింగ్ షూటౌట్‌లో కళింగ లాన్సర్స్‌కు విజయాన్ని అందించగలిగాడు. ఫలితంగా హెచ్ఐఎల్ స్టాండింగ్స్‌లో కళింగ అగ్రస్థానానికి చేరుకుంది.





## విజయ్ హజారే ట్రోఫీలో సెమీస్‌కు కర్ణాటక
### ముంబయిపై 55 పరుగుల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** విజయ్ హజారే ట్రోఫీ-2026లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో కర్ణాటక ముంబైపై 55 పరుగుల తేడాతో విజయం సాధించి విజయ్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. బెంగళూరులో సోమవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో 255 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి కర్ణాటక 33 ఓవర్లలో 187/1తో ఉండగా, వెలుతురు సరిగా లేకపోవడం వల్ల ఆట ఆగిపోవడంతో వి.జయదేవన్ పద్ధతి ప్రకారం మ్యాచ్‌ను కర్ణాటకకు అప్పగించారు. దేవదత్ పడిక్కల్(81), కరుణ్ నాయర్ వరుసగా(74) నాటౌట్‌గా నిలిచారు. తక్కువ వెలుతురు కారణంగా అంపైర్ ఆటను నిలిపివేసాడు. టాస్ గెలిచి కర్ణాటక మొదట బౌలింగ్ ఎంచుకుంది, విద్యాధర్ పాటిల్ 3, విద్వత్ కావేరప్ప, అభిలాష్ శెట్టి తలా 2 వికెట్లు తీయడంతో ముంబై స్కోరు 254/8కి పరిమితమైంది. ముంబై తరఫున షమ్స్ ములాని ఒంటరి ఇన్నింగ్స్ ఆడి 86 పరుగులు చేశాడు. ముంబై ఇన్నింగ్స్ అంగ్క్రిష్ రఘువంశీ, ఇషాన్ ముల్చందాని తొలి వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ముల్చందాని(20) పాటిల్ చేతిలో ఔట్ అయ్యాడు. ముషీర్ ఖాన్ కొద్దిసేపటికే పాటిల్ చేతిలో 9 పరుగులు చేసి బౌలింగ్ వేశాడు. తర్వాత రఘువంశీ(27) కూడా వైశాక్ బౌలింగ్ లో ఔటయ్యాడు. దీంతో ముంబై 15 ఓవర్లలో 57/3 స్కోరుతో నిలిచింది. హార్దిక్ తమోర్‌ను కావేరప్ప కేవలం ఒక పరుగుకే అవుట్ చేయడంతో ముంబై పరిస్థితి మరింత దిగజారింది. సిద్దేష్ లాడ్, ములాని ఇన్నింగ్స్‌ను స్థిరంగా నడిపించారు. లాడ్‌ను శెట్టి(38) అవుట్ చేసే ముందు 76 పరుగులు జోడించారు. సూర్యాంశ్ షెడ్జ్ 16 పరుగులు చేసి కావేరప్పకు బౌలింగ్ వేశాడు. పాటిల్ తనూష్ కోటియన్‌ను అవుట్ చేయడం ద్వారా 3 వికెట్లు పడగొట్టాడు. ముంబై తరఫున అత్యధిక పరుగులు జోడించిన తర్వాత శెట్టి ములానిని అవుట్ చేశాడు. సిరాజ్ పాటిల్(33) మోహిత్ అవస్థి వరుసగా(1) నాటౌట్‌గా నిలిచారు, ముంబై ఇన్నింగ్స్ 50 ఓవర్లలో 254/8 వద్ద ముగిసింది. కాగా కర్ణాటక జట్టుకు మయాంక్ అగర్వాల్ మరియు పాడిక్కల్ శుభారంభం ఇచ్చారు, కానీ అగర్వాల్(12) అవస్థి చేతిలో ఔటయ్యాడు. ఆతర్వాత పాడిక్కల్ మరియు నాయర్ తమ అజేయ అర్ధ సెంచరీలతో ఛేజింగ్‌ను స్థిరపరిచారు. తదుపరి జయదేవన్ సిస్టమ్ ఆటను నిర్ణయించింది.

# ఈక్విటీ సూచీలకు ఇండో అమెరికా చర్చల ఎఫెక్ట్
## ర్యాలీ తీసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, జనవరి 12:** ఐదు రోజుల పాటు నష్టాలు చవిచూసిన దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాలతో గట్టెక్కాయి. అమెరికా నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు ఇన్వెస్టర్లలో విశ్వాసం నింపడంతో సూచీలు తిరిగి పుంజుకున్నాయి. మంగళవారం నుంచే భారత్‌అమెరికా మధ్య వాణిజ్య చర్చలు ప్రారంభమవుతాయని భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ చేసిన ప్రకటన మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. సెన్సెక్స్, నిఫ్టీ కీలక రంగాల్లో కొత్తగా కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో రోజులో నమోదైన కనిష్ఠ స్థాయిల నుంచి సూచీలు బలంగా కోలుకున్నాయి. సెన్సెక్స్ ఒక దశలో దాదాపు 1,100 పాయింట్లు పెరిగింది. చివరకు 302 పాయింట్లు లాభపడి 83,878 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నిఫ్టీ సూచీ కూడా ర్యాలీ తీసింది. ఇంట్రాడే కనిష్ఠ స్థాయి 25,473 నుంచి కోలుకుని, 107 పాయింట్ల లాభంతో 25,790 వద్ద ముగిసింది. 100 రోజుల ఈఎంఏ (25,540-25,600) కీలక మద్దతుగా నిలిచి, మార్కెట్ పుంజుకోవడానికి సహాయపడింది. తక్షణ నిరోధం 25,800-25,870 స్థాయిల్లో ఉందని మార్కెట్ నిపుణులు చెపుతున్నారు. మార్కెట్లలో ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.05 శాతం, స్మాల్‌క్యాప్ 0.52 శాతం మేర నష్టపోయాయి. ప్రస్తుతం ఇన్వెస్టర్లు సోమవారం సాయంత్రం విడుదలయ్యే డిసెంబర్ రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాల కోసం ఎదురుచూస్తున్నారు. అలాగే, ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌పై కూడా దృష్టి సారించారు. కమోడిటీస్ విభాగంలో, ముఖ్యంగా మెటల్స్ షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. ఇటీవల జరిగిన దిద్దుబాటు తర్వాత బ్యాంకింగ్, కన్స్యూమర్ స్టాక్స్‌లో విలువ ఆధారిత కొనుగోళ్లు జరిగాయని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఇన్ఫోసిస్, బజాజ్‌ఫైనాన్స్, భెల్ ఎల్‌అండ్‌టి హెచ్‌డిఎఫ్‌సి షేర్లు నష్టాలు చవిచూస్తే టాటా స్టీల్, ఏసియన్ పెయింట్స్, ట్రెంట్, ఎస్‌బిఐ, హిందూస్థాన్‌యూనిలీవర్ షేర్లు లాభపడ్డాయి. 15న మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో స్టాక్ మార్కెట్లకు సెలవు ప్రకటించారు. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 90.16గా నిలిస్తే పసిడి ఔన్స్ ఒక్కంటికి 4589 డాలర్లవద్ద కొనసాగింది. బ్రెంట్ ముడిచమురు 63.02 డాలర్లవద్దట్రేడ్ అయింది.

# రిటైల్ ద్రవ్యోల్బణం 1.66%
### కొన్ని రంగాల ఉత్పత్తులు పెరగడమే కీలకం




**న్యూఢిల్లీ, జనవరి 12:** భారత్ రిటైల్‌ద్రవ్యోల్బణం డిసెంబరు నెలలో 1.66 శాతానికి చేరింది. అదే నవంబరులో 0.71శాతం ఉన్న రిటైల్‌ద్రవ్యోల్బణం నెలతిరిగేసరికి గణనీయంగాపెరిగిందని కేంద్ర అర్థగణాంకశాఖ తెలిపింది. పర్సనల్‌కేర్ ఉత్పత్తులు, మాంసం, చేపతలు, కోడిగుడ్లు, చక్కెర, బేకరీ ఉత్పత్తుల ధరల్లో పెరుగుదలవల్లనే ద్రవ్యోల్బణం పెరిగిందని తెలుస్తోంది. వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు 28.07శాతంపెరిగాయి. మాంసం, చేపలు 5.12శాతం పెరిగితే కోడిగుడ్లు 4.76శాతం పెరిగాయి.ఇక కూరగాయల దరలు, పప్పుదినుసులు ధరలు కొంతమేర తగ్గాయి. కూరగాయల ధరలు 18శాతం తగ్గితే పప్పుదినుసులధరలు 15శాతంవరకూ తగ్గాయి. ఆహార ద్రవ్యోల్బణం మాత్రం ప్రతికూలంగానే ఉంది. డిసెంబరులో మైనస్ 2.71 శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆహారధరలు 3.08శాతం క్షీణించాయి పట్టణప్రాంతాల్లోకూడా 2.09 శాతం మేర క్షీణించాయి. ఆహార ఉత్పత్తులధరలు మాత్రం పెరిగాయి. కీలక ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో డిసెంబరునెలకుగాను 0.76శాతంగా ఉంది. పట్టణప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 2.03శాతంగా ఉంది. ఇక గృహనిర్మాణం, విద్య, ఆరోగ్యరంగాలపరంగా కూడా కొంతమేర సడలింపులు జరిగాయి. 2.95శాతంనుంచి 2.86 శాతంగా ఉన్నాయి. విద్యారంగానికి సంబంధించి 3.232శాతం, ఆరోగ్య రంగపరంగా 3.43శాతంమేర నమోదయ్యాయి. రవాణా రంగంపరంగా స్వల్పంగా క్షీణించింది. 0.88 నుంచి 0.76శాతానికి చేరింది. ఇక ఇంధనం, విద్యుత్‌రంగాల పరంగా 1.97శాతం, 2.32శాతంగా నమోదయినట్లు కేంద్ర మంత్రిత్వశాఖ ప్రకటించింది.



## 14% క్షీణించిన టిసిఎస్ నికరలాభం
### రాబడుల్లో మాత్రం 5% వృద్ధి

**ముంబయి, జనవరి 12:** ఐటి దిగ్గజం టిసిఎస్ సోమవారం ప్రకటించిన త్రైమాసిక ఫలితాల్లో రూ.10,657 కోట్ల నికరలాభం నమోదుచేసింది. గత ఏడాది ఇదే 3వ త్రైమాసికంలో రూ. 12,380కోట్లతో పోలిస్తే నికరలాభం 14శాతం క్షీణించింది. ఆదాయం మాత్రం గత ఏడాది ఇదే కాలంలో వచ్చిన రూ.63,973కోట్లకంటే ఐదు శాతం వృద్ధితో రూ.66,087 కోట్లకు చేరింది. ఈ ఏడాది రెండోత్రైమాసికంలో రూ.12,075 కోట్లతో పోలిస్తే నికరలాభంలో కూడా 12శాతం క్షీణత ఉంది. రాబడులు మాత్రం రెండుశాతం పెరిగాయి. కంపెనీ రెండు డివిడెంట్లు కూడా ఇచ్చింది.మూడో మధ్యంతర డివిడెండ్ ఒక్కోషేరుకు రూ.11 చొప్పున చెల్లించనున్నట్లు టిసిఎస్ ప్రకటించింది. స్పెషల్ డివిడెండ్ కింద ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.46 చొప్పున చెల్లించేందుకు టిసిఎస్ బోర్డు ఆమోదం తెలిపింది. ఈనెల 17వ తేదీని రికార్డుతేదీగా ప్రకటిస్తే ఫినరబవరి 3న చెల్లింపులుచేస్తామని టిసిఎస్ సిఇఒ ఎండి కె కృతివాసన్ తెలిపారు. ఎఐ నుంచి వచ్చే ఆదాయం 17శాతం వ1ద్ధిచెంది 1.8 బిలియన్ డాలర్లకు చేరిందని తెలిపారు. సమీక్ష త్రైమాసికంలో 9.3 బిలియన్ డాలర్ల కొత్త ఆర్డర్లు వచ్చాయన్నారు. అలాగే కంపెనీలో ఉద్యోగుల సంఖ్య కూడా క్షీణించింది. గడచిన మూడునెలల్లో ఉద్యోగులసంఖ్య 11,151 తగ్గినట్లు ఎక్స్ఛేంజిలకిచ్చిన నివేదికలో తెలిపింది. దీనితో మొత్తం ఉద్యోగుల సంఖ్య 5,82,163కి చేరింది.కొత్త లేబర్ ఓడ్‌వల్ల తమ ఆదాయంపై రూ.2128 కోట్లప్రభావం పడింది కంపెనీ వెల్లడించింది.ఫలితాల నేపథ్యంలో టిసిఎస్ షేరు విలువ బిఎస్ఇలో 0.86శాతం లాభంతో రూ.3235.70వద్ద ముగిసింది.

# 11.14% తగ్గిన హెచ్‌సిఎల్ నికరలాభం



**ముంబయి, జనవరి 12:** హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ ఐటి సేవల కంపెనీ మూడోత్రైమాసికంలో 11.14శాతం నికరలాబాల్లో క్షీణతను ఎదుర్కొంది. మార్కెట్ల తర్వాత ఆర్థిక ఫలితాలనుప్రకటించిన సంస్థ మూడోత్రైమాసికంలో రూ.4082 కోట్లు వచ్చిందని, అదే గత ఏడాది ఇదేకాలంలో 4594 కోట్లు వచ్చినట్లు చూపించింది. లేబర్ కోడ్‌లకోసం కేటాయింపుఇఉ 956 కోట్లకారణంగానే నికరలాభాల్లో క్షీణత వచ్చిందని తేలింది. కంపెనీ రాబడులు డిసెంబరు త్రైమాసికంలో రూ.33,872కోట్లుగా ఉంది. ఆరుశాతంపెరిగాయి. గత ఏడాది ఇదేకాలంలో వచ్చిన రాబడులకంటే 13.3శాతంపెరిగాయి. స్థిరమైన కరెన్సీ విలువలపరంగా రాబడులు త్రైమాసికం వారీగాచూస్తే 4.2శాతం, వార్షిక పద్ధతిలోచూస్తే 4.8శాతంపెరిగాయి. కంపెనీ మూడో త్రైమాసికంలో మొత్తం రాబడులు 34,257 కోట్లుగా ఉన్నాయి. ఏడాదిక్రితం 30,367 కోట్లనుంచి 12.8శాతంపెరిగింది. సేవలరంగపరంగా రాబడులు స్థిరంగా ఉన్నాయి. 1.8శాతం పెరిగింది. అడ్వాన్స్డ్ ఎఐనుంచి రాబడులు 20శాతంపెరిగాయి. 146 మిలియన్ డాలర్లుగా ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది.పన్నుల చెల్లింపులకుముందున్న నిర్వహణ లాభాలు రూ.6285 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాది ఇదేకాలంలో వచ్చిన లాభాలకంటే 8శాతంపెరిగాయి. మాక్లయింట్లకు పారిశ్రామికరంగాలు, సేవలరంగాలపరంగా ఎఐ డిమాండ్‌కు అనుగుణంగా సేవలు అం దిస్తామని కంపెనీ సిఇఒ ఎండి సి విజయ్‌కుమార్ తెలిపారు.

# రికార్డుస్థాయిలో ఇవి సేల్స్



**న్యూఢిల్లీ, జనవరి 12:** భారత్‌లో విద్యుత్ వాహనాల మార్కెట్ శరవేగంగా పెరుగు తోంది. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లు 8శా తంగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ వాహన్ పోర్టల్ డేటానుచూస్తే ఈవీ సేల్స్ 2.3 మిలియన్ యూనిట్లుగా ఉన్నాయి. ఇండియా ఎనర్జీ స్టోరేజి అలయన్స్ ప్రకారంచూస్తే విద్యుత్ టూవీలర్లు ఈవీ సేల్స్‌లో భారీ వృద్ధితో ఉన్నాయి. 1.28 మిలియన్ యూ నిట్లుగా ఉన్నాయి. మొత్తం ఈవీ సేల్స్‌లో 57శాతంవాటాతో ఉన్నాయి. ఎలక్ట్రిక్ త్రీవీలర్లు కూడా 0.8మిలియన్లుగా ఉన్నాయి. మొత్తం ఈవీ సేల్స్‌లో 35శాతంగా ఉన్నాయి. నాలుగు చక్రాల వాహనాలపరంగా 1.75 లక్షలయూనిట్లు విక్రయాలు జరిగాయి. చిన్న, తేలికపాటి వాణిజ్య వాహణాలు, గూడ్స్ కారియర్లు ఎక్కువ ఉన్నాయి. భారత్ ఆటోమొబైల్ మార్కెట్ 2025లో 28.2 మిలియన్‌ల రిజిస్ట్రేషన్లు నమోదుచేసింది. వీటిలో టూవీలర్ వాటాయే 72శాతంగా ఉంది. ఇక ప్యాపింజర్ కార్లు 4.4 మిలియన్ యూనిట్లు ఉంటే ట్రాక్టర్లు ఇతర వ్యవసాయసంబంధిత వాహనాలు 1.06 మిలియన్ల యూనిట్లు ఉన్నట్లు వాహన్‌పోర్టల్ గణాంకాలుచెపుతున్నాయి.




# భారత్ ఆర్థికవృద్ధి 7.4%: ఫిట్జ్ రేటింగ్స్ బిఎంఐ అంచనా

**న్యూఢిల్లీ, జనవరి 12:** భారత్ ఆర్థికవృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.4శాతం ఉంటుందని, వచ్చే ఏడాది అంటే 2027 ఆర్థికసంవత్సరానికి ఏడుశాతంగా ఉంటుందని ఫిట్జ్ గ్రూప్ కంపెనీ బిఎంఐ అంచనావేసింది. ప్రభుత్వ విధి విధానాలు సానుకూల తవల్లనే ఆర్థిక వృధిద సానుకూలం అవుతుందని అంచనావేసింది. జిడిపి వృద్ధి 7.4శాతం ఉంటుందని ఇప్పటికే కేంద్ర అర్థగ ణాంకశాఖ వెల్లడించింది. ఈ ఆర్థికసంవత్సరంలో రెండో అర్థ భాగంలో వార్షిక ప్రాతిపదికన ఏడుశాతం వరకూ చేరుతుందని అంచనావేసింది. ముందస్తు అంచనాలు 7.2శాతంగా ఉంటే వాటిని 7.4 శాతానికి సవరించింది. అలాగే వచ్చే సంవత్సరానికి కూడా 6.6శాతంగా వేసిన అంచనాలను సవరించి 7శాతంగా ప్రకటించింది. మూడో త్రైమాసికంలో అయితే తొమ్మిది శాతానికిపైగా వివిధ రంగాల్లో వృద్ధికనిపించిందని చెపుతోంది. మొదటిత్రైమాసికంలో 7.8శాతం, రెండో త్రైమాసికంలో 8.2శాతం చొప్పున నమోదయ్యాయి. జిఎస్టీ సంస్కరణలు, వ్యక్తిగత ఆదాయపపన్ను వ్యవస్థల్లో సడలింపులు, పన్నుభారం తగ్గింపులతో ఆర్థికవృద్ధికి ఆస్కారం ఏర్పడినట్లు తెలుస్తోంది. దీనికితోడు రిజర్వుబ్యాంకు కూడా ఇప్పటివరకూ మొత్తంగా 125 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ప్రభుత్వం కొత్త లేబర్‌కోడ్‌లను కూడా అమలులోకి తెచ్చింది. అలాగే స్థానిక బీమాసంస్థల్లో విదేశీ ఇన్వెస్టర్లకు 100శాతంపెట్టుబడులకు కూడా సడలింపులు రావడంతో వృద్ధి వేగవంతం అవుతుందని బిఎంఐ అంచనా.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.